ఆంధ్ర సచిత్ర వారపత్రిక



26-6-81
125 పైసలు


లిమ్కాతో అనుక్షణం
సేదతీరును మరుక్షణం
లిమ్కా, జమైకన్ నిమ్మ మరియు సిసిలియన్ నిమ్మపళ్ల పుల్లని, తీయని రుచి, సువాసనల సంగమం. బాక్టీరియా రహిత పానీయం. మీ దాహం తీర్చడానికి దీనిలో 'ఐసోటానిక్' లవణాలున్నాయి. విటమిన్ సి కూడా. కాలరీలు కావాలనుకునేవారు ఇతర పానీయాలకు బదులు లిమ్కానే ఎంచుకుంటారు.
లిమ్కా. మీ ఇంటిల్లిపాదినీ రంజింపజేసి అన్ని వేళలా మీ సేదతీర్చే పానీయం—ఇంటా, బయటా కూడా.
ఈతకొట్టి పైకొచ్చాక, ఇష్టంతో తాగేది లిమ్కా.
ఈత కొట్టాక సేదతీర్చే ఘటిక.
బాక్సింగ్ పిడులు మెచ్చేది, లిమ్కా వారికి నచ్చేది.
పోటీ తర్వాత సేదతీర్చే పానీ
సైకిలు తొక్కే సమయం, లిమ్కా పానం రసమయం.
షికారు తర్వాత సేదతీర్చే పానీయం.
పిక్నిక్ సరదా కిలకిలలు, లిమ్కా నవ్వుల గలగలలు.
బయటకు వెళ్లినప్పుడు సేదతీర్చే పానీయం.
కేంటీన్ కబుర్ల సమయంలో, మెదులును లిమ్కా మదిలో!
కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ తాగే పానీయం.
Limca
లిమ్కా
నిమ్మకాయ నీరూ మజా నిమ్మగోలి పానీయం.
RADEUS/PE/L-2-81

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభు ప్రసాద్
సంపాదకుడు
[1938 – 1972]

శుక్రవారం : 26-6-'81
దుర్మతినామ సం. జ్యేష్ఠ బ. నవమి
సంపుటము 74 : సంచిక 41

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ


*

పోస్టులో ఏడాది చందా రు. 67–60
ఆరు మాసాల చందా రు. 33–80
విడిప్రతి వెల రు. 1–25 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ–520 003

విషయానుక్రమణిక


అట్టమీద బొమ్మ :
నటి పద్మిని
(ఫొటో : జగన్మోహన్)

సమృద్ధమైన పంటలకు

అనువైన ఎరువులను సమర్థవంతంగా ఉపయోగించండి





మీ వేరుశనగ/కందులు పంటలకి విజయ్ 14-28-14 ఎంతో అనువైన ఎరువు.

వర్షాధారపు ప్రాంతాలలో మీరు రెండు పంటలు పండించలేనప్పుడు, వేరుశనగని ఒక పంటగా పండించేటప్పుడు దానిని కందులుతో మిశ్రమ పంటగా పండించవచ్చు. ఈ విధమైన మిశ్రమ పంటని పండింపడం వలన వివిధ పొరలలోని తేమ సమర్థవంతంగా ఉపయోగించబడుతుంది. బెట్ట పరిస్థితులలోకూడా ఒక పైరువలననైనా కొంత దిగుబడి ఉంటుంది. మిశ్రమ పంట పండిచేటప్పుడు ప్రతి 5 వరుసల వేరుశనగకి ఒకవరుస కందులు వేయాలి.

సిఫార్సు చేసిన ఎరువుల మోతాదు

	ఎకరానికి కిలోలలో
విజయ్ 14-28-14	45
మ్యూరేట్ ఆఫ్ పొటాష్	10

ఈ ఎరువులను నేలలో 5 సెం. మీ లోతుగానూ, విత్తనాలకు 5 సెం. మీ ప్రక్కగానూ పడేట్లు వేయాలి. ఈ విధంగా ఎరువులను, విత్తనాలను ఒకేసారి వేయడానికి వీలైన గొర్రులున్నాయి. ఇటువంటి గొర్రులు లభించనప్పుడు, మీరు రెండు మామూలు నాగళ్ళను వుపయోగించవచ్చు. ఒక నాగటి చాలులో 5 సెం. మీ లోతున విత్తనము వేస్తూ చాలును కప్పుతూ పోవాలి. రెండవ నాగలిని ఈ చాలుకు 5 సెం. మీ ఎడంగాతోలుతూ 5 సెం. మీ లోతున ఎరువులు పడేట్లు వేయాలి.

ఇంకా వివరాలకు ఈ క్రింది చిరునామానుండి ఈ పంటకు సంబంధించిన పుస్తకము తెప్పించుకొని తెలుసుకోండి.


పైర్లసరియైన పోషణకు విజయ్



ఏరియా మేనేజర్
మద్రాసు ఫర్టిలైజర్సు లిమిటెడ్
44, కాంతినగర్
హైదరాబాద్-500 028

VIJAY
MADRAS FERTILIZERS

ITM-MFL-2516



ఉత్తరాలు

రోదసీలో రోహిణి

12.6.81 వ తేదీ 'సీమ' శోభా సౌందర్యంగల ముఖచిత్రం ఆంధ్ర సచిత్ర వార పత్రికకు ఎనలేని అందాన్ని తెచ్చింది. ముఖ్యంగా లోపలిపేజీలలో రోహిణి ఉపగ్రహం గురించిన చిన్న వ్యాసం రంగు రంగుల ఫొటో నన్నెంతో ఆకర్షించినది. ఈ వారం చిట్టా రెడ్డి సూర్యకుమారిగారి నవల "రాజ్యాల" ప్రారంభం ఆనందం కలిగించినది. సంపాదక వర్గానికి నా అభినందనలు.

లక్కరాజు వెంకట ప్రఫుల్ల చంద్ర (ధర్మవరం)

* * *

నటి సీమ ముఖ చిత్రంగా వెలువడిన 12.6.81 వ తేదీ కొత్త వెలుగులు విరజిమ్మిన వారపత్రికలో, 'రోహిణి' రోదసి యాత్ర వర్ణ చిత్ర విశేషాలతో, సాంకేతిక పరమైన వివరణ విషయాలు నిజంగా "అత్యద్భుతం" అన్పించాయి. భారత్ ఈ విధంగా "స్పేస్ యుగంలో" మరో ఘన విజయం సాధించింది. మీరు ప్రచురించిన వర్ణ చిత్రాలు చూసాకా అసలు "వాటి" వద్ద నుంచొని చూసినా, అంతటి నిర్దిష్టత ఉండదేమో? అనిపించింది. మీరు చేసిన ఈ సదుపాయం అభినందనీయం. కత్తిరించి భద్రపరుచుకో దగ్గవిగా ఉన్నాయి. కథలు నాలుగు చక్కగా ఉన్నాయి. "సముద్రం అట్టడుగు నుండి నూనె" విశేషాలు విజ్ఞాన దాయకంగా ఉన్నాయి. 19 వ పేజీలో కార్టూన్లు చూసాకా 'ఎండలు తగ్గాయి' అన్పంత "కూల్‌గా" నవ్వుకున్నాం. కొత్త సీరియల్ ఇంటరెస్టింగ్‌గానే ఉంది.

పెన్మెత్స సూరిబాబు (హైదరాబాద్)

* * *

12.6.81 తేదీ నటి సీమ అందమైన ముఖ చిత్రంతో వెలువడిన పత్రిక మనోహరంగా వుంది. చిత్ర సీమలో నూతన వెలుగులు విరజిమ్ము చున్న అందాల నీలలామ సహజ నటి సీమ. ఆమె అంటే నాకు ఎంతో అభిమానం. అటువంటి అందాల భామ అభిమాన తార సీమ ముఖ చిత్రం మరింత సుందరంగా రూపొంది అందించినందుకు మీకు మా పాఠక లోకం తరపున అభినందనలు. రెండవ విషయం — "రోహిణి ఉపగ్రహం" విశేషాలు చక్కనైన కలర్ ఫోటోలతో చూడ చక్కగా ఉన్నాయి. సరిగ్గా ఉపగ్రహం ప్రయోగించినరోజునే పత్రిక కూడ మాకు చేరింది. ఒక ప్రక్క రేడియోలో ఉపగ్రహ వార్తలు వింటూంటే నిజంగా ప్రత్యక్షంగా చూచినట్లు అనుభూతి చెందాం ఫోటోలు చూస్తూ.

మటికొన ప్రకాష్ (విజయనగరం)

హైదరాబాదు నోట్‌బుక్

[illegible] విధానసభ ఎన్నికలు :

ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ల కాలపరిమితికి ముందే ఒక సంవత్సరం ముందుగానే విధానసభ ఎన్నికలు జరగవచ్చునని ముఖ్యమంత్రి శ్రీ అంజయ్య ఏప్రిల్ 30న ఇం. కాం. లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో తెలిపారు. కర్నాటక, మహారాష్ట్రలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోను ఎన్నికలు జరగాలని ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి అభిప్రాయపడుతున్నారని ఆయన తెలిపారు. చీరాల ఉప ఎన్నికలో ఇం. కాం. ఓటమి ప్రధానికి చాల కలవరం కలిగించిందని, అందువల్లే త్వరగా ఎన్నికలు జరిపించాలని భావిస్తున్నదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ పరిణామాలు ప్రధానికి ఆందోళన కలిగించాయి అనికూడా తెలుస్తున్నది.

తెలుగు ప్రాంతాలకు దక్షిణ మధ్య రైల్వే :

తెలుగు ప్రాంతానికంతా ఒకే రైల్వే మండలం ఉండాలన్న ఉద్యమం ఫలితంగా దక్షిణ మధ్యరైల్వే ఏర్పడింది. కొన్ని తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నీ దాని కిందికి రాలేదు. తూర్పున ఆగ్నేయ రైల్వేలోను, దక్షిణాన దక్షిణ రైల్వేలోను, పశ్చిమాన మరొక రైల్వేలోను తెలుగు ప్రాంతాలు మిగిలిపోయాయి. ఆ ప్రాంతాలన్నిటినీ దక్షిణ మధ్య రైల్వే కిందికి తేవాలని ఏప్రిల్ 8వ విధాన సభలో ఈ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. సభాపతి శ్రీ కోన ప్రభాకరరావు ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు. కన్నడ, మహారాష్ట్ర ప్రాంతాలయిన హుబ్లి, మన్మాడ్—పూర్ణా డివిజనులను దక్షిణ మధ్య రైల్వేనుంచి తొలగించాలని ఈ తీర్మానం కోరింది. కాని, మన దేశం భౌగోళిక పరిస్థితినిబట్టి భాషారాష్ట్రాలలోను అంచులలో ఇతర భాషల వారు మిగిలిపోయినట్టు, రైల్వే మండలాలు కూడా ఖచ్చితంగా ఉండగలవా అని నా సందేహం. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో లాగ రాష్ట్రాలను గిరి గీచినట్టు మన దేశంలో గీచడం సాధ్యం కాదు. ఒక అప్పడాన్ని అంచులు విరిచినట్టు మన రాష్ట్రం అంచులు విరిగిపోయి, ఇతర రాష్ట్రాలలో చేరాయి. అలాగే మనరైల్వే మండలంలో ఇతర భాషా ప్రాంతాలు, ఇతరరైల్వే మండలాలలో మన భాషా ప్రాంతాలు మిగిలి పోయాయి.

మంత్రి శ్రీ రాజారాం దుర్మరణం :

రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి శ్రీ జి. రాజారాం మే 10వ తేది ఉదయం స్వగ్రామం నుంచి రాజధానికి కారులో వస్తూ, రాజధానికి 48 మైళ్లలో రామాయంపేట వద్ద కారు ఒక చెట్టుకు గుద్దుకుని దుర్మరణం పాలయ్యారు. ఆరు లక్షల రూపాయల విలువగల కారు తుక్కు తుక్కయింది. శ్రీ రాజారాం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వాణిజ్య శాఖ పట్టభద్రులైన పిదప క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. పోలీసు చర్యల తర్వాత సోషలిస్టు పార్టీలో చేరి అప్పటి హైదరాబాదు శాసనసభకు ఎన్నికయ్యారు. న్యాయపతి మాధవరావు కమిషన్‌లో సభ్యులు. పిదప కాంగ్రెసుపార్టీలో చేరి నాలుగు సార్లు విధాన సభకు ఎన్నికయ్యారు. ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో శ్రీ మర్రి చెన్నారెడ్డి నాయకత్వాన ఉన్న తెలంగాణా ప్రజాసమితికి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. శ్రీ పి. వి. నరసింహారావు మంత్రివర్గంలో తొలిసారిగా మంత్రి అయి, తరువాత ప్రతి మంత్రివర్గంలోను ఉన్నారు. కాంగ్రెసులో చీలికలు వచ్చినపుడు ఇందిరాగాంధి పక్షం చేరారు. ముఖ్యమంత్రి పదవికి డాక్టర్ చెన్నారెడ్డితో పోటీ పడ్డారు. కాని పోటీ నుండి విరమించుకొన్నారు. డాక్టరు చెన్నారెడ్డి తర్వాత తప్పక ముఖ్యమంత్రి కాగలరని కొందరు ఆశించారు.

డాక్టర్ కె. ఎల్. రావు సూచన :

సుప్రసిద్ధ ఇంజనీరు, కేంద్ర మాజీమంత్రి డాక్టర్ కె. ఎల్. రావు మే 17 న పత్రికా ప్రతినిధులతో ముచ్చటిస్తూ, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలలో నిరంతరం సంభవించే కరువు కాటకాలను తొలగించడానికి కృష్ణానదికి జగ్గయ్యపేట సమీపంలోని పులిచింతలవద్ద జలాశయం నిర్మించాలని కె.ఎల్.రావ్ చెప్పారు. ఈ జలాశయం నిర్మిస్తే తప్ప రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలు సస్యశ్యామలం కావని ఆయన అన్నారు. ఈ జలాశయం సర్వేక్షణం దాదాపు ఏడు దశాబ్దాలనాడే జరిగిందని ఆయన తెలిపారు.

— తిరుమల రామచంద్ర

పశ్చిమగోదావరిజిల్లాలోని గణపవరంలో జూన్ మొదటి వారంలో జరిగిన ఘోర అగ్నిప్రమాద దృశ్యం. ఈ ప్రమాదంలో 14 మంది స్త్రీలు, పిల్లలు దుర్మరణంపాలైనారు. 300 యిళ్ళు పరశురామ ప్రీతి అయినాయి. 500 కుటుంబాలు నిరాశ్రయమైనాయి. దాదాపు 50 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని అంచనా.



సీరియల్

ఇంద్రసింహాసనం

సి. ఆనందారామం

24

(గత సంచిక తరువాయి)

స్వర్గానికి ప్రయాణం అనగానే దేవయాని ఉత్సాహంగా బయలుదేరటానికి కారణం కచుడు. ఆనాడు మృత సంజీవని పొంది స్వర్గానికి వెళ్ళిపోయిన తరువాత కచుడు ఏనాడూ కనపడలేదు. ఒక్కసారి అతడిని చూడాలని ఎంతో ఆరాటంగా ఉంది ఆమెకి.

స్వర్గం తలుచుకోగానే తాను ఏనాడూ చూడని తల్లి విచిత్ర కథ గుర్తుకొస్తుంది దేవయానికి. పెద్దల రాజకీయాలకు పావులా బలి అయిపోయిన అబల జీవితం. తనకు తల్లి పోలికే వచ్చినట్లుంది. తన జీవితమూ, ఇంచుమించు తల్లి జీవితంలాగే వుంది. ఇంకా తన తల్లే అదృష్టవంతురాలు. కొంతకాలమైనా ప్రేమించిన వాడితో సంతృప్తిగా జీవితంగడిపింది.

తన ఆలోచనలకు ఉలికిపడింది దేవయాని. ఛీ! ఏమిటిలా వస్తున్నాయి, తనకు ఆలోచనలు? తను వివాహితురాలు! కచుణ్ణిగూర్చి మరొక ఆలోచన తనకు లేదు. చిన్ననాటి స్నేహితుడు గనుక ఒకసారి చూడాలని మాత్రమే కోరుకొంటుంది. అంతే!

ఇంద్రాణి దేవయానిని ఒక ప్రత్యేక భవనంలో ఉంచింది సకలసౌకర్యాలూ అమరేలా చూసింది తనభవనంలోమాత్రం బసకల్పించలేదు. అది దేవదానవ యుద్ధంప్రారంభదశలో ఉన్న సమయం. ఇంద్రాణి భవన మన్నివేళలా ప్రముఖులతో, రాయబారులతో, గూఢచారులతో నిండి వుంటోంది. ఈ యుద్ధ సమయంలో దిక్పాలకులందరికీ ఏకాభిప్రాయం కలిగించటానికి ఇంద్రాణి చాలా శ్రమపడవలసి వచ్చింది. ఒకవంక దానవులు దండెత్తివచ్చినా తమలో తాము అధికారాలకోసం కీచులాటలు మానలేదు, ఆ మహానుభావులు!

"ఇది మనకు పరీక్షా సమయం! మన విభేదాలెలావున్నా స్వర్గం రాక్షసుల హస్తగతం కాకుండా మనమంతా కలసికట్టుగా పోరాడాలి. ఒకసారి రాక్షసులు స్వర్గం స్వాధీనం చేసుకొంటే, మనలో ఎవరినీ స్వర్గంలో నిలవనీయరు. భూలోకంలో కూడా మనకు పూజలుండవు."

ఈ మాటలతో దిక్పాలకులంతా ఒకటయ్యారు. చివరకు నిరృతి కూడా తిరుగుబాటు మానేసాడు. ఇంద్రాణి భవనంలో ఎవరినోట విన్నా యుద్ధవార్తలే! ఎప్పుడూ యుద్ధ వ్యూహాలకు సంబంధించిన రహస్య సమాలోచనలే!

తను వచ్చిన పని కాకపోగా, అనేకుల జీవితాలలో చిచ్చుపెట్టిన యుద్ధ వాతావరణమే అక్కడా కనిపించేసరికి దేవయానికి చికాకు కలిగింది — స్వర్గంలో కచుడెక్కడ ఉన్నాడో తెలుసుకోవాలని, విమానం మీద స్వర్గమంతా విహరించి వస్తానంది—ఇంద్రాణి ఒప్పుకోలేదు. "నువ్వు నా ఆధీనంలో ఉన్నంతవరకే నీకు భద్రత— నువ్వు రాక్షస గురువైన శుక్రాచార్యుల కూతురివి — ఈ యుద్ధ సమయంలో స్వర్గంలో యథేచ్ఛగా తిరగటానికి వీల్లేదు" అంది.

దేవయానికి చాలా ఆశాభంగం కలిగింది. తిరిగి భూలోకానికి పోవాలనుకొంది. కానీ, అంత తేలిగ్గా తాను కోరిన కోరిక వదులుకొనే తత్వంకాదు ఆమెది. ఆలోచించి "నేను బృహస్పతిగారి భవనానికి వెళ్తాను" అంది.

జరిగినకథ — 11: వృషపర్వపురానికి చెందిన రాక్షసరాజు వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ అందం, తెలివితేటలు, ధైర్య సాహసాలు కల రాకుమారి. ఆమె, మానవ రాకుమారుడు యయాతి ఇరువురూ ఒకరినివిడిచి ఒకరు వుండలేనంత గాఢంగా ప్రేమించుకొంటారు. యయాతిని కలుసుకొని తమ నగరంపై దేవతల దండయాత్ర ఆపించమని శర్మిష్ఠను వృషపర్వుడు ఆజ్ఞాపిస్తాడు. తమ అనుబంధానికీ, రాజకీయాలకూ తండ్రి ముడిపెట్టడం ఇష్టంలేకపోయినా యయాతిని కలుసుకోవచ్చుననేభావం ఆమెకు ఆనందం కల్గిస్తుంది. ఇంద్రుడు చేసిన ఘోరాలను సహించలేక సప్తఋషులు అతన్ని పదవీచ్యుతుని గావించి, ఆ స్థానంలో యయాతి తండ్రి నహుషుడ్ని నియమిస్తారు. అతన్ని ఎలాగయినా దింపేసి మళ్ళీ ఇంద్రుడ్ని ఆ స్థానంలో నిలబెట్టాలని ఇంద్రాణి శచీదేవి ఆలోచిస్తూంటుంది. ఆమెకు నారదుడు సహాయపడతాడు. అతడు నహుషుణ్ని రెచ్చగొట్టి, అగ్ని, వాయు, వరుణ, నిరృతులలో పరస్పర కలహాలూ, అధికార దాహమూ రగిలేటట్లు ప్రవర్తిస్తాడు. యయాతీ, శరిష్ఠలను ఒకటిగా చేస్తుంది ఇంద్రాణి. మహేంద్రుని ఆజ్ఞను ధిక్కరించాడనే నెపంతో జయంతుని యమలోకానికి పంపిస్తాడు నహుషుడు. తనకు అనుకూలుడైన వాడిని యముడి స్థానంలోఉంచి, తన కొడుకును నిర్దోషిగా నిర్ణయించేటట్లు చేస్తాడు నహుషుడు. దీనివి ముల్లోకాల ప్రజలందరూ ప్రతిఘటించడంతో జయంతుణ్నికూడా విడుదలచేయక తప్పలేదు. జయంతుడు భూలోకంలో విమానాల తయారీకి పూనుకొంటాడు. శత్రువర్గంతో చేతులు కలిపి, శుక్రాచార్యుల తపసు భంగం కాకుండా అడ్డుపడిందని ఇంద్రాణిని సభకు రప్పించి, విచారణ జరిపించి అపకీర్తి పాలవుతాడు నహుషుడు. స్వర్గంలో వుండలేక భూలోకానికి వచ్చేస్తాడు యయాతి. దేవయాని దాస్యం నుండి శర్మిష్ఠను విడిపించాలనే ఉద్దేశ్యంతో దేవయానిని వివాహమాడతాడు యయాతి. కాని అతని అంచనాలు తల్లక్రిందు లవుతాయి. దేవయాని శర్మిష్ఠను భూగృహంలో బంధించుతుంది. దేవయానికి శర్మిష్ఠపై గల కోపానికి కారణం యయాతికి చెప్తుంది శర్మిష్ఠ పరిచారిక విమల. ఆ తరువాత శర్మిష్ఠను విడుదల చేస్తుంది దేవయాని, దేవకన్య చెప్పగా. దేవయాని దేవలోకానికి వెళ్ళిన సమయంలో శర్మిష్ఠను వివాహమాడతాడు యయాతి.

ఆమె కోరికలోని అంతర్యం గ్రహించి జాలిగా నవ్వుకొంది ఇందాణి. దేవకన్యను అంగరక్షకురాలిగా నియమించి బృహస్పతి భవనానికి పంపింది

ఒకనాడు తానెరిగిన జయంతికి ప్రతి రూపంలా ఉన్న దేవయానిని చూసి ఆశ్చర్య పోయాడు బృహస్పతి. దేవకన్య దేవయానిని పరిచయం చేసింది. ఆ మహామేధావి ముఖాన మబ్బులు కమ్మాయి. దేవయాని రాకకు కారణం అతను గ్రహించాడు. ఆదరంగా ఆమెను కూచోపెట్టాడు. తారను పిలిచి ఆమెకు దేవయానిని చూపి ఎవరో చెప్పాడు. తార అంత ఆదరం చూపలేదు. ముక్తసరిగా పలకరించి ఊరుకుంది.


తార గతం దేవయాని మనసులో మెదలింది! ఈ తార తన భర్తకు శిష్యుడైన చంద్రుణ్ని—తనకంటే చిన్నవాడైన చంద్రుణ్ని మోహించింది- చంద్రుడు తారను తీసుకొని వెళ్లిపోయాడు. బుధుడనే కొడుకు కూడా జన్మించాడు — తార కోసం చంద్రుడికీ బృహస్పతికీ తీవ్రమైన వివాదం చెలరేగింది! అదనుకోసం కాచుకొని ఉన్న రాక్షసులు చంద్రుడి పక్షం చేరి బృహస్పతిని పడగొట్టాలని చూసారు. అక్కడితో దేవతలందరూ ఈ విషయంలో కల్పించుకొని చంద్రుడికీ బృహస్పతికీ రాజీ చేసారు. బుధుడిని మాత్రం చంద్రుడి కప్పగించి, తారను బృహస్పతి వశం చేసారు. అక్కడితో వివాదం ముగిసింది. ఈ బృహస్పతి మాత్రం? తమ్ముడి భార్య అయిన మమతను కామించి బలాత్కరించబోయాడు. తాను అలాంటివాడైనా భార్యను మాత్రం క్షమించలేదు. ప్రతిష్ఠ కోసం తారను తన దగ్గరకు తెచ్చుకొన్నాడే కాని, ఆమెను ఏనాడూ భార్యగా చూడలేదు! బృహస్పతి భవనంలో ఆమె జీవచ్ఛవంలా బ్రతుకుతోంది. బహుశః మనసులో చంద్రుణ్ని ధ్యానించుకొంటూ...

బృహస్పతికి మరొక భార్య ఉంది. ఆమె కొడుకే కచుడు.

ఆహా! ఏం దేవలోకం! ఏ లోకంలోనైనా వింత నిర్భాగ్యంగా ఉంది ఆడదాని జీవితం.

బృహస్పతి చిరునవ్వుతో "దేవతలమైనా మాకీ బలహీనతలేమిటని ఆలోచిస్తున్నావా, తల్లీ!" అన్నాడు. ఉలికిపడింది దేవయాని. తాను కూర్చొన్నది మహా మేధావి ముందు, అని అర్థం చేసుకొని మనసును ఇష్టం వచ్చినట్లు పరుగులు తీయనీయకుండా తన అదుపులో పెట్టుకొని కూర్చొంది.

"సృష్టి రహస్యమంతా ఇదే తల్లీ! మనసంతా ఒక ముద్ద కాదు. ఒక పదార్థం కాదు. అది అత్యద్భుతమైన చేతనశక్తి— దానిలో అనేకపొరలు, అంతులేని ఔన్నత్యమూ, అపారమైన అల్పత్వమూ ఒకే మనసులో కలిసి మెలిసి కాపురం చేస్తుంటాయి. ఒక మహా శిల్పి తాగుబోతవుతాడు. ఒక మహాగాయకుడు స్త్రీలోలుడవుతాడు. ఒకమహాకవి దురహంకారి



ఇంద్రసింహాసనం

అవుతాడు. తపస్వి కూడా అంతే! ఒక కోరిక మనసులో ఉన్నంతవరకూ, అది ఎలాంటి కోరిక అయినా సరే, ఎంత తపస్సు చేసినా, ఎంత ఆత్మశక్తి సాధించినా, ఆ కోరికను అనుసంధించి, ఎన్నో నీలి నీడలు మనసు నావరించుకోక తప్పదు. కోరిక స్వభావమే అలాంటిది. నేనూ అంతే! మీ తండ్రీ అంతే! దేవలోకానికి ఆచార్యుడు కాలేక పోయాననే స్పర్థతోనే మీ తండ్రి రాక్షస గురువయ్యాడు. దేవగురువుగా నాలో కలిగిన అహంకారమే నా బలహీనతలకు కారణమయింది..."

తన తప్పులకు తాను పశ్చాత్తాప పడుతున్నట్లు కళ్ళు మూసుకొన్నాడు బృహస్పతి. పరిచారికలు దేవయానికి ఫలహారాలూ, మధుర పానీయాలూ అందించారు. దేవయానికి కావలసినవి ఇవన్నీ కావు. కచుడు జాడ తెలుసుకోవాలని ఆమె అంతరంగం ఆరాటపడుతోంది. "మీ భవనం చూస్తాను" అని భవనమంతటా కలయతిరిగింది. శయనాగారాలూ, పూజా మందిరాలూ, క్రీడాస్థలాలు, వినోద మంటపాలూ అన్నీ చూసింది. ఎక్కడా కచుడి జాడ తెలియలేదు, నిరాశతో తిరిగి వచ్చింది. ఆమె ముఖం చూసిన బృహస్పతి జాలితో కూడిన నవ్వుతో "కచుడిక్కడ లేడమ్మా! తపస్సుకు వెళ్ళాడు" అన్నాడు.

"తపస్సుకా? యుద్ధంలో దానవులను జయించటానికి కొత్త శక్తులు సంపాదించటానికా ?"

"కాదమ్మా! కాదు. మృతసంజీవని సంపాదించి రాక్షస రాజ్యం నుంచి వచ్చినప్పటి నుంచీ, కచుడు అలాంటి కోరికలన్నింటికి అతీతుడయిపోయాడు. ఇప్పుడతడు ఏ కోరికతోనూ తపస్సు చేయటం లేదు. తనను తాను తెలుసుకోవాలని తపస్సు చేస్తున్నాడు. తెలుసుకోగలిగితే సృష్టికంతకూ మూలమయిన మహాశక్తిలో ఒక భాగంగా అయిపోతాడు."

దేవయాని నివ్వెరపోయింది. బృహస్పతి మాటలామెకు అర్థం అయీ కాకుండా ఉన్నాయి. చదువుకొన్నది కనుక సిద్ధాంత రీత్యా అర్థమయ్యాయి—కానీ ఎంత ఆలోచించినా, అనుభవజ్ఞానానికి అందటంలేదు.

"కచుడిక్కడకు ఎప్పుడూ రాడా ?"

"ఏకాదశికి వస్తాడు. ఇక్కడ ఆశక్తి ఉన్న వారందరికీ జ్ఞానబోధ చేస్తాడు"

బృహస్పతికి నమస్కరించి, ఇంద్రాణి గూఢచారిణి దేవకన్య వెంటరాగా తన భవనానికి వచ్చింది. ఆ సాయంత్రం ఇంద్రాణి దేవయాని దగ్గిరకు వచ్చింది.

"స్వర్గంలో ఇంకా ఉంటావా? మీ లోకానికి వెళ్ళిపోతావా?" అని అడిగింది.

"ఏకాదశి వెళ్ళేవరకూ ఉంటాను."

"నీ యిష్టం!"

"నేను కూడా అరణ్యాలకుపోయి తపస్సు చెయ్యాలను కొంటున్నాను"

"మంచిదే! అరణ్యాల దాకా పోయేముందు నీ ఇంట్లోనే తపస్సు చేసి చూడు. ఈ భవనంలో నీ ఏకాగ్రతకు భంగం కలిగించే వారెవరూ లేరు."

ఇంద్రాణి వెళిపోయింది. దేవయాని ఆరోజు నుంచే, హంసతూలికా తల్పాలు వదిలి భూశయనం పాటిస్తూ - మితాహార నియమాన్ని అనుసరిస్తూ తపస్సు ప్రారంభించింది.

వింతగా యుద్ధ వ్యవహారాలలో చిక్కుకుపోయి ఉన్నా, ఇంద్రాణి దేవయానిని మరిచిపోదు. దేవయానిని చూడటానికి వచ్చింది. తపశ్చర్యతో దేవయాని కృశించిపోయింది. అయినా ఆమె ముఖంలోకి సాత్విక తేజస్సు రాలేదు ఒక అపూర్వమయిన కాంతి ఉంది. ఆ కాంతిలో అశాంతి నిండిఉంది.

"ఎంతవరకు వచ్చింది, నీ తపశ్చర్య?" అని అడిగింది ఇంద్రాణి.

"నేను సమాధిలోకి పోగలుగుతున్నాను — కానీ, ఆ సమాధిలో నేను ధ్యానముద్రలోఉన్న కచుణ్ని చూడగలుగుతున్నాను."

ఇంద్రాణి దయతో దేవయాని శిరసు నిమిరింది.

"మనసుకున్న శక్తి ఎంతటిదో తెలుసుకున్నావా, తల్లీ! నీ మనసు ఏకాగ్రంగా ఏది కోరుకుంటుందో, అది సమాధిలో దర్శించగలిగావు — ఆ కోరికను జయించగలిగితే జీవితాన్నే అదుపులోకి తెచ్చుకోగలవు."

"కానీ, కచుణ్ని చూడగలగటమే నాకు కావలసింది. నా తపస్సుకు ధ్యేయం అదే!"

"పిచ్చి తల్లీ!"

తన తల్లి ప్రేమ హృదయాన్నంతా వారసత్వంగా తెచ్చుకొంది ఈ దేవయాని కానీ విధి వక్రించి ఆ ప్రేమ సంఘ నీతికి విరుద్ధమయి పోయింది.

"కచుడికి కూడా నేను సమాధిలో కనిపిస్తానా?"

"నువ్వు అతడిని కోరుకొంటున్నట్లుగా అతడు నిన్ను కోరుకుంటే, తప్పకుండా కనిపిస్తావు."

దేవయాని మాట్లాడలేదు.

ఏకాదశి వచ్చింది. ఆ రోజు కోసమే ఎదురుచూస్తోన్న దేవయాని, తన తపస్సు చాలించి - జగన్మోహనంగా అలంకరించుకొని, ఉద్వేగంతో అదురుతోన్న హృదయంతో దేవకన్య వెంటరాగా బృహస్పతి ఇంటికి బయలుదేరింది. కానీ, అక్కడ ఆమె ఆశించినట్లు కచుడు కనిపించలేదు. బృహస్పతి ఆమెకొక తాటాకురేకు అందించాడు. దాని మీద ఇలా వ్రాసి ఉంది—

"పూజ్యులు, గురుదేవులు, పితృదేవులు, అయిన మీ పాదపద్మములకు ప్రణామాలు.

దేవయాని స్వర్గంలో ఉన్నట్లు తెలిసి నేను స్వర్గానికి రావటంలేదు. దేవయాని నన్ను కలుసుకోవటం మా ఇద్దరిలో ఎవరికీ మంచిది కాదు. భూలోకానికి వెళ్ళి ధర్మ మార్గాన జీవించమని నా మాటలుగాచెప్పండి.

కచుడు..."

ఆ తాటాకు రేకు క్రింద పడేసి గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది దేవయాని.

ఆ తరువాత ఆమె దుఃఖాన్ని ఎవరూ చూడలేకపోయారు. ఓదార్చలేక పోయారు. పిచ్చిదానిలాగా ఏడ్చింది. ఏడుపుతప్ప తనకేమీ లేనట్లు ఏడ్చింది. కొన్ని రోజులపాటు అలా ఏడుస్తూనే గడిపింది. ఆ తరువాత ఆ ఉధృతం తగ్గింది కాని, దేవయాని తన మనసును అదుపులోకి తెచ్చుకోలేకపోయింది. ఎవరేం మాట్లాడినా పిచ్చి చూపులు చూడసాగింది. కచుడు తనకు దూరమయినప్పటినుంచీ, భావనాలోకంలో అతడిని అందుకోవాలని దేవయాని ప్రయత్నిస్తూనే ఉంది. ఇప్పుడు తన పరిసరాలనూ, వాస్తవ జగత్తునూ, పూర్తిగా మరిచిపోయి భావనా జగత్తులోనే ఉండిపోతోంది. అప్పుడప్పుడు నవ్వుతుంది. మరికొన్ని సమయాలలో ఏడుస్తుంది. ఇంద్రాణి చాలా వ్యాకులపడి అశ్వినీదేవతలను పిలిచి వైద్యం చేయించింది. వారు అతి కష్టంమీద ఆమెను సాధారణదశకు తెగలిగారు. వారు తేగలిగారు అనటం కంటే, దేవయానే తనను తాను చక్కదిద్దుకొందని అనటం మంచిది. ఆమె తన పరిస్థితి అర్థం చేసుకొని ఉద్రేకాన్ని అదుపులో పెట్టుకొని, మనసుని నెమ్మదిగా స్వాధీనంలోకి తెచ్చుకొంది. స్వాస్థ్యంచిక్కిన వెంటనే "నేను భూలోకానికి పోతాను" అంది ఇంద్రాణితో. ఏ ఆశతో యింత యుద్ధసమయంలో కూడా స్వర్గానికి వచ్చిందో, ఆ ఆశ అడియాశ అయిపోయేసరికి స్వర్గంలో నిలవలేకపోయింది.

ఇంద్రాణి దేవకన్యలమతోడిచ్చి దేవయానిని విమానంలో భూలోకానికి పంపింది.

25

మణి దీపాలతో దేదీప్యమానంగా వెలిగి పోతున్న నూతన భవనాన్ని చూసి ఆశ్చర్యంతో "ఆ భవనం ఎప్పుడు నిర్మించారు? ఎవరి కోసం నిర్మించారు?" అని అడిగింది దేవయాని.

ఇంద్రసింహాసనం

పరిచారికలు తమ నవ్వు దాచుకోవటానికి అతి ప్రయాస పడుతూ "అది రాణి శర్మిష్ఠాదేవిగారి భవనం!" అన్నారు – దేవయాని తనను తాను మరిచి "ఏమన్నారూ?" అని ఒక పెద్ద కేక వేసింది. పరిచారికలకు నవ్వు దాచుకోవటం అతి కష్టమైపోతోంది. చాలా మంది ఏదో వంకన కొంగులు ముఖానికి చాటు చేసుకొంటున్నారు!

"రాణి శర్మిష్ఠాదేవిగారి భవనం – మహారాజుగారు శర్మిష్ఠాదేవిని వివాహం చేసుకొన్నారు. ఆమెకోసం నిర్మించిన భవనం అది!"

పరిచారికల నవ్వులు దేవయాని కర్ణమయ్యాయి ఆమె నిలువునా దహించుకు పోయింది అప్పటికప్పుడే పల్లకిని సిద్ధం చేయమని, శర్మిష్ఠ భవనానికి బయలు దేరింది. దేవయాని లోపలికి ప్రవేశించేసరికి యయాతి వీణ వాయిస్తోంటే, శర్మిష్ఠ నాట్యం చేస్తోంది దేవయానిని చూసి మహదాశ్చర్యకాలంలో సగం వేసిన శర్మిష్ఠ అడుగు ఆగిపోయింది. యయాతి సైగతో మరింత ఉత్సాహంతో ముందుకు కదిలింది. యయాతి చేతిస్పర్శతో, వీణ మనోహర రాగాలు పలుకుతోంది. చైతన్య కళారాగిణిలా ఉంది శర్మిష్ఠ సమ్మోహనాకృతి అసలే అందమైన శర్మిష్ఠ అపూర్వాకర్షణతో వెలిగిపోతోంది. దేవయాని కోపంతో ఏదో అనబోయింది రకరకాల వాయిద్యాలు వాయిస్తోన్న శర్మిష్ఠ చెలికత్తెలు రసభంగం భరించలేక తమ వాయిద్యాల శ్రుతి హెచ్చించారు. దేవయాని కంఠం ఆ వాయిద్యాల ధ్వనిలో అణగిపోక తప్పలేదు. అక్కడి పరిచారికలకు దేవయానికి భయపడవలసిన అవసరం లేదు గనుక పైకే పకపక నవ్వేసారు.

శిలా ప్రతిమలా నిలిచిపోయింది దేవయాని. ఇంతకాలం రాక్షసిలా పట్టుదల పట్టి తాను సాధించిన దేమిటి? తాను ప్రేమించిన కచుడు తన సమక్షంలోనే శర్మిష్ఠను దేవకన్యలకు తీసిపోదని అన్నాడు. శర్మిష్ఠను దాసిగా చేసుకున్నా– అందరి దృష్టిలో తాను శర్మిష్ఠ కంటే ఎంతో హీనురాలై పోయింది. కనీసం శర్మిష్ఠను బాధించానన్న తృప్తి కూడా దక్కకుండాపోయింది. జనుల హృదయాలలో మహోన్నత స్థానం పొందిన

శర్మిష్ఠను తన దాసీత్వం ఏనాడూ బాధించ లేదు. తన మనసులో ఏ మాత్రం ప్రేమ లేక పోయినా, తన కులం కాకపోయినా, శర్మిష్ఠ పైన విజయం సాధించటానికే యయాతిని పెళ్ళి చేసుకొంది. ఆనాడు భరింపరాని హృదయ వేదనతో విలవిలలాడుతున్న శర్మిష్ఠ ముఖం చూసినప్పుడు పైశాచికానందం కలిగింది.

కానీ... ఈనాడు... జీవిత మాధుర్యం నుండి శాశ్వతంగా వంచితురాలైన తాను జీవన మాధుర్యాన్ని మనసారా అనుభవిస్తున్న శర్మిష్ఠను చూడవలసి వస్తోంది. శర్మిష్ఠ తన కారణంగా ఎన్నడూ అవమానింపబడలేదు సరికదా, ఈనాడు తానే పరిచారికల ఎదుట అతి దారుణంగా పరాభవింప బడుతోంది. ఎలా నవ్వుతున్నారు వాళ్ళు ?

దాంపత్యమంటే, ఇదా ? ప్రేమ అంటే ఇదా ? ఎలా వెలిగిపోతోంది శర్మిష్ఠ ముఖం ఆనందంతో.

ఇలాంటి ఆనందం తనకేం తెలుసు ? రాచకార్యాలన్నీ ముగించుకొని, ఏ రాత్రి సమయానికో తన మందిరానికివచ్చి శర్మిష్ఠను విడిపించుకోవాలని ఇచ్ఛకాల ప్రేమ నటించే వాడు. అదంతా అర్థం చేసుకుని, మనసులో అసహ్యించుకొంటూ విధిలేక భార్యగా తనూ ప్రేమ నటించేది. వీలయినంతవరకూ ఏదో కారణంతో అలిగి దూరంగా పోయేది. అలాంటి సమయాల్లో అతనేనాడూ అనున యించేవాడు కాడు. ఏదో విముక్తి పొంది నట్టు హాయిగా నిద్రపోయేవాడు.

ఈనాడు ఆ శర్మిష్ఠా యయాతులను చూస్తోంటే, ప్రేమానుభవానికి అర్థమేమిటో తెలుస్తోంది.

దహించుకుపోతున్న హృదయంతో నాట్యం ముగిసేవరకూ దేవయాని అలా నిలబడేవుంది. నాట్యం ముగిసాక యయాతి వీణ క్రింద పెట్టి లేచి శర్మిష్ఠ చేయి పట్టుకొని దేవయాని ముందుకువచ్చి "నువ్వు ఎప్పుడు వచ్చావు ? వెళ్ళిన పని అయిందా ?" అన్నాడు ఆ మాటలతో దేవయాని ముఖం నల్లబడి పోయింది. అసలే ఆశాభంగంతో కుములు తోన్న ఆమె హృదయానికి ఈ వ్యంగ్యం శూలంలా గుచ్చుకొంది.

శర్మిష్ఠను పెళ్ళి చేసుకొన్నాడు. తన ఎదుటే ఆమె చెయ్యి పట్టుకు నిలబడ్డాడు ఏమీజరగనట్టు అతి మామూలుగా మాట్లాడు తున్నాడు. ఎదురు తనదే దోషమన్నట్టు వ్యంగ్యాలు విసురుతున్నాడు.

ఆమె హృదయం క్రోధంతో—రోషంతో— అవమానంతో మండిపోగింది. ఆ క్షణంలో ఆమె ఉచితానుచితాలు పూర్తిగా మరిచి పోయింది.

"శర్మిష్ఠ నా దాసి—నా బానిస — దానికి నిన్ను పెళ్ళి చేసుకునే అధికారంలేదు. దానిని నువ్వు పెళ్ళి చేసుకోవటానికి వీల్లేదు." శర్మిష్ఠను చేయిపట్టి లాగబోయింది. కానీ, యయాతి దృఢబంధం నుంచి ఆమెను తప్పించలేకపోయింది. శర్మిష్ఠ భయపడటం లేదు. బాధ పడటంలేదు. "నువ్వు నన్నేం చెయ్యగలవు?" అన్నట్టు చిరునవ్వుతో సగర్వంగా చూస్తోంది. ఆ చూపులు వెక్కి రిస్తున్నాయి, దేవయానిని. యయాతి చూపులు కూడా నిప్పులు కురుస్తున్నాయి. దేవయాని కాక ఆ స్థానంలో మరెవరుఉన్నా భయంతో పారిపోయి వుండేవారు.

"శర్మిష్ఠ నీ దాసికాదు. వృషపర్వ పురంలో ఉన్నంతవరకే నీ దాసి. ఈహస్తినా పురానికి రాజుని నేను. ఈ రాజ్యంలోని ప్రజ లందరూ రాణిలోసహా నా ఆజ్ఞకు కట్టుబడి ఉండవలసిందే! శర్మిష్ఠకు నేను విముక్తి కలిగించాను. ఈమెను నా రాణిగా నేను చేసు కొన్నాను."


పిడుగులు కురిపిస్తున్నట్టు మాట్లాడు తోన్న యయాతిని ఎదుర్కోవటం దేవయాని లాంటిదానికే సాధ్యం.

"అంటే? పెళ్ళి పేరుతో నన్నింత వంచి స్తావా? భర్తవనే అధికారంతో ఒక ఆడదానికి అన్యాయం చేస్తావా?"

"పెళ్ళి?! బ్రాహ్మణ స్త్రీవి. పెళ్ళి అంటే నీ వుద్దేశంలో మంత్రాలు కావచ్చు నేమోకాని క్షత్రియులమైన మా అభిప్రా యంలో పెళ్ళంటే రెండు ప్రేమైక హృద యాల కలయిక. ఈ అర్థంలో నా పెళ్ళి ఏనాడో శర్మిష్ఠతో జరిగింది. నీ పెళ్ళి ఏనాడో కచుడితో జరిగింది. ఇక, భర్తగా ఒక ఆడదానికి అన్యాయం చేసానంటావా? దేవయానీ! ఆడవాళ్ళకు అన్యాయంచేస్తున్నది కేవలం మొగవాళ్ళు మాత్రమే కాదనీ, ఒక ఆడది స్వార్థంతో, ఈర్ష్యతో, కక్షతో సాటి ఆడదాన్ని అధః పాతాళానికి అణిచెయ్యగలదనీ అందరికంటె నీకు బాగా తెలుసు. అన్నింటి కంటె మనం భార్యా భర్తలం ఎన్నడూ కాము. జంతువులెన్నో భార్యా భర్తృత్వ సంబంధం లేకుండానే సంతానాన్ని కంటు న్నాయి. భార్యా భర్తృత్వ సంబంధముంటే ఏమిటో ఇప్పుడు నీ కళ్ళెదుట చూస్తూనే ఉన్నావు."

యయాతి వల్ల...తన భర్తవల్ల...ఇంత అవమానాన్ని అదీ శర్మిష్ఠ సమక్షంలో పొంద వలసి రావటం దేవయాని సహించలేక పోయింది. తన ఆఖరు అస్త్రం దివ్యాస్త్రం ప్రయోగించింది.

"ఎవరి అధికారం గొప్పదో, ఎవరు ఎవరిని శాసించగలరో, త్వరలోనే తెలుస్తాము —



ఈ రోజే మా తండ్రి దగ్గరకు పోతున్నాను" గిరున వెనక్కు తిరిగి పాదాలతో నేలనుతంతూ భవనం దాటి పల్లకీలో కూచుంది. దేవయాని బయటకు పోయేవరకూ, ఎవరూ కదలలేదు, ఎవరూ మాటాడలేదు. అంతగా భయ విభ్రాంతులయిపోయారు. దేవయాని దృష్టి నుంచి దాటిపోగానే, శర్మిష్ఠ యయాతిని అల్లుకుపోయి పసిపిల్లలా ఏడ్చేసింది. యయాతి ఆమెను బుజ్జగిస్తూ "ఛ! అలా బేలవయిపోకు– నే నుండగా నిన్నెవరూ ఏమి చెయ్యలేరు" అన్నాడు.

శర్మిష్ఠ నీళ్ళు నిండిన తన కళ్ళెత్తి అతని ముఖంలోకి చూస్తూ "నాకేదైనా అవుతుందని నేను బాధపడటంలేదు. నా కారణంగా మీరు శాపాలకు గురి కావలసి వస్తుందని బాధపడుతున్నాను. ఇప్పుడేపోయి దేవయాని కాళ్ళమీదపడి శరణు వేడుకుంటాను. తనకు ఈ జన్మంతా దాసిగా దాసాను దాసిగా పడిఉంటానని ఒప్పుకొంటాను. ఈ జన్మకే కాక మరి పదిజన్మలకు కూడా దాసిగానే ఉంటాననీ, ఆ శాపాలన్నీ నా మీద గుమ్మరించమనీ, ప్రార్థిస్తాను" అంది.

ఆ నిర్మల ప్రణయిని తడి కళ్ళను ముద్దుపెట్టుకుంటూ యయాతి "పిచ్చిపిల్లా! దేవయాని మనస్తత్వం పసితనం నుంచీ కలిసి మెలసి తిరిగిన నీకు తెలియదా? నువ్వు ఆమెను ప్రార్థించకు – వెలితి పడటం తప్ప ప్రయోజనం ఉండదు. ఇంతజరిగాక ఆమె ముందు చులకన అయిపోతావా?" అన్నాడు.

"నా ప్రార్థన మన్నించారు. నా ప్రేమ కోసం దేవయాని దారుణ కోపాన్ని సహితం ఎదుర్కొన్నారు. అది చాలు నాకు. మన ప్రేమకు ఫలితంగా మీరు శాపగ్రస్తులు కావటం నేను సహించలేను. మీకు ఆపద కలిగించే ఆత్మాభిమానం ఎందుకూ నాకు?"

"లాభంలేదు శర్మిష్ఠా! దేవయానిని శాంతింపచెయ్యలేవు. ఆ ప్రయత్నం వదిలి పెట్టు?"

నిరాశతో ఆగిపోయింది శర్మిష్ఠ. ఆమెను తన చేతులలో ఎత్తుకొని శయనాగారానికి తీసుకుపోయాడు యయాతి.

26

ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ఇక తమకు మిగిలినది అతి కొద్ది కాలమేనని విషాదం నిండిన గుండెలతోనే, ఒకరి నొకరు వదలకుండా గడుపుతున్నారు శర్మిష్ఠా యయాతులు. అభ్యంతర మందిరంలోకి అంతరంగిక పరిచారిక వచ్చి "మహారాజా! మీకోసం దేవలోకం నుండి ఇంద్రాణివచ్చారు. సమావేశ మందిరంలో మీకోసం నిరీక్షిస్తున్నారు" అని చెప్పింది. యయాతి వెంటనే తగిన విధంగా దుస్తులు ధరించి సమావేశ మందిరానికి వచ్చాడు. ఇంద్రాణికి నమస్కరించాడు. "విజయీభవ!" అని ఆశీర్వదించిందామె! ఆ ఆశీర్వచనానికి ఆశ్చర్యపోతూ ప్రశ్నార్థకంగా ఆమెను చూసాడు.

"రాకుమారా! కాదు మహారాజా! నేను చేసిన ఉపకారానికి ప్రత్యుపకారం కోరటానికి వచ్చాను. కృతజ్ఞుడవే అవుతావో, కృతఘ్నుడవనిపించుకొంటావో, నీ యిష్టం?"

"ఉపకారమా ?"

"శర్మిష్ఠను దేవయాని భూగృహంనుండి విడుదల చేయించింది నేను. పాపం! దేవయానిని మభ్య పెట్టి స్వర్గానికి పిలిపించింది కూడా నేనే! ఆ రకంగా నీకూ శర్మిష్ఠకూ స్వేచ్ఛగా కలుసుకొనే అవకాశాన్ని కల్పించాను. దేవయాని అంతకాలం స్వర్గంలో ఉండటానికి కూడా నేనే కారకురాలిని. దేవయాని నా సొంత మనవరాలని కూడా ఆలోచించలేదు. నిన్నూ శర్మిష్ఠనూ ఒకటి చెయ్యాలనుకొన్నాను."

"మీ ఉపకారం మరచిపోలేను. ప్రత్యుపకారం అనకండి. ఏం చెయ్యాలో ఆజ్ఞాపించండి. మీ ఆజ్ఞ శిరసావహిస్తాను."

"దేవదానవ సంగ్రామం చాలా తీవ్రంగా జరుగుతున్నట్టు నీకు తెలుసు. రాక్షసుల ధాటికి దేవతలు తట్టుకోలేక పోతున్నారు. నువ్వు వెంటనే వచ్చి మీ తండ్రికి సహాయపడాలి."

యయాతి తన చెవులను తాను నమ్మలేక పోయాడు.

"మీరు నా తండ్రికి– మీ ప్రత్యర్థికి– సహాయపడమని కోరుతున్నారా ?"

"యయాతి కుమారా! ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో స్వజనులు, ప్రత్యర్థులు అనే ఆలోచనలు పనికి రావు. మనమంతా ఒకటి కావాలి. రాక్షసులను తరిమి కొట్టాలి. ఆ తరువాత సమర్థుడైన నాయకు డెవరో స్థిమితంగాఎన్నుకోవచ్చు. శుక్రాచార్యుల మంత్ర బలంతో రాక్షసుల మాయా ప్రయోగాలను నీ దివ్యాస్త్రాలే ఛిన్నాభిన్నం చేయగలవు. త్వరగా బయలుదేరు"

"ఇప్పుడే వస్తాను"

అభ్యంతర మందిరంలోకి వచ్చి శర్మిష్ఠతో తన ప్రయాణం సంగతి చెప్పాడు శర్మిష్ఠ కన్నీరు పెట్టుకొంది.

"క్షత్రియ రాకుమారివి. అలా కన్నీళ్ళు పెట్టుకోవచ్చునా? విజయ ఖడ్గమిచ్చి సాగనంపాలి కాని..."

"వీర పత్నిని. నేను మీతో యుద్ధానికి వస్తాను. నాకు విలువిద్య వచ్చు."

"లాభంలేదు రాణీగారూ! తమరు ఇక్కడే ఉండి తమ గర్భంలో ఉన్న భావి మహారాజును రక్షించుకోవాలి!"

"ఏమన్నారూ ?"

"నీ గర్భంలో ఉన్న భావిమహారాజును జాగ్రత్తగా కాపాడుకోమన్నాను."


"నా కొడుకు భావిమహారాజెలా అవుతాడు? దేవయాని కొడుకు పెద్దకొడుకు యదువు లేడా ?"

"నేను మాత్రం నా తండ్రికి పెద్ద కొడుకునా? నా నోట నిండుకో ఆ మాట వచ్చింది. నా సంకల్పం కూడా అదే! ఆ రకంగానైనా నీకు జరిగిన అన్యాయానికి కొంత పరిహారం జరుగుతుందని నా ఆశ. చూద్దాం! ఏదెలా జరుగుతుందో? యుద్ధం ముగియగానే వచ్చేస్తాను. నువ్వేదిగులుపడకు. యువరాజుగారిని అన్ని విద్యలలో జాగ్రత్తగా పెంచి పెద్దచెయ్యి"

శర్మిష్ఠ కళ్ళు తుడుచుకొంది. నిష్ఠతో దేవికి పూజ చేసి విజయ హారతి ఇచ్చింది. విజయ ఖడ్గం చేతి కందించింది. ఇంద్రాణితో యయాతి విమానంలో వెళ్ళిపోతోంటే ఆ విమానం కనుమరుగయ్యేవరకూ చూసింది.

"యుద్ధం! భయంకరమయిన, వినాశనకరమయిన ఈ మాట తనకు ఊహ వచ్చినప్పటి నుంచీ వింటూనే ఉంది. ఈ యుద్ధ మనేది లోకంలోంచి పోయేరోజు అసలు రానేరాదా ? జనులంతా స్వార్థాన్ని మరిచి సుఖశాంతులతో బతికేరోజు రానే రాదా ?"

(ఇంకా వుంది)



చంటి ఆకలితో నకనకలాడుతున్నాడు హృదయం నించి.

"హీరోగారు వస్తున్నారుట."

"ఎప్పుడు ?"

"బయలే రారట."

"అయితే ఇంకో ఇరవై నిముషాల్లో రావచ్చు."

"టైం ఎంతయింది?"

పన్నెండుంముప్పావు."

చంటి పొద్దున్న ఏడిమిదిన్నరకి వచ్చాడు స్టుడియోకి. మిగతా ఎక్స్ట్రాలతో పాటు అతనికి కూడా మేకప్ చేసారు.

తొమ్మిదిన్నరకి రావాలి హీరో. ముప్పై నాలుగో సీన్ చిత్రీకరిస్తున్నారు ఆ రోజు. సాయంత్రం దాకా జరుగుతుంది చిత్రీకరణ. హీరో కోసం అంతా ఎదురుచూస్తున్నారు. ఆ చిత్రం పేరు "కోటలో రహస్యం".

చంటి వడపళని మార్కెట్ పక్కనుందు లోని ఓ చిన్న గదిలో మరో ముగ్గురు మేల్ ఎక్స్ట్రాలతో పాటు కలిసి వుంటున్నాడు. రోజూ టీ నగర్దాకా నడిచివెళ్ళి ఇద్దరు ముగ్గురు ఎక్స్ట్రా సప్లయర్స్ కి కనపడి వస్తూంటాడు.

ఆ రోజు టీ, బన్ తప్ప మరింకేం తీసుకోడానికి డబ్బులేకపోయింది చంటి దగ్గర. షూటింగ్ అవుతేకాని డబ్బు ముట్టదు. ప్రొడక్షన్ మేనేజర్ చుట్టూ తిరిగి షిఫ్టు డబ్బు సంపాదించుకునే నటన కూడా తెలిసి వుండాలి ప్రతి ఎక్స్ట్రాకి.

ఆ ముందు రోజు కూడా భోజనం లేదు చంటికి. చంటితో పాటు ఆ గదిలో వుండే మిగతా ముగ్గురి పరిస్థితీ దాదాపుగా అలాగే వుంది.

పన్నెండూ ఏభైకి హీరోగారి కారు స్టుడియో ఆవరణలో ఆగింది. మేకప్రూంకి వెళ్ళారాయన. లంచ్ తీసుకుని, కాసేపు రిలాక్స్ అయి, మేకప్ వేసుకుని రెండూ ఇరవైకి బయటికి వచ్చాడాయన.

ఆయనకన్నా ముందే ఆయన మిస్ట్రెస్ రియర్ ఇంటి నుంచి వచ్చింది. అదీ అదృష్టం అంటే— చెప్పాడు చంటి తన మిత్రులకి, కడుపు నకనకలాడుతూంటే.

రెండున్నరకి షూటింగ్ ప్రారంభం అయింది. చంటి రక్షక భటుడి వేషం వేసాడు. జానపద చిత్రం అది.

షూటింగ్ పదిన్నరదాకా జరిగింది. ప్రొడక్షన్ వాళ్ళిచ్చే టీ తప్ప మరేం చంటి కడుపులోకి వెళ్ళలేదు.

ప్రొడక్షన్ మేనేజర్ చంటికి డబ్బు ఇచ్చే సరికి పావుతక్కువ పన్నెండయింది. మిగతా ఎక్స్ట్రాలతో పాటు బయటకి నడిచాడు. ఆ సమయంలో భోజనం దొరకదు.

ఎదురుగావున్న టీ షాప్కి వెళ్ళి బన్, టీలతో కడుపు నింపుకున్నాడు మళ్ళీ.

"ఛీ ఛీ! ఆకలి బతుకు" అనుకున్నాడు రాత్రి రెండున్నరకి, ఇంకా ఆకలి వల్ల నిద్ర పట్టకపోతే.

* * *

"బేరం కడతావా ?"

"ఎక్కడికండి ?"

"చుట్టుగుంట"

"రాదుసార్, జైహింద్టాకీస్ వైపయితే వస్తాను."

"రూపాయిన్నర ఇస్తాను."

"రాదండి."

వెంకన్న రిక్షాని సరాసరి బందర్ రోడ్లో వున్న యజమాని ఇంటికి ఖాళీగా తొక్కుకు వెళ్ళి రిక్షాని, ఆ రోజు అద్దెని యజమానికి అప్పచెప్పాడు.

బయటకి వచ్చి ఓ కట్ట గణేష్ బీడీ, అగ్గిపెట్టె కొన్నాడు.

వెంకన్న వుండేది కృష్ణలంకలో. కానీ వెంటనే ఇంటికి బయలుదేరలేదు. జేబులో మిగిలినడబ్బు లెక్కపెట్టుకుని కాసేపు ఆలోచించాడు.

అద్దె పోయాక ఆ రోజు రూపాయే మిగిలింది. మామూలుగా అయితే నూకలు కొనుక్కుని ముసలి తల్లి వుండే తన ఇంటికి బయలుదేరేవాడు కాని ఆ రోజు నూకలు కొనలేదు.

దగ్గరేవున్న సినిమా థియేటర్ వైపు నడిచాడు. బీడీకట్ట విప్పి, ఓ బీడీ వెలిగించి నేల క్లాసులోని క్యూలో నిలబడ్డాడు.

ఆ సినిమా విడుదలయి నాలుగు రోజు

లె ంది. వెంకన్న అభిమాన హీరో నటించిన జానపద చిత్రం అది.

ఆకలిగా వుంది వెంకన్నకి. 'ఇంటర్వెల్‌లో బన్ కొనుక్కుని టీ తాగచ్చు' అనుకున్నాడు.

మర్నాడు వుదయం తను, తన ముసలి తల్లి వస్తు వుండాలన్న సంగతి గురించి ఆలోచించడంలేదు.

తను చూడబోయే సినిమా 'కోటలో రహస్యం' మీదే వుందతని ఆలోచనంతా

వారఫలం

26-6 1981 శుక్రవారం మొదలు 2-7-1981 గురువారం వరకు

మేషం:— మేలు చేయగల వారున్నారు, వా సహాయం తీసికోండి. సజ్జన సాంగత్యంతో, రా కీయంగా సహాయం పొందడంతో అభిమానులు అభి మానించటంతో, మీకు ధనాదాయానికి లోటు లేదనిపించే వారం. బంధువులకో, మిత్రులకో సహాయం చేయవలసి రావచ్చు. స్త్రీలకు : విద్యా వైజ్ఞానిక, సాంఘిక రంగాల్లో ప్రయోజనమున్నది అని గ్రహించాలి.

వృషభం: — గ్రహచారం అనుకూలంగా లేదని, కార్యక్రమానికి ఆటంకం రావటం మూలాన గ్రహింప గలు తారు. ధనాదాయం అంతోయింతో లేకపోలేదు గాని, ప్రయోజనం ? అధిక వ్యయం— సంతాన మూలకముగా జరుగగలదనియు చెప్పదగిన అంశమే. మిత్రుల మూలాన కూడా కొన్ని చిక్కులు భూ సంబంధంగా ఏర్పడనున్నవి. స్త్రీలకు : కళారంగ మునో, విద్యారంగంలో అనుకూలత గల వారం.


మిధునం:— బంధువులనో, మిత్రులనో, అధికా రులలో, కలిసికోవలసిన పరిస్థితులుంటాయి. ఒక పాలు ఆధాయమయితే, నాల్గు పాళ్ళుగా వ్యయం చేయవలసిన పరిస్థితులేర్పడుతాయి. ఉత్తరాల మూలాన, గృహవిస్తరణ సంబంధమైన వార్తలందు కోనున్నారు. స్త్రీలకు: నూతనోద్యోగాలకు ప్రయ త్నించే వారికి, వారాంతంలో అనుకూలత చెప్పదగి యున్నది.

కర్కాటకం:— రచనా వ్యాసంగంలో నిమగ్ను లైనవారికి, పత్రికా వ్యాసంగంలో శ్రమించేవారికి శ్రమదాయకమైన, లాభ దాయ కమైన వారమే.

ప్రయాణాలుంటాయి. ఒక వేళ ఏవైనా వస్తువులు, మతి మరపు వలన పోగొట్టుకుంటారేమో, జాగ్ర త్తగా ఉండండి. స్త్రీలకు: సంగీత, నాట్య కళల్లో ప్రవేశమున్న వారికి వైద్య వృత్తిలో పరిశ్రమించే వారికి లాభదాయకమైన వారం.

సింహం:— శ్రమాధిక్యత గలవారం. ఏ పని చేయాలని ప్రయత్నించినా అంతరాయముంటుంది. బంధు, మిత్రుల తాకిడి— వారిని సంతోష పెట్టు టకు శ్రమింప వలసిన పరిస్థితులు కూడా ఏర్పడ నున్నవి. చాలమందికి ఒక్క క్రీడారంగంలో నదవ కాశాలు లభింప నున్నవని గ్రహించాలి. స్త్రీలకు: దూర బంధువులనుండి శుభ వార్తలందనున్నవని గ్రహించండి.

కన్య:— ఉద్యోగ వృత్తులందు శ్రమ అధిక మైనా, అందులకు అనుగుణ్యమైన ఫలితం పొందనున్నారు. వ్యాపారం సాఫీగా సాగుతుంది. కార్మిక వర్గానికి — కర్షకులకు—అత్యుత్తమ ఫలితా లందుటకు , శ్రమించినా లాభం పొందుటకు అవ కాశం గలవారం. స్త్రీల విషయంలో ప్రత్యేకంగా చెప్పదగిన మేలేమీ లేదు గాని, వృత్తి ఉద్యోగాల భాసించటం, కించిత్తు ధనాదాయం సంభవమే.



తుల:— నిర్దేశించిన కార్యక్రమం సాఫీగా సాగి పోతుంది. వ్యాపారం చేసే వారికి కూడా లాభ దాయకమే. విద్యావైజ్ఞానిక రంగాలలో చాలమందికి అవకాశాలుండగలవు. ఉద్యోగం నూతన ప్రయ త్నాలు చేయుటం సంభవిస్తే అనుకూలదాయకం. స్త్రీలకు: రచనా వ్యాసంగంలో లబ్ధి, క్రీడారంగ ములో అవకాశాలుంటాయి.

వృశ్చికం:— అవకాశాలనేకం, అందు వేనిని సాధింప గలుగుతారో, మీ శ్రమను అనుసరించి యుంటుంది. వ్యాపారం సాఫీగా సాగటమే గాక క్రయ విక్రయాలలో లాభించటమే గాక, ఆశించిన ఆదాయం అందుకోగలుగుతారు. ఉద్యోగం శ్రమ కరంగా ఉండటం, ఉద్యోగస్థులు గ్రహింపగల్గుతారు. స్త్రీలకు: కృషి మూలాన లబ్ధి, కొందరకు ప్రమోషన్ చెప్పదగిన అంశాలు.

ధనుస్సు:- మీ శక్తి సామర్థ్యాలు మీకు తెలియవు గాని, మీరు శ్రమిస్తే అధికాదాయం పొందగలరని చెప్పదగిన వారం. పరిచితులో, బంధు వర్గీయులో, ఆత్మీయులో, ధనసంబంధ మైన లోటును భర్తీ చేయగలరు. అందువలన అన్ని రంగాలలో మీక ప్రగతి కనిపిస్తుంది. నూతన వస్తు సేకరణకు అనుకూల వారం. స్త్రీలకు : కళాసాహిత్య రంగాలలో అనుకున్నదానికన్న అధికోత్సాహత కనిపిస్తుంది.


మకరం:— వ్యాపారం బాగా సాగుతుంది. చిత్ర కళా రంగంలో పరిచితులకు నూతనావకాశాలు లభింపనున్నవి. ఇటీవల, ఏదో కారణంగా నిలిచిన ఒకానొక వ్యవహారం , మరలా ఫలవంతం కానున్నది. అన్ని రంగాలలో మీకు అడ్డంకులు తొలగనున్నవి. ముఖ్యంగా 'ఉత్తరాషాఢ' వారికి సర్వానుకూలత చేకూర్చగలవారం. స్త్రీలకు : కళా వ్యాసంగంలో అనుకూలత, నూతన వస్తుసేకరణకు సర్వాను కూలత చేకూరగల వారం.

కుంభం:—బంధువులతో, సంతానంతో,కుటుంబ సభ్యులతో, విరోధం కొనితెచ్చుకొన్నట్లు అవుతుంది. లాభదాయక విషయాలలో నష్టం సంభవించేఅవకాశం కూడా చెప్పదగిన అంశం. రాబడిలో ఏ విధంగా లోటు కనిపించదు. స్త్రీలకు: రచనా విధానంలో ధన రాబడికి, క్రీడా రంగంలో అవకాశాలు లభించుటకు, ఈ వారం అనుకూల ఫలదాయక మైనదనే గ్రహించాలి.

మీనం:— ఎవరు మనవారో, ఎవరు కారో, ఎవరివలన మేలున్నదో, ఎవరు అపకారులో అని నిర్ణయించుకోలేక పోతారు. త్వరపడి ఏవోయోచనా రహితమైన పనులు గావింప గలుగుతారు. అందు మూలాన అపకారం జరుగుటకు ఆస్కారమున్నది. స్త్రీలకు: ఉద్యోగాభివృద్ధికి, కొందరకు నూతనో ద్యోగాలు లభించుటకు , క్రీడావనిలో అవకాశాలకు సుగమమైన వారం. ఆరోగ్యలోపం లేదు.

— విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి





ఎల్లప్పుడు చురుకుగా
ఎల్లప్పుడు చైతన్యంగా

మీ బిడ్డ పెరుగుతున్నప్పుడు, ఆ బిడ్డ నిరంతరం అదనంగా శక్తి వినియోగించడం జరుగుతుంది.

బూస్ట్‌ను పాలల్లో కలిపితే, రుచికరమైన మాల్ట్ చాకొలెట్ పానీయం తయారౌతుంది. అది మీ బిడ్డకు కావలసిన శక్తిని సమకూరుస్తుంది. ఎందుచేతనంటే బూస్ట్, సంపూర్ణమైన, మీగడ పాలు, గోధుమ, బార్లీ మాల్ట్, కోకోలతో తయారైనది.

మీ బిడ్డకు, శక్తినిచ్చే ఈ ఇంధనాన్ని ఇవ్వండి. అది మీ బిడ్డ రోజంతా, ప్రతి రోజు కూడా చురుగ్గా, చైతన్యవంతంగా ఉండేటట్టు చేస్తుంది.



చురుకైన జీవనానికి శక్తినిచ్చే ఇంధనం

బూస్ట్

మాల్ట్ చాకొలెట్ మిల్క్ డ్రింకు



ఈ ఎకానమీ రీఫిల్ ప్యాక్ ద్వారా రు. 1/- ఆదా చేయండి

HTD-HM-6177

సీరియల్

రాగజ్వాల



చిట్టూరెడ్డి సూర్యకుమారి

(గత సంచిక తరువాయి)

పొద్దు ఎంత అయిందో తెలియదు — రాత్రో పగలో అసలే గుర్తులేదు. పూర్తిగ మెలుకువలో యున్న శ్రీకాంత్‌కి ఆకలి వేస్తున్నట్లనిపించింది.

పురుషుడి ఆకలి ఏదైనాసరే తీర్చేది స్త్రీ. ఎంత బలవంతుడైనా — భాగ్యవంతుడైనా — మరెంత స్వతంత్రుడైనా స్త్రీ మీద ఆధారపడి యుంటాడు.

చిన్నప్పుడు ఆకలివేస్తే అడగకుండానే అమ్మ పెట్టేది. "రమ్యా? ఆకలేస్తుందని" రమ్యకు చెప్పాడు.

రమ్య వంగి నుదుటిమీద ముద్దు పెట్టుకుంది. సంతోషించిపోతూ పైకి లాక్కుంటూ "దాహంగ వుంది" అన్నాడు. ఈసారి బుగ్గమీద ముద్దు పెట్టుకుంది.

ఉబ్బిపోతూ! "ఓ గ్లాసు మంచినీళ్ళివ్వు!" అన్నాడు.

రమ్య పెదాలపై బహుమతి యిచ్చింది.

శ్రీకాంత్ నవ్వుకుంటూ హోల్డాల్‌పైనుంచి లేచాడు. పెళ్ళి కాకముందు చెయ్యికూడ పట్టుకోనిచ్చేది కాదు. అంటరానివాడిలా అంత దూరంలో వుంచేది. ఇప్పుడూ మహారాజులా చూస్తూంది... మగమహారాజు ఒళ్ళు విరుచుకుంటూ — మంచినీళ్ళ కోసం గది అంతా చూస్తుంటే రమ్య నవ్వు దాచుకుంటూ "నా ప్రేమ వుంటే చాలు జీవించేస్తానన్నావు" అంది.

రమ్య మాటలకు గతుక్కుమన్నట్లు చూసాడు.

"నావైపు తిరిగ్గా తర్వాత చూద్దురు — ముందు ఆ పంపులో నీళ్ళు త్రాగిరండి. అలా హోటల్‌కెళ్ళి భోంచేసి వద్దాం."

రమ్య చేతిని అందుకొని అరచేతిని ముద్దు పెట్టుకొని — "సారి రమ్యా! నీవు నా దగ్గరకు వచ్చేస్తున్నావన్న సంతోషంలో ఏమి తోచలేదు. మన సంసారానికి ఏం కావాలో లిస్టు వ్రాయి. పిచ్చుకలు గూడుకట్టుకొన్నట్లు మనింటిని తయారు చేసుకొందాం!" అన్నాడు.

* * *

శ్రీకాంత్ ఫ్యాక్టరీకి పోవటానికి తయారవుతున్నాడు. రమ్య ఇంటికి ఏమేమి సామానులు అవసరమో ఆలోచిస్తూ లిస్టు తయారుచేస్తూంది. పడుకోవడానికి మంచం — డబుల్ కాట్ — డన్‌లప్ పరుపులు లేదా బూరుగు దూది పరుపులు—దిండ్లు, దుప్పట్లు — ప్రస్తుతానికి ఆరు చాలు. టేబుల్ — టేబుల్ లైటు — కనీసం రెండు కుర్చీలు — గోద్రెజ్‌వి. డ్రసింగ్ టేబుల్ — బట్టల స్టాండు — ఇస్త్రీ పెట్టె — కర్టెన్స్ — ఇంట్లో అందంగా అమర్చుకోవడానికి పూలకుండీలు — పెయింటింగ్ (మంచి సీనరీలు — అమ్మాయి ఫోటోలు కాదు). ఒక పంకా. ఈ ఇంట్లో ఒక అలమార కూడా లేదు కనుక ఇనుప బీరువా — ఆ తర్వాత వంట గదిలోకి వెళ్ళితే వంట సామాను స్టెయిన్‌లెస్ స్టీలు సామానులు — గ్యాస్ స్టౌ అతి ముఖ్యం — నీళ్ళ కోసం బిందెలు (ఇత్తడివైనా సర్దుకుపోతాను) వేడినీళ్ళ కోసం బాయిలర్ — కూజా — కుండ — స్టాండు (రిఫ్రిజిరేటర్ అయితే సంతోషం) రేడియో తప్పక వుండాలి. టి. వి. అయితే మరీ మంచిది. కాని ఈ ఊర్లో ఇంకా రాలేదంటున్నారు — చదువు లేదు కనుక హాయిగా రోజూ సినిమాలకి వెళ్ళవచ్చు.

ఇంకా ఏమి కావాలబ్బా! ప్రక్కింటి మగుణగారిని అడిగితేగాని తెలియదు. ఆలోచనలో పడింది. శ్రీకాంత్ తల దువ్వుకుంటూ వచ్చి - రమ్య ప్రక్కన నిలుచున్నాడు. రమ్య వ్రాస్తున్న దాన్ని చూసి కళ్ళు పెద్దవిచేసి చదివి గబగబా జేబులో చెయ్యిపెట్టి డబ్బు ఎంత వుందో చూసుకొన్నాడు. డబ్బువైపు, రమ్య రాసిన లిస్టువైపు మార్చి, మార్చి చూసాడు.

రమ్య వస్తున్న నవ్వును ఆపుకుంటూ "ఇంకా ఏమి వ్రాయను?" అంది.

"తర్వాత వ్రాద్దువుకాని ముందు హోటల్‌కి వెళ్దాం పదా — నేను ఫాక్టరీకి వెళ్ళాలి" అంటూ తొందరపెట్టాడు.

శ్రీకాంత్ ఆఫీసుకు పోతూ "ఆఫీసులో అడ్వాన్సు అడిగి తెస్తాను — సాయంకాలం బజారుకు వెళ్దాం... ఏం!" అంటూ రమ్య పెదవులను సుతారంగ తాకి, చెయ్యి వూపి పోతుంటే —

"ఆఫీసు ఎంత దూరం అండీ" అనడిగింది.

పోతున్నవాడల్లా వెనక్కి వచ్చి రెండు చేతులు భుజంమీద వేసి "ఏమిటీ కొత్త పిలుపు."

"ఇప్పుడు మీరు నా హస్‌బెండ్ కదా! అలాగే పిలవాలి."

జరిగిన కథ—2 : నాగయ్య, అమరేశ్వరిలకు ముగ్గురు కూతుళ్ళు, ఒక్క కొడుకు విష్ణు. పెద్ద కూతుళ్ళిద్దరు ఉద్యోగాలు చేస్తున్నారు. మూడవ కూతురు రమ్య, ఎదురింటి శ్రీకాంత్ ప్రేమించుకొంటారు. వాళ్ళొకరోజు లేచిపోయి గుళ్ళో పెళ్ళి చేసుకొని, కొత్తజీవితం ప్రారంభిస్తారు.

"ఇదీ అలాగే భార్యగారు" అంటూ నవ్వాడు. సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం వున్న ఫ్యాక్టరీకి రిక్షాలో వెళ్ళాడు. కొత్త పెండ్లికొడుకు కదా! అటెండెన్సు పుస్తకంలో సంతకం చేసి మేనేజర్ దగ్గరకు వచ్చి "ఓ ఐదు వందల రూపాయలు అడ్వాన్సుగా ఇప్పించగలరా" అడగలేక అడిగాడు, అసిస్టెంటు మేనేజరయిన శ్రీకాంత్

నవ్వలేక నవ్వుతూ అన్నాడు మేనేజర్ "ఉద్యోగం అని అడిగినవారితో డిపాజిట్ కట్టించుకొని మరీ ఇచ్చారు వుద్యోగం. మీరు డిపాజిట్ కట్టలేదు. పైగా చేరి నెలకూడా కాలేదు. అడ్వాన్స్ అడిగితే డైరక్టరుగారు ఏమంటారో... ?" మరో మాట మాట్లాడక తన సీటుకు వచ్చాడు జేబులో వున్న డబ్బుతో ఏమి వస్తుంది! ఏమి తింటారు తన కోసం ఎదురుచూస్తున్న రమ్యకు ఏమి చెప్పాలి అమ్మటానికి తనదగ్గర ఏమీలేదే. పెళ్ళికి, తక్కిన ఖర్చులకు తన సైకిల్ అమ్మేసాడు. ఇప్పుడేది దారి.

మధ్యాహ్నం కాంటీన్‌లో ఏమీ తినబుద్ధి కాలేదు. నీరసంగ ఇంటికి చేరేటప్పటికి సూర్యుడు కృంగిపోయాడు.

ఆ రాత్రి అలసిపోయిన రమ్య — శ్రీకాంత్ హృదయంలో ఒదిగి నిద్రపోయింది. శ్రీకాంత్ నిద్రపోలేకపోయాడు.

"తొందరపడి పెళ్ళి చేసుకొన్నాడా! తన ప్రాణమైన రమ్యను, యిలా గాలి లేనిచోట క్రింద పడుకోబెట్టాను. మంచి వుద్యోగం దొరికి బాగా డబ్బు సంపాదించేవరకు ఆగివుంటే బాగుండేదేమో. అత్యాధునికంగా బాగా అలంకరించిన బంగళా, కారు, వుండాలని అవి సమకూర్చేవాణ్ణే చేసుకుందామని ప్రతి అమ్మాయి కలలు కంటుందేమో. అవన్నీ తన దగ్గర వున్నాయని, తన భర్త ఇస్తాడని రమ్య ఆశించలేదు కదా! కలలు కనలేదు కదా!

కోరికలు తీరకపోతే చిన్నబోయి — కాంతిని ఎందుకు చేసుకొన్నానా అని బాధపడుతుందేమో! రమ్య ప్రేమ తగ్గిపోతే తను భరించలేడు" అసహనంగ అటూ ఇటూ కదిలాడు.

నిద్రలో రమ్య "కాంతి" అని కలవరింతగ పిలిచింది. ఏ పరిస్థితులలోను రమ్య తనను ప్రేమించడం మానదు. తనకోసమే — తనవారిని — తన చదువును వదులుకుని వచ్చేసింది. అలాంటి రమ్యకు తనేమి ఇచ్చినా తక్కువే అవుతుంది. రమ్యను గాఢంగా హత్తుకుని కళ్ళు మూసుకొన్నాడు.

* * *

ఆ రోజు ఫాక్టరీనుండి వచ్చిన శ్రీకాంత్‌కు ఇంట్లోనుంచి రమ్య స్వరంగాక మరొక కొత్త గొంతు వినిపిస్తూంది.

"ఎందుకైనా రమ్యా, రిజిస్టరు మ్యారేజి చేసుకుంటే మంచిది..."

రమ్య నవ్వు రమ్యంగ వినిపించింది.

"వివాహమేకాదు. మరే బంధమయినా ప్రేమ-మమకారాలతో కట్టుబడి ఉండేది! వదలి వెళ్ళాలనుకునే వాళ్ళకి ఏ పెళ్ళిళ్ళు అడ్డురావు అక్కయ్యా! కొన్ని వందల మంది చూస్తుండగా— పంచభూతాల సాక్షిగా — వేద మంత్రాలతో సుముహూర్తంలో (జాతకాలు చూసి) జరిగిన పెళ్ళిళ్ళు ఎన్ని చిన్నాభిన్నం కాలేదు అంత

అట్టహాసంగా చేసుకొన్న ఒకడు — భార్యను—అసలు కాపురానికే తీసుకుపోలేదు.

అక్కయ్యా! భార్యా భర్తలు — మనస్సాక్షిగా— రాగబంధంలో ఒకరి కొకరు కట్టుబడి యుంటారుగాని, రిజిస్టర్ మ్యారేజి — లేక పురోహితుడు చేసారని జీవితాంతం కట్టుబడి యుండరు ...'' అలా చెప్పుతూ — ద్వారంలో నిలుచున్న శ్రీకాంత్‌ను చూసింది. సంతోషంతో ముఖం విప్పారింది. శ్రీకాంత్‌ను చూసి ఎన్నాళ్ళో అయినట్లు చూస్తూ, ''అక్కయ్యా!—మా శ్రీవారు శ్రీకాంత్. వీరే సుగుణగారు. మన ఇంటిగలవాళ్ళు, నిన్ననే వూరునించి వచ్చారు.''

శ్రీకాంత్ నమస్కారం పెట్టాడు. ఆమె స్వరం ఎంతో బొంగురుగా వుంది — ఎంతో పెద్దావిడ అనుకొన్నాడు. ఎత్తుగా, లావుగా వుంది. వంకీల జుట్టు — గుండ్రటి ముడి — చామనఛాయ మొత్తానికి బాగానే వుంది. శ్రీకాంత్ కూడా బాగున్నాడు. అందమైన జంట. చక్కని పిల్లలు పుడతారు అని తలుస్తూ- ''వెళ్ళొస్తాను రమ్యా!'' అంది.

''ఏం కావాలన్నా అడుగు — పాపం చిన్నపిల్ల— అంతా క్రొత్త. బాగా చూసుకో అబ్బాయ్!'' అంటూ నవ్వింది.

దారికి అడ్డు తొలిగాడు. ఆ ఇంటికి, ఈ ఇంటికి మధ్యవున్న తలుపు గుండా వెళ్ళింది. ఆ తలుపుతీసే వుంచింది. శ్రీకాంత్ గదిలోకి వచ్చాడు. జంట మంచాలు కలిసివున్నాయి—కొత్త పరుపులు— రమ్మని ఆహ్వానిస్తున్నాయి. మరో ప్రక్క టేబుల్, గాద్రేజ్ కుర్చీలు, ప్లాస్టిక్ పూలువున్న వాజ్‌లు — గోడలపై సీనరీస్ పూలు — పక్షులు వున్న క్యాలెండర్లు — వంటగది కూడా సామానుతో నిండుగా వుంది — అల్యూమినియం పాత్రలతో కళకళలాడుతోంది.

''రమ్యా! ఇవన్నీ ఎక్కడివి? అద్భుతదీపం ఏదైనా దొరికిందా!''

కూజాలోంచి చల్లటినీరు తెచ్చి యిచ్చింది. నవ్వుతూ శ్రీకాంత్‌ను మంచంపై కూర్చోపెట్టి— గది మధ్య తెరలాగింది ''కాంతీ! బాగుందా ఏర్పాటు? ఇది మన బెడ్‌రూం. అది లివింగ్ రూమ్'' అంటూ మెడ చుట్టూ చేతులు వేసింది.

''రమ్యా! ఇవన్నీ ఎక్కడివి?''

వర్రీగ వున్న అతని ముఖం పైటచెంగుతో తుడుస్తూ ''కొంటే వస్తాయి. ప్రక్కింటి అక్కతో బజారుకెళ్ళాను — కొత్త సంసారానికి కావలసినవన్నీ ఆమె చెప్పారు... డబ్బు!... మా అమ్మ గాజులు — పాతవేగా అమ్మేసాను.''

''రమ్యా!'' దుఃఖంతో అతని గొంతు బొంగురుపోయింది. ''నాకు సిగ్గుగా వుంది. రాణిలా నిన్ను అలంకరించుకుని చూసుకోవలసిందిపోయి — నీకున్న ఆ గాజులుకూడా లేకుండా చేసాను.'' చేతులను నిమురుతూ అన్నాడు.

''బాధపడకు కాంతీ, ఇంతకు అంత వడ్డీతో మీదగ్గర వసూలు చేస్తాను'' లేచి వెళ్ళుతూ బుగ్గలు సాగదీసింది. వేడి వేడిగా వున్న కాఫీ కప్పు చేతికి ఇచ్చింది.

శ్రీకాంత్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

''పిచ్చి కాంతీ! కట్నం తెచ్చే సరోజను కాదని నన్ను చేసుకోలేదూ! డబ్బు — సొమ్ములు అన్నీ — మన రాగజ్వాలలో బుస్‌మని మాడిపోతాయి —

అబ్బా — కాంతీ నీ రాగజ్వాల నన్ను... నన్ను నిలువనీయటంలేదు.— నాకు తాపం కలుగుతుందీ...'' కొంటెగ చూస్తూ — వూరిస్తూ — శ్రీకాంత్‌ను వూరడించింది రమ్య.

* * *

''ప్రేమించి పెళ్ళి చేసుకోవడంలో గొప్ప లేదు. పదహారేళ్ళ కుర్రాడు ప్రేమించగలడు. పద్దెనిమిదేళ్ళకే పెళ్ళి చేసుకొని పిల్లల్ని కనగలడు. కాని భార్యను సుఖపెట్టి తాను సంతోషించినవాడే గొప్పవాడు.'' అని శ్రీకాంత్ అనుకోని రోజు లేదు.

ఆ రోజు రమ్యకు చేతినిండుగ బంగారు గాజులు చేయిస్తానన్నాడు. ఇంకా క్రొత్త వుద్యోగాన్వేషణలో వున్నాడు.

శ్రీకాంత్ ప్రక్కింటి రమ్యను పెళ్ళి చేసుకొని కాపురం పెట్టాడని తెలుసుకొని పద్మావతి ఏడుస్తూ నీవు స్వార్థపరుడివి అని తిట్టుతూ వుత్తరం వ్రాసింది. నీకొచ్చే కట్నంతో చెల్లికి మంచి సంబంధం తెచ్చి చేయాలని, ఆశగ — అంతకంటే నిశ్చింతగ ఇన్నాళ్ళు వున్నాను. తండ్రి లేకపోయినా దేనికి కొదువ చేయలేదు. చదువులిచ్చి ప్రయోజకుణ్ణి చేసాను. ఉండటానికి ఇల్లు వుంచాను. నా బాధ్యత నెరవేర్చాను. కానీ నీవే అన్నీ మరచి — నీ స్వార్థం నీవు చూసుకొన్నావు... అంటూ వ్రాసిన వుత్తరాన్ని రమ్యకు చూపించక చించివేసాడు.

ఈ బాధ్యతలు కొండంతగ నిలిచి భయపెట్టుతాయని అప్పుడు తెలియలేదు.

భయాలు, బాధలు వున్నా రమ్య సమక్షంలో అన్నీ హుష్‌మని ఎగిరిపోయేవి. రమ్య ప్రేమలో ఏ సమస్య అయినా, కష్టం అయినా చాలా స్వల్పంగా కనిపించేవి. రమ్య తోటిదే లోకం రమ్యే తాను — తానే రమ్యగా కాలం గడిపేయసాగాడు.

* * *

ధరలు పెరిగాయి — ఖర్చులు ఎక్కువైనాయి— ఏ ఖర్చు తగ్గించుకోవాలో తెలిసేదికాదు. అన్నీ కనీసపు అవసరాలు. ఫ్యాక్టరీకు పోను రిక్షాలో ఒక వైపుకే రెండు రూపాయలు ఇవ్వనిదే ఏ రిక్షావాడు రాడు. అప్పటికి వచ్చేటప్పుడు నడిచే వస్తాడు. ''అంత దూరం నుంచి నడిచి వస్తున్నారా?'' అని ఎదురేగి అడిగేది.

''ఆ మాత్రం వ్యాయామం లేకపోతే ఎలాగోయ్! నీవు ముద్దు చేసి, చేసి చూడు ఎంత మెత్తనై పోయాను.'' కూర్చోపెట్టి పంకావేసి ముందు చల్లటి మంచినీళ్ళు ఇస్తుంది.

ప్రక్కింటి సుగుణగారు - అద్దెకున్న వాళ్ళ సౌకర్యార్థం ఫ్యాన్ కూడా వేయలేదేమిటి అని భర్తతో పోట్లాడి సీలింగ్ ఫ్యాన్ వేయించింది. అదంతా ఇల్లుగలవాళ్ళ మంచితనం అంటే శ్రీకాంత్ ఒప్పుకోలేదు. ''నీ నోరు మంచిది



అందుకే వూరు మంచిదయింది'' అని రమ్యను సాగిదేస్తాడు.

పనిలో కష్టంగాని, నడచి వచ్చిన అలసటగాని— రమ్య మాటల్లోనే పోతాయి.

రమ్య తనలో తాను నవ్వుకుంటు కాఫీ కలుపుతూంటే ''ఏమిటా జోకు – నాకూ చెప్పితే నీతోపాటు నేను కూడా నవ్వుతానుగా'' అన్నాడు.

చెప్పకుండానే కిలకిలా నవ్వేసింది.

''నవ్వుతూ పాపం బావగార్కి చెయ్యి బెణికింది. అహ సుగుణక్కకి నడుం పట్టుకుంది. హి...హి...హి...''

''ఒకవైపు పాపం అంటూ నవ్వుతావేమి? అయ్యోపాపం—వెంకట్రావుగారికి చెయ్యి బెణికిందా— హాస్పిటల్‌కి వెళ్ళారా?'' అంటూ తాగుతున్న కాఫీకప్పు క్రిందపెట్టి వారిని పరామర్శించడానికి పోతూంటే చెయ్యి పట్టుకొని ఆపింది – ''నేను చెప్పేది పూర్తిగా విని ఆ తర్వాత వెళ్ళండి ... హి – హి.''

''మీరు నన్ను పిల్చారా! నేను రాకుంటే వంటగదిలోకి వచ్చి – అమాంతం నన్ను ఎత్తుకున్నారా – అప్పుడు నేను వేసిన కేక సుగుణక్కయ్య విని నాకేమయిందోనని పరిగెత్తుకు వచ్చిందంట – నన్ను ఎత్తుకున్న మిమ్మ చూసి నోరు నొక్కుకుంటూ—వచ్చినంత వేగంగా వెళ్ళింది— వెళ్ళి పేపరు చదువుకొంటున్న బావగారి దగ్గరకు వెళ్ళి – 'ఏమండీ! మీరు నన్ను ఎప్పుడయినా ఎత్తుకున్నారా!' అని నిలదీసి అడిగిందంట. చేతుల్లోని పేపరు లాగేసి - మళ్ళీ ప్రశ్నించిందంట —

'ఎత్తుకున్నట్లు జ్ఞాపకం లేదు' – అన్నారట. అవును ఎత్తుకోలేదు. ఎలా ఎత్తుకుంటారు. అప్పుడు ఇంటినిండా మనుషులు – ఆడబిడ్డలు – అత్తమామలు వచ్చిపోయే బంధువర్గం – చివరికి హనీమూన్‌కు కూడ వెళ్ళలేదంట. చివరికి తిరుపతికి వెళ్దాం అంటే తిరుపతికి అందరూ వెంట వెళ్ళారట. నేను మొక్కుకున్నారా నీ పెండ్లి అయితే కొండకు వచ్చి నీ నీలాలు సమర్పిస్తానని – అంటూ

రా గ జ్వా ల

బలవంతంగ మున్నటి గుండు పెళ్ళయిన మరుసటి రోజే చేయించేసిందంట సుగుణక్క అత్తగారు. ఆ గుండు చూస్తే సుగుణక్కకు ఎక్కడలేని నవ్వు వచ్చేదట. ఆ పరిస్థితులలో సుగుణక్కను ఎత్తుకో లేదట. ఇప్పుడు ఎత్తుకోమంది కాబోలు – ఎత్తుకున్నాడు. చెయ్యి కలుక్కుమంది. వదిలేసాడు. క్రిందపడిన – సుగుణక్క నడుం పట్టేసింది –

చెరొక మంచంపై పడుకున్నారు...'' చెప్పుతూ శ్రీకాంత్ వైపు చూసింది. ఉధృతంగ వస్తున్న నవ్వును ఆపుకోలేక బాధపడుతున్నాడు.

అప్పుడే! రమ్యా అంటూ సుగుణ పిలుపు వినిపించింది – ఇద్దరు పరుగున వంటగదిలోనికి వెళ్ళి గట్టిగా కౌగిలించుకుని – విరగబడి నవ్వుకున్నారు. లోపలికి రాబోయిన సుగుణ తలుపు ప్రక్కన శ్రీకాంత్ చెప్పలు చూసి అబ్బాయి లోపల వున్నట్లున్నాడు అనుకొని – ''రమ్యా! నీ బావగారు పిలుస్తున్నారు ఒకసారి వచ్చిపోండి'' అని చెప్పి తప్పుకుంది. వంటగదిలో – వారిద్దరూ ఏమి చేస్తున్నారు. చూడాలని కుతూహలంగా వున్నా మర్యాదగా వుండదు. తర్వాత – రమ్యను నమ్మించి చెప్పించుకోవచ్చు – అనుకుంటూ వెళ్ళిపోయింది.

* * *

కొద్దిరోజుల్లోనే సుగుణ, వెంకట్రావ్‌గార్లతో ఆత్మీయుల్లా కలిసిపోయారు. పెళ్ళి అయిన పది సంవత్సరాలైన సుగుణగార్కి పిల్లలు కలుగలేదు. సుగుణగార్కి తీరని కోరిక అయింది.

''నిరాశ పడకు అక్కయ్యా! పదేళ్ళకీ పుట్టిన వాళ్ళున్నారు. బావగారు మిమ్మల్ని ఎంత ప్రేమగా చూసుకొంటున్నారు ఏ కొరత లేకుండా—''

''అంత అదృష్టమా రమ్యా!'' అనేది - రమ్యను స్వంత చెల్లెలులా ఆదరించేది. పొదుపుగా వస్తువులు ఎలా వాడుకోవాలో—నేర్పేది. పచ్చళ్ళు— పెట్టడం; ఇద్దరికి సరిపడ అన్నం, కూరలు వండుకోవడం – మిగిలిన అన్నం, కూరలు అలా సద్వినియోగం చేసాను కనుకనే ఇంత ఇల్లు కట్టుకున్నాం – '' అంటూ నవ్వేది.

ఆ రోజు శ్రీకాంత్ ఇంటికి వచ్చాడు – తన రాకను కూడా గమనించకుండా రమ్య చేస్తున్న పనికి ఆశ్చర్యంగా చూసాడు –

సైకిల్‌ని సదుకోబెట్టి – శుభ్రం చేస్తోంది- ''రమ్యా!'' రమ్య తలెత్తింది. ఆమె కళ్ళు మెరుస్తున్నాయి.

''రమ్యా! ఏం చేస్తున్నావ్?''

''కాంతీ! బావగారి సైకిల్ కొన్నాను. డబ్బు ఇంటి అద్దెతో ఇరవై, పది, పదిహేను ఎక్కువ ఇస్తే సరిపోతుంది. నెలకి ఇంత అని ఇవ్వమన్నారు -- అలా చూడకు – బావగార్కి స్కూటర్ వుంది. సైకిల్ వూరికే మూలపడి వుంది – వాడుకోమన్నారు. కాని నేనే అమ్మమన్నాను.''

ఎప్పటి నుంచి అలా సైకిల్‌ను శుభ్రం చేస్తోందోకాని – ముఖానికి పట్టిన చెమటకు ముంగురులు అతుక్కుపోయాయి. బుగ్గపైన నుదుట నల్లటి మరకలు – చేతులకు కూడా. రమ్య తన సుఖం – సంతోషం చూసుకోదు. ఎప్పుడు తనను ఎలా సుఖపెట్టాలో అని ఆలోచిస్తున్నట్లు ఆ ప్రయత్నంలో వుంటుంది - ఎప్పుడు తమ్ముడితో గిల్లికజ్జాలు పెట్టుకొని మగ రాయుడులా తిరిగే రమ్య నిండైన స్త్రీగా తన ఎదుట నిలిచింది. ఈ స్త్రీ కొత్తగా, వింతగ ఎప్పుడూ కోరిక రగిలిస్తూ వుంటుంది. రాత్రి – పగలు తెలియదు.

''రమ్యా! మా మరిదిని చెంగుకు కట్టేసుకుని వెంట తిప్పుకుంటున్నావు! ఏం మంత్రం వేసావేమిటి? నాకు చెప్పవా!'' అంటూ గొడవ చేస్తుంది.

''సుగుణగారూ! ఇలా రెండు చేతులా ప్రేమను అందించే భార్య చుట్టూ ఏ భర్త తిరగకుండా వుంటారు. కర్చీఫ్‌తో – రమ్య ముఖానికంటిన మసి తుడిచి – తయారవు మనం అలా మన సైకిల్‌మీద షికార్‌గా వెళ్దాం'' అన్నాడు.

''హుర్రే'' అంటూ చిన్నపిల్లలా గెంతింది.

అలా బయటికి వెళ్ళిన గంటకు కాళ్ళీడుచుకుంటూ వచ్చారు. ఈజీ చైర్‌లో పడుకుని చేయిని చూసుకొంటున్న వెంకట్రావ్ ''ఏమైంది?'' అంటూ విచారించాడు.

మెట్లపైన వుసురుమంటు కూర్చుంటూ -- ''బావగారూ! మేం సైకిల్ ఎక్కిన వేళ బాగా లేదులావుంది. డబుల్స్ అని -- పోలీస్ సైకిల్ లాక్కున్నాడు'' అని చెప్పింది.

''అయ్యయ్యో! చెప్పటం మరిచాను నెలాఖరు కదా! వాళ్ళకి కేసులు కావాలి – నాకేం తెల్సును మీరు డబుల్స్ పోతారని'' అంటూ పెళ్ళున నవ్వి – ''సుగుణా!'' అంటూ కేకేసి చెప్పాడు.

''తర్వాత నవ్వుదురు – ముందు సైకిల్ వచ్చే ఏర్పాటు చేయండి – లేకపోతే ఈలోపల – పోలీసు ఆ సైకిల్ పార్టులు – మార్చేయగలడు!''

సుగుణగారి జోక్‌కి అందరూ నవ్వారు.

* * *

నెహ్రూజీపై సోవియట్ చిత్రం

సోవియట్ వార్తా చిత్రాల నిర్మాత యూరీ అల్డోఖిన్ తన తాజా చిత్రం ప్రదర్శనను పురస్కరించుకొని ప్రస్తుతం ఫ్రాన్సులో వున్నారు. జవహర్లాల్ నెహ్రూ గురించి, సుప్రసిద్ధమైన ఫ్రెంచి పురాతత్వ భాండాగారంలో తాను విషయసేకరణ జరపగలనని ఆయన చెప్పారు. నెహ్రూజీపై వార్తా చిత్రాన్ని సోవియట్, భారతీయ చిత్ర నిర్మాతలు సమిష్టిగా నిర్మిస్తున్నారు. స్టాక్ హోం ప్రాచీన సినిమా భాండాగారంలో లభ్యమయ్యే సమాచారాన్ని సైతం తాను అధ్యయనం చేయగలనని అల్డోఖిన్ చెప్పారు.


ఈ చిత్రం షూటింగ్‌కు సన్నాహాలు ముగియవస్తున్నాయి అని ఈ చిత్రం స్క్రిప్టు రచయితలలో ఒకరైన సుప్రసిద్ధ చరిత్రకారులు వి. జిమ్యానిన్, నొవాస్తీ విలేకరితో చెప్పారు. ఈ స్క్రిప్టును పరిశీలకులు ఆమోదించారు. చిత్ర దర్శకునితో కలిసి సోవియట్ ప్రాచీన భాండాగారంలోని విషయాలన్నింటిపై మేము పరిశీలించాం. ఇక్కడ భారతీయ చరిత్రకు సంబంధించిన కీలక ఘట్టాల సమాచారం మాకు లభించింది. మహోన్నతమైన సర్వతోముఖ వ్యక్తిత్వం గల జవహర్లాల్ నెహ్రూనూ, ఆయన అపారమైన కార్యకలాపాల మౌలిక ధోరణినీ చిత్రీకరించడానికి అవసరమైన సక్రమమైన పద్ధతిని దీనివల్ల రూపొందించుకున్నాం. సామ్రాజ్యవాద, వలస బానిసత్వం నుండి భారతీయ ప్రజల విముక్తికి పోరాడడమే నెహ్రూజీ ప్రధాన ధోరణి అని ఆయన అన్నారు.

అసలైన, సిసలైన

గ్లూకోన్-డి ®

ఒక్కటే. దానిని తయారు చేయువారు గ్లాక్సో.

మీకు పరిచయమైన
ఆకుపచ్చ ప్యాకెట్ పై తెలుపు
అక్షరాల్లో వున్న **గ్లూకోన్-డి**®
కోసం చూడండి.



చౌకబారు నకిలీ సరుకుల్ని కొని మోసపోకండి. అది మీ కుటుంబ ఆరోగ్యానికే హానికరం, అందుకే గ్లాక్సో వారి అసలైన గ్లూకోన్—డినే కొనండి. గ్లాక్సో వారి గ్లూకోన్—డి, శుద్ధమైన గ్లూకోజ్ పౌడర్‌తో పాటు విటమిన్ డి—2, భాస్వరం మరియు కాల్షియంలతో బలపరచబడిన నమ్మకమైన ఉత్పాదన,

కోట్లాది ప్రజలు వాడతారు దీన్ని—అవసరమైనప్పుడల్లా శక్తి కోసం.

గ్లూకోన్—డి రకరకాల ఆహార పదార్థాలకు, ప్రాణ రక్షణకు వాడే ఔషధాలకు, మందులకు పేరెన్నికగన్న గ్లాక్సో కంపెనీచే తయారుచేయబడుతోంది.

మీరు కొనే గ్లూకోన్—డి ప్యాకెట్ అసలైనదే అని నిర్ధారణ చేసుకోండి.

గ్లూకోన్-డి ® తిరిగి శక్తి నిచ్చేందుకు నమ్మకమైనది.

® ట్రేడ్ మార్క్

HTB-GLL-7027-TG

తెల్లవారింది.

ఆహారాన్వేషణకు పోటానికి పక్షులకే బద్ధకంగా వున్నట్లుంది. లేస్తున్నాయి — రెక్కలు కొట్టుకుంటున్నాయి. మళ్ళీ కునుకుతీస్తున్నాయి.

కొండగాలి చల్లగా వస్తూంది - శనివారం కాబోలు సుప్రభాతం ఎక్కడినుంచో వినిపిస్తూంది. రమ్య బద్ధకాన్ని దూరంగానెట్టి పైకి లేవబోయింది. ఎదపై శ్రీకాంత్ చెయ్యి వుండడంతో లేవలేక పోయింది. శ్రీకాంత్‌కి నిద్రా భంగం కాకుండా మెల్లిగా చెయ్యి తొలగించి లేచింది. లేచి చక, చకమని పనులన్నీ ముగించాలి — శ్రీకాంత్ వెళ్ళేటప్పటికి టిఫిన్ బాక్స్ అందివ్వగలుగుతుంది. టిఫిన్ చేసిపెట్టి -- మధ్యాహ్నానికి అన్నం, చపాతి కట్టిన టిఫిన్ బాక్స్ బ్యాగ్‌లోపెట్టి సైకిల్ హేండిల్‌కు తగిలిస్తుంది.

తను తింటుంది. భోజనమేకాదు. రమ్య తన అనురాగమంతా కూర్చిపెట్టినట్లు ఆస్వాదిస్తూ తింటాడు.

ఎప్పటిలా ఆ రోజు పని సాగనంటుంది. వంట్లో ఎలాగో వుంది. ఇదీ అని చెప్పలేని అనారోగ్యం అనిపిస్తూంది. మధ్య మధ్య శ్రీకాంత్‌ను చూస్తూనేవుంది. తీరికంతా తనదే అయినట్లు చల్లగాలి అనుభవిస్తూ తీయటి కలలు కంటూ ముఖంలో చిరునవ్వుతో ఆనందంగా — హాయిగా నిద్రపోతున్నాడు. ప్రొద్దున్నే లేవాలి — పని చేసుకోవాలి — అని తొందరలేదు. నిశ్చింతగా విష్ణులాగ కనిపించాడు. ఈ మగాళ్ళను చూస్తుంటే జలసీగా వుంటుంది రమ్యకు. అందుకే విష్ణుతో గిల్లికజ్జాలుపెట్టుకొనేది. కాఫీకప్పు బల్లమీదపెట్టి శ్రీకాంత్ దగ్గరకు వచ్చింది.

"కాంతీ ! పొద్దుపైకి వచ్చింది."

శ్రీకాంత్ కళ్ళు విప్పాడు.

"కాంతీ ! మీ మగవాళ్ళని చూస్తే ఇదిగా వుంటుంది. వారి దర్జాలను చూస్తుంటే నాకు మగాడిని కావాలని వుంటుంది. కాంతీ ఈ రోజ నేను మగాడిని" అంటూ మంచంలో పడుకొంది.

"మీ ఆడవాళ్ళని చూస్తే నాకూ ఎలాగ వుంటుంది. ఇంచక్కా ఇంట్లో వుంటారు. నాక ఈ రోజు పనికి పోవాలనిలేదు. ఆ మేనేజర్‌గాి ముఖం చూడాలనిలేదు." దుప్పటి సరిగ్గా కప్పుకుంటుంటే —

"కాంతీ! నీవు రమ్యవు — నేను శ్రీకాంత్‌ను- నీవు ఇంకా ముసుగుతన్ని పడుకుంటే పనుల జరగవు — కడుపు నిండదు" దుప్పటి తన లాక్కుంటూ అంది.

"రమ్యా ! నేను రమ్యనయితే వంట చేయను- ఇంచక్కా నేను పడుకుంటాను — నీవు కాంతి కదా —" అంటూ రమ్యను పైకి లాక్కున్నాడు -

త్వరలో
నర్సింగ్ హోం

అతని కొంటె చూపులు చూసి అతని మాటల అర్థం గ్రహించి —


"ఛీ..." అంటూ—నవ్వసాగింది. నవ్వుతూ— కళ్ళు తిరిగినట్లనిపించి అలాగే — శ్రీకాంత్‌పై వాలిపోయింది.

"రమ్యా ! రమ్యా ! ఏమయిందీ ?"

"ఏం లేదు — కళ్ళు తిరిగినట్లయింది అంతే" అంటూ లేవడానికి ప్రయత్నిస్తుంటే వారించి — పడుకోబెట్టాడు.

ఆ రోజు ఫ్యాక్టరీకి సెలవు పెట్టాడు.

వారి ప్రేమ ఫలించిందని, రమ్య గర్భంలో ప్రాణం పోసుకుందని వారు తెలుసుకొన్నారు.



ఆనందాశ్చర్యాలలో ఒకరి నొకరు పెనవేసుక పోయారు. ఆ వార్త చల్లగా సుగుణగారిదాక వెళ్ళింది.

"ఏమిటీ రమ్యకు గర్భమా ! వారిక్కడికి వచ్చి సంవత్సరము కూడా కాలేదు. సన్నని లేతమొక్కల వుంది. కడుపు ఎక్కడో అతుక్కుపోయి వుంటుంది ఇరుకుగా వున్నా గర్భం వచ్చింది. నాకు వుం ఇంత శరీరం ఏం లాభం" అని అనుకుంటే కడుపులో ఎలాగో వుంది.

రమ్యకు గర్భం అంటే కుళ్ళుగాలేదు. కా తనకు రాలేదే అని బాధగా వుంది. గుండెల్లో బరువుగా వుంది. తన కడుపు రెండు చేతుల బాదుకోవాలని, హింసించుకోవాలని వుంది—వెల్లకిల పడుకొని చూరుకేసి చూస్తున్న సుగుణకు తన కడుపులో ఏదో కదిలినట్లనిపించింది — ప్రక్కక తిరిగింది — అలా కదిలినట్లు మళ్ళీ అనిపించింది. అప్పుడే "సుగుణక్కా" అంటూ రమ్య లోనిక వచ్చింది.

"ఏమిటీ వేళప్పుడు పడకేసారు. వంట్లో బాగాలేదా ? లేక బావగారు లేరా ? నవ్వుతూ కాస్త నిమ్మకాయ పచ్చడి పెడతారా ! కాంతి పెరుగన్నంలోకి కావాలంటున్నారు."

"నీకు కావాలనుందని చెప్పరాదూ రమ్యా ! చిన్నపిల్లవి నీకేం తెలియదు. నీకేం తినాలనున్నా నన్ను అడుగు చేసి పెడ్తాను. మరో జన్మకయినా నా కడుపు పండుతుందేమో." మెల్లిగా లేచి పచ్చడి జాడీ దింపి సీసాలో ఇచ్చింది.

"థాంక్స్ ! అక్కా మీకు శ్రమ ఇచ్చాను." రమ్య వెళుతూ వెనుక్కు తిరిగి చూసింది. సుగుణక్క ఇష్టంగా నిమ్మకాయ తొన చప్పరించడం చూసింది.

"అక్కా ! మీరు తింటున్నారా ?" రమ్య నవ్వింది.

"ఏమిటో నీకు నీళ్ళూరుతున్నాయి" అంటూ కడుపు పట్టుకుంది.

"రమ్యా ! కడుపులో ఎలాగోవుంది — గ్యాస్ చేరిందేమో."

"అక్కా ! మీరు పడుకోండి — యిప్పుడే వస్తా" అంటూ పరుగెత్తింది.

"మెల్లిగా, మెల్లిగా పరుగులు తగ్గించు" అంటూ సుగుణ హెచ్చరించింది.

"కాంతీ ! త్వరగా వెళ్ళి లేడీ డాక్టరును పిల్చుకురా" అంది.


"ఏం నొప్పులు వస్తున్నాయా !" ఆదుర్దాగా అడిగాడు.

"ఛీ పో అప్పుడే నొప్పులేంటీ · ముందు వెళ్ళండి" అంటూ చెవిలో గుసగుసలాడింది.

ప్రైవేటు డాక్టరు వచ్చి, సుగుణగారిని పరీక్షించి మూడో నెల గర్భం, అని చెప్పింది.

సుగుణ ముందు కలగంటున్నానా అనుకుంది- శ్రీకాంత్ పరుగున వెళ్ళి వెంకట్రావ్‌గార్ని పిలుచుకు వచ్చి సుగుణక్క ముందు నిలబెట్టి వాళ్ళిద్దరూ మెల్లగా తప్పుకొన్నారు.

(ఇంకా వుంది)




కొత్తది. సున్నితమైన డెట్టాల్ సబ్బు.
మీ కుటుంబానికి ప్రీతితో లాలిస్తూ
సంరక్షించే ఈ సబ్బును సమకూర్చండి.
చర్మానికి, రూపానికి సంరక్షణ కోసం
శుభ్రత, ఆరోగ్యం కోసం ప్రతిరోజూ.
ప్రీతితో లాలిస్తూ సంరక్షించే డెట్టాల్ సబ్బు

మీ కుటుంబానికి లాలించే సంరక్షించే డెట్టాల్ సబ్బును సమకూర్చండి.



ఎన్నికచేయబడిన కొన్ని పట్టణాలలోనే దొరుకుతుంది.

Rediffusion/D/1163dTL



కల్చర్

తులసి బాలకృష్ణ

ముఖ్యమైన పనంతా ముగిసేసరికి సాయంత్రం ఆఫీసులో బాగా లేటయ్యింది రామ్మూర్తికి. తమ 'వెడ్డింగ్ డే' కాబట్టి ఆ రోజు శెలవు పడేద్దామనుకున్నాడు గాని తనకు పుట్టిమునిగేటంతటి పెండింగ్ వర్క్ వుండటంతో కుదిరింది కాదు.

స్కూటర్ని నేలబారు తారాజువ్వలా దూకించి, కొంప కొచ్చిపడి, తన కోసమే కళ్లు కాయలు కాయించుకున్న బెటరాఫ్‌తో, "త్వరగా స్నానానికీ, భోజనానికీ ఏర్పాటు చెయ్. సినిమా కెళ్తున్నాం మనం" అంటూనే బట్టలు జారవిడిచి, తువ్వాలు చుట్టుకొని, బాత్రూంలోకి పరుగెత్తాడు.

సినిమా మాట వింటూనే ఎగిరి గంతేసి, క్షణాల్లో వేణ్ణీళ్ల ఏర్పాటు చూసి, వంటింటిలోకి దూకింది ఆవిడ.

పావు గంటలో వేణ్ణీళ్ల స్నానం, వేడివేడి భోజనం ముగించి, వెచ్చటి దుస్తుల్లో దూరి, సతీ సమేతంగా స్కూటర్ని ముందుకు ఉరికించాడు.

"ఏ సినిమాకండోయ్"—మంగతాయారు, ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బవుతూ, తన రెండు చేతుల్తో భర్తశరీర చుట్టుకొలత కొలుస్తూ, కులుకుతూ అడిగింది.

చెప్పాడు రామ్మూర్తి.

"హాయ్ ... ఇంగ్లీషు సినిమా" అంటూ హుషారుగా కేకేసింది మంగ.

"ఇదేవుంది డియర్. వెధవది శెలవు కుదిరింది కాదు కానీ ఆనంద ప్రవాహంలో ముంచేసేవాణ్ని కాదూ నిన్ను" అన్నాడు రామ్మూర్తి, సంతోషంగానే నొచ్చుకుంటూ.

"పోన్లెండిగాని, చాలా రోజులయ్యింది ఇంగ్లీషు సినిమా చూసి. వెధవ తెలుగు సినిమాలు చూసి చూసి బోరెక్కిపోయింది – వెధవ సెంటిమెంట్లూ వీళ్లూ."

టాంక్ బండ్‌మీదుగా దూసుకుపోతోంది స్కూటరు.

"ఈ పిక్చర్ చాలా బాగుందని చెప్పాడు మా కొలీగ్ వినోద్. మన వెడ్డింగ్ డే అని చెప్పాను. ఈ పిక్చర్ తప్పకుండా చూడండని సజెస్ట్ చేశాడు."

"ఏ థియేటర్లో ?"

"సికింద్రాబాద్ సంగీత్‌లో. చలి, బాగా దూరం. అందులో సెకండ్ షో..."

"అయితే మరీ మంచిది. మీతో ఎంత దూరం ప్రయాణం చేస్తే అంత సరదా నాకు. చలిలో అయితేనే ఇద్దరం ఝూంఝూమ్మని స్కూటర్‌మీద సెకండ్ షోకి పోయి రావడం థ్రిల్లింగ్‌గా వుంటుంది" — నవ్వుతూ, ముక్కుతో అతని నడ్డిమీద కితకితలు పెడుతూ అంది మంగ.

టైము తొమ్మిది అవుతోంది.

చలికాలం కావడంతో అప్పటికే బాగా చలిగావుంది. కానీ, ఆ హుషారులో చలి ఓ లెఖ్ఖలో లేదు వాళ్లకి. టాకీసు దగ్గరవుతూన్నకొద్దీ హుషారు మరీ పేట్రేగిపోతోంది.


"టిక్కెట్లు దొరుకుతాయంటారా ?"

"ఎందుకు దొరకవు ? నిన్ను తీసుకొస్తున్న దెందుకు మరీ. లేడీస్‌కి 'ఈజీ'గా దొరుకుతాయి. పెళ్లి చేసుకోవడంవల్ల వున్న ఒకే ఒక్క లాభం ఎంత రష్‌గా వున్నా సినిమా టిక్కెట్లు సంపాదించడమే కదా" అంటూ పకపకా నవ్వేడు రామ్మూర్తి.

పది రూపాయల నోటు ఆమె చేతికిచ్చి, టిక్కెట్లు తీసుకోమన్నాడు.

"ఏ టిక్కెట్లు తీసుకోమంటారు ?


1950 కి ముందుగా మీరు జన్మించినట్లైతే ఈ ప్రకటన పూర్తిగా చదవండి.



10 కి 9 మంది ప్రజలకి 30 ఏళ్ళకి పైబడ్డ వారికి జుట్టు వూడటం సంభవిస్తుంది... మరి ఇది వారికి తెలియదు!

ఆ 9 మందిలో మీరు ఒక్కరైతే ప్యూర్ సిల్విక్రిన్ వాడటం నేడే ప్రారంభించండి.

మీ దువ్వెనతో మీ జుట్టును గట్టిగా దువ్వండి. మీ దువ్వెన మీదకి వెంట్రుకలు వచ్చినట్టయితే అనవాలు మీ జుట్టు వూడిపోతుందన్నమాట. మీరు వెంటనే—అంటే యిప్పుడే చర్య తీసుకోవాలి. లేకపోతే మీ జుట్టు పల్చనైపోయినట్టు మీకు అద్దంలో స్పష్టంగా కన్పించటం ప్రారంభిస్తుంది. ముఖ్యమైన-ఎమినో ఏసిడ్‌లు జుట్టుకి సహజమైన ఆహారం. అవి కొరతైతే, జుట్టుపల్చబడిపోయి ఆరోగ్యం కోల్పోతుంది. వాటి కొరతని తొలగించక పోయినట్టయితే జుట్టు వూడిపోతూనే వుంటుంది. అందుచేత మీరు ప్యూర్ సిల్విక్రిన్ వాడటాన్ని ఈరోజే ప్రారంభించటం అవసరం.



ప్యూర్ సిల్విక్రిన్‌లో ఏమిటి ఉంటాయంటే :

① పెద్దది చేసిన ఒక ప్యూర్ సిల్విక్రిన్ చుక్క సహజ జుట్టు అవసరాలని తీర్చేందుకు దేహం సమకూర్చే 17 ఎమినో ఏసిడ్‌ల అపూర్వ సమ్మేళనమే ప్యూర్ సిల్విక్రిన్.

ప్యూర్ సిల్విక్రిన్ ఎలా పని చేస్తుందంటే :

② లోపలకు చొచ్చుకు వెళ్ళే చర్య.

ప్యూర్ సిల్విక్రిన్ వెంట్రుకల మొదళ్ళలోవరకు వెళ్ళేదాక దాన్ని తలమీద చర్మ భాగంలో యింకేట్టు బాగా మర్దనం చెయ్యండి. శాస్త్ర పరిశోధనలతో రూపొందించి ప్యూర్ సిల్విక్రిన్‌లో ఇమిడ్చిన ప్రక్రియ పద్ధతి యిప్పుడు పని చెయ్యటం ప్రారంభిస్తుంది ; మళ్ళీ జుట్టు పెరుగుదల కొనసాగేట్టు దోహదం చేస్తుంది. మీ జుట్టు మళ్ళీ యధా ప్రకారం ఆరోగ్యంగా పెరిగే వరకూ మీరు ప్యూర్ సిల్విక్రిన్‌ని రోజుకి రెండుసార్లు చొప్పున ప్రతి రోజూ వాడండి.

ప్యూర్ సిల్విక్రిన్

ఇప్పుడు కొత్త పేక్‌లో వస్తోంది.



OBM/5005/Tel

ఫోర్ నైంటీఫైవ్ కంటే త్రీ సెవెన్టీఫైవ్ క్యూయే తక్కువుంది."

"ఛఛ! ఇంగ్లీషు మూవీస్‌కి మా ఫ్రెండ్సొస్తూంటారు. తక్కువ టిక్కెట్టు కెళ్తే బాగుండదు. ఫోర్ నైంటీఫైవే తీసుకో" అన్జెప్పి, స్కూటర్ని స్టాండులో పెట్టివచ్చాడు.

టిక్కెట్లు దొరికాయి.

చలిగా వుందని రెండు నెస్‌కేఫ్ తాగి, కాలక్షేపానికి రెండు కేకులు, రెండు చిప్స్ ప్యాకెట్లు కొనుక్కుని బాల్కనీకి నడిచారు, వేళ్లు ముడి వేసుకుని, చేతులు వూపుకుంటూ.

"మనంకూడా వెధవ తెలుగు సినిమాలు మానేసి, ఇంగ్లీషు సినిమాలే చూడడం అలవాటు చేసుకోవాలోయ్ డియర్. మనవాళ్లలా సెంటిమెంట్లతో చంపరు వాళ్లు. వాళ్ల కల్చరే వేరు. వినోద్ ఎప్పుడూ ఇంగ్లీషు సినిమాలే చూస్తాడు. నేను లైఫులో యిప్పటివరకూ చూసిన యింగ్లీషు సినిమాలు ఓ డజనుంటాయేమో అంతే చెప్పుకోవాలంటేనే సిగ్గు. అన్‌కల్చర్డ్ అనుకుంటారు కూడా" అంటూ కబుర్లు చెప్తూ, చిప్స్ ఆరగించసాగాడు.

రెండు ట్రయిల్స్ అయ్యాక అసలు సినిమా మొదలయ్యింది.

"సినిమా జరుగుతున్నప్పుడు పలకరించకేం. వాళ్ల ప్రతి డైలాగ్‌నీ, మూవ్

కల్చర్

మెంట్‌నీ, డైరెక్షన్ వేల్యూస్‌ని కీన్‌గా అబ్జర్వ్ చేద్దామనుకుంటున్నాను" అంటూ సీట్లో సర్దుకూర్చున్నాడు రామ్మూర్తి.

ముందు సీటు ఖాళీగా వుంది. కాళ్లు చాపి అందులో పెట్టుకుందామనుకుని, మళ్లీ కల్చర్ కాదని వూరుకున్నాడు. మరో నిముషానికి మాయలఫకీరులా పేద్ద రంప్ప జుట్టున్న మనిషొచ్చి, ముందు సీట్లో నిగడదన్ని నాలుగడుగుల ఎత్తునకూర్చున్నాడు.

ముందుకు వంగి, అతగాడితో, "కొంచెం క్రిందకు జరిగి కూర్చుంటారా ?" అని రిక్వెస్టు చేసాడు రామ్మూర్తి ఇంగ్లీషులో.

ఆ మనిషి తన హక్కేదో కోల్పోతున్నట్లు వెనక్కి మరచుర చూసి, ఇంకొంచెం పైకి సాగి మరీ కూర్చున్నాడు.

వాణ్ని తిట్టుకుంటూ ముందున్న రెండు తలకాయల మధ్యగా మెడవంచి సినిమా చూడసాగాడు రామ్మూర్తి.

పావుగంట ఆట గడిచింది.

అమెరికన్ ఇంగ్లీషు కావడంతో, వాళ్ల డైలాగులు ఒక్క అక్షరం ముక్క అర్థం కాలేదు రామ్మూర్తికి. అందులో అప్పటి వరకూ ఇద్దరే నటులున్నారు. ఒకరు మగ, ఒకరు ఆడ. కేవలం వాళ్ల మూవ్‌మెంట్సుని బట్టి, నటననిబట్టి వాళ్లిద్దరి మధ్య సంబంధం, వాళ్లేం మాట్లాడుకుంటున్నార వూహించాడు. వీలయినంతవరకు మనసుని సినిమామీద లగ్నం చేసి, చెవులు రిక్కించి వాక్యాలని అందుకోవాలని, వాటి భావాన్ని గ్రహించాలనీ శతవిధాల ప్రయత్నించాడు. ఊహుఁ ... ఐ, యు, కమింగ్, గోయింగ్ లాంటివి తప్పితే ... ఏమీ అర్థం కాదే ... పోనీ యింగ్లీషు రానివాడా! పోస్ట్‌గ్రాడ్యుయేట్. వాళ్లు సరిగ్గా ... అంటే కొంచెం అర్థమయ్యేలా వుచ్ఛరిస్తే కనీసం ఎనభై శాతం మాటలకు అర్థం చెప్పగలడు.

అరగంట గడిచింది.

ఆ యిద్దరు మనుషులకీ మరో పిల్లకాయ పాత్ర తోడయ్యింది. అంతే.

ఫ్యామిలీ సెంటిమెంటు స్టోరీలాగుంది.


అంటే యింగ్లీషు సినిమాల్లోకూడా...!!!

నెమ్మదిగా తలనొప్పి మొదలయ్యింది.

సీట్లో యిబ్బందిగా కదుల్తూ యధాలాపంగా ప్రక్కకు చూసాడు. చేతి గోళ్లను చూసుకుంటూన్నదల్లా ఉలిక్కిపడి, గబగబా నవ్వి, సినిమా చూడసాగింది మంగ. బహుశా ఆమెకీ బోరు కొడ్తోందేమో – ఆమెకూడా తనలాగే ఎద్యుకేటెడేనే! తన ఒక్కడికీ ఏ కారణంగానైనా అర్థం కాలేదనుకుందామంటే ఆమెక్కూడా...

మరో పాత్రేదీ రాకుండానే మరో అరగంటలో ఇంటర్వెల్ అయ్యింది.

వేలాది కుటుంబాలు అనాదిగా వాడబడుతున్న
లవంగనూనె ప్రభావాలన్నింటినీ ప్రామిస్‌లో మళ్ళీచూసారు.



లవంగనూనెతో కూడిన సాటిలేని టూత్‌పేస్ట్ ప్రామిస్

మీరూ ఎందుకు వాడి చూడకూడదు మరి!



ప్రామిస్
దంతక్షయంనుండి రక్షణకు
తోడ్పడుతుంది. నోటినితాజాగా
రూపొందించి
దుర్వాసనను అరికడుతుంది.

3 బల్సారా ఉత్పాదన

ఆరోగ్యంచిందే పళ్ళు,
చిగుళ్ళు, తాజాశ్వాస–
అదే మరి ప్రామిస్ వాగ్దానం.

CHAITRA-BLS-453 TEL

ఖాళీ ట్యూబ్ ఆఫరు 31 డిసెంబరు 81 వరకు పొడిగించబడినది. వివరములకు మీ డీలరును అడగండి.

"విశ్రాంతి" అన్నాడు రామ్మూర్తి గట్టిగా, ఒళ్ళు విరుచుకుంటూ, నవ్వు కొనితెచ్చుకుని. నిజంగానే అది విశ్రాంతి అతనికి. 'బోరులా వుందే' అందామను కున్నాడుగాని, ధైర్యం చాలలేదు — ఒహవేళ ఆమెకు నచ్చుతోందేమో, అందులో వున్న గొప్పతనం తన కర్థం కావడంలేదేమోనని.

బయటకు నడిచి, చెరో కాఫీ తాగి, పైకి బయల్దేరారు.

రామ్మూర్తి పాతఫ్రెండు ముద్దుకృష్ణ ఎదురయ్యాడు మెట్లమీద

ఆ కబుర్లు ఈ కబుర్లు అయ్యాక, "ఎక్సలెంట్‌గా వుందికదూ మూవీ" అన్నాడు ముద్దుకృష్ణ స్టైల్‌గా.

ఒళ్ళు మండిపోయింది రామ్మూర్తికి — 'రాముడు స్కూలుకి పోవుచున్నాడు' అనేది యింగ్లీషులో చెప్పలేవు, నీకు 'ఎక్సలెంట్‌గా వుంద్రటా' అని అందామనుకున్నాడు గానీ, యింతలో మంగ "బాగుంది" అనేసింది.

మళ్ళీ మొదలయ్యింది సినిమా.

అదే యిద్దరు నటులూ, పిల్లకాయ.

అదే సెంటిమెంటల్ స్టఫ్.

డైలాగులు ఒక్కక్షరం అర్థమయి చావట్లేదు.

పోనీ ఓ చక్కని సీను లేదు.

ఓ పేద్ద ఓడ మునిగిపోవడమో, విమానం భగ్గున మండుతూ కూలిపోవడమో, తిమింగలం కడుపుని చీల్చుకుని ఎవడో బయటకు రావడమోలాంటి థ్రిల్లింగ్ సన్నివేశా లేవన్నా వుంటే ఎంత బాగుండును. అయినా యింగ్లీషు పిక్చరంటూ చూస్తే డిష్యూం డిష్యూం జేమ్స్‌బాండ్ పిక్చరో, లేకపోతే టెక్నికల్‌గా హైలెవెల్లో వున్న టవరింగ్ ఇన్‌ఫెర్నో, ది స్పై హూ లవ్డ్‌మి, బులెట్ ట్రయిన్ లాంటి సినిమాలో తప్పితే ఫేమిలీ స్టోరీస్ ఛస్తే చూడకూడదురా దేవుడా అని తిట్టుకుంటూ పక్కకు చూసాడు.

హాయిగా ప్రక్కకు ఒరిగి నిద్రోపోతోంది సహధర్మచారిణి.

'అదృష్టవంతురాల'నుకున్నాడు.

ఏదో డైలాగ్ చెప్పాడు హీరోగారు.

కిసుక్కున నవ్వాడొకడు పైవరసలో.

హాలు మొత్తంలో మరో పది పదిహేను మంది ఆ నవ్వుకి కోరస్ పలికారు.

ఒళ్ళు మండిపోయింది రామ్మూర్తికి.

షో ఆపు చేయించి, "ఏమిటర్థమయ్యిందర్రా మీకు ?! ఆఁ. ఎవడో ఒకడు నవ్వితే ఫోజు

కల్చర్

కోసం, అర్థం కాకపోయినా, నవ్వకపోతే చిన్నతనమయినట్లు, మిగిలిన వాళ్ళూ నవ్వడమా?" అని గదమాయించి అడగాలనిపించింది. కోపాన్ని ఆపుకున్నాడు.

అదే బోరులో సినిమా అయిపోయింది.

భార్యాభర్తలు విడిపోవడం, కలవడం యిదీ కథ. మధ్యలో చచ్చేటన్ని సెంటిమెంట్లు. అయిదు నిముషాల కథని 'టగ్ ఆఫ్ వార్' ఆడి, రెండు గంటలు సాగదీసారు. అదీ విషయం.

బాగా తలనొప్పిగావుంది రామ్మూర్తికి.

ఆ బాధలో ఒళ్ళుమరిచి, మంగ చేతిమీద ఒక్కటి చరిచి, నిద్రలేపాడు. ఉలిక్కిపడి లేచి, సిగ్గుపడిందామె.

రుసరుసలాడుతూ మెట్లు దిగుతూండగా కాలు జారింది రామ్మూర్తికి. కాని నిలదొక్కుకున్నాడు. కిచకిచ నవ్వు వినిపిస్తే రివ్వున తల వెనక్కి విసిరి చూసాడు. నిలబెట్టిన బెడ్డింగుల్లా వున్న, ఏ జాతివాళ్లో తెలియని ఆడంగులిద్దరు రామ్మూర్తికాలు జారినందుకు నవ్వుతున్నారు. అసలే చిరాకులో వున్నాడేమో మరీ మండిపోయింది అతనికి. ఇద్దరి జుట్లూ పట్టుకుని ఝాడించేయాలన్నంత కోపం వచ్చిందిగాని ... తమాయించుకున్నాడు.

అతని చికాకుని మరింత పెంచే బాధ్య స్కూటర్ తీసుకున్నట్లుంది — ఓ పట్టాన స్టార్టవక తెగ యిబ్బంది పెట్టింది. ఇక వంచి, అటువంచి, కిక్ కొడుతూ నా తంటాలు పడుతున్నాడు దాంతో.

'ఇలాంటి సందర్భాల్లో ఈ ఆడాళ్లసాయ ఏ మాత్రం వుండదు. అలా చూస్తూంట రంతే చవట మొహంవేసుకొని' అంటు అనవసరంగా భార్యని తిట్టుకోసాగాడు. జన అంతా కార్లమీద, స్కూటర్లమీద, ఇత విధాలుగాను క్షణాల్లో వెళ్లిపోయారు రామ్మూర్తి, మంగ మిగిలారు బిక్కు బిక్కు మంటూ.

"సర్వీసింగ్ చేయించాలనుకుంటూనండీ" అంది మంగ, ఆవులిస్తూ.

చురచుర చూస్తూ, "ఏమిటే, అర్ధరాత్రి బండికి సర్వీసింగా ?" అని అరిచాడ రామ్మూర్తి.

బిక్కవోయి, "ఇప్పుడు కాదండీ. అసల ఈమధ్య సర్వీసింగు చేయించక బండ ట్రబుల్ యిస్తోందంటున్నాను" అంది నూతిలోంచి మాట్లాడుతూన్న గొంతుతో.

"ఇదిగో మంగా! మనం కొంపకు తగలడేదాకా నువ్వు దయచేసి నోరు విప్పొద్దు. ప్లీజ్. నా తల పగిలిపోతోంది. ఏం మాట్లాడతానో నాకే తెలియదు" అని, స్పార్క్ ప్లగ్ తీసి, క్లీన్ చేసి, స్కూటర్‌తో మరో పావుగంట కుస్తీ పట్టేసరికి, స్టార్టయింది అది, ఉడికిస్తూ. విరగబడి నవ్వుతూ మేఘాల్లాంటి పొగల్ని కక్కింది కూడా. 'ఇంటికి పద నీ పని చెబ్తా — ఇంత ట్రబుల్ యిస్తావా అర్ధరాత్రివేళ' అని దాన్ని తిట్టుకుంటూ ముందుకి వురికించాడు.

అంత చలిలోనూ దాంతో తంటాలుపడే సరికి చెమటలు పట్టాయిగాని, వేగంగా ముందుకు సాగుతూంటే తిరిగి చలి మొదలయ్యింది.

దట్టంగా కురుస్తోంది మంచు.

ఐసుగడ్డల మధ్యగా పోతున్నట్లుంది.

వేళ్ళు కొంకర్లు పోతున్నాయి.

పళ్ళు టకటక కొట్టుకుంటున్నాయి.

హారన్ కొట్టాలన్నా, స్పీడ్ రైజ్ చేయాలన్నా, క్లచ్ నొక్కాలన్నా వేళ్ళు కదలక మొరాయిస్తున్నాయి.

ట్యాంక్ బండ్ మీదుగా వస్తూంటే చలిగాలికి కళ్ళమ్మట నీళ్ళు ధారలుగా


మంగళకరమైన వెన్నెల మోమును
మెరుగు పరచటానికి
ఐటెక్స్
మాట్ ఫినిష్ తిలకం
దేశమంతటా నాగరీక యువతులు కోరి ధరించేది ఐటెక్స్ తిలకం నారీమణుల వృష్ప విధానాన్ని అద్భుత సౌందర్యాన్ని ప్రస్ఫుటం చేసేటందుకే కన్నులకింపైన 14 రంగులలో దొరుకుచున్నవి. శాస్త్రీయ విధానంలో తయారుచేయబడు ఐటెక్స్ తిలకం చర్మానికి ఎటువంటి హానియు కలుగజేయదు
EYETEX
SHAKE WELL
అరవింద్ లాబరేటరీస్ మద్రాసు

కారపోగాయి. ఎవరైనా చూస్తే ఏడుస్తున్నాడేమో అనుకుంటారు.

తలమీద ఏభై కిలోల ఐసుగడ్డ పెట్టినట్లుంది.

మంగ భర్త మూడ్‌ని గ్రహించి, కిక్కురుమనకుండా, చీరకొంగు చెవులమీదుగా కప్పుకుని, వెనక సీటుమీద దూరంగా వణుకుతూ కూర్చుంది. మాంచి మూడ్‌లో పిక్చర్‌కి వెళ్ళి, మరింత మాంచి పిక్చర్ చూసి, ఇంకా మాంచి మూడ్‌లో కిలకిలలాడుతూ కొంపకు వస్తాం అనుకున్నారు. కాని యిలా... బద్ధ శత్రువుల్లా మౌనంగా, దారితప్పిన వారిలా బిక్కు బిక్కుమంటూ, భరించలేని తల నొప్పితో, ఎవరో తరుముకొస్తున్నట్లు, శిక్ష పడ్డట్లు, తప్పనిసరిగా అర్ధరాత్రి సమయంలో చలిలో యిలా... వినోద్‌గాడ్ని మర్డర్ చేసెయ్యాలన్నంత కోపం వచ్చింది రామ్మూర్తికి.

'వెధవ పీనుగ. రేపు వెళ్తానే మొహం మీద వుమ్మేస్తాను. నష్టపరిహారం చెల్లించమంటాను — మా వెడ్డింగ్ డేని యిలా పాడు చేసినందుకు. తెలుగులో సెంటిమెంటల్ స్టఫ్ చూసి చూసి బోరెత్తి పోయినవాళ్ళం, ఆ వెధవ రికమెండేషన్‌తో ఇంగ్లీషు సినిమాకి అఘోరిస్తే ... అందులో కూడా ... ఏదో కల్చరూ, కాకరకాయలూ అన్నాడే ...'

కల్చర్

కొంపకి యెలా చేరారో తెలియదు.

ఇద్దరి మధ్య ఒక్కమాట కూడాలేదు.

బట్టలు కూడా మార్చుకోలేదు.

అలాగే మంచంమీద దూరం దూరంగా పడ్డారు.

మరో పది నిముషాలు భయంకర నిశ్శబ్దంలో గడిచాయి.

భర్త చేతిని తన చేతిలోకి తీసుకుని, అతని నుదుటిమీద తన మరో చేతిని వుంచి, మృదువుగా స్పృశిస్తూ, "పిక్చరు మీకు చాలా బోరుకొట్టిందని నాకు తెలుసు. నాకూ బావులేదు. పోన్లెండి. మీరేం బాధపడొద్దు మనసు పాడు చేసుకోకండి. ఏమీ ఆలోచించకుండా ప్రశాంతంగా నిద్రపోండి" అంది మంగతాయారు.

కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యింది రామ్మూర్తికి.

"నో డియర్ ... ఈవాళ ... అసలు ... చాలా హేపీగా ... కానీ యిలా ..." కోపంతో, దుఃఖంతో ఉక్కిరిబిక్కిరిగా వుండి, మాటలు రావడంలేదు.

"నాకు తెలుసు — రెస్టు తీసుకోండి" నుదురు నిమిరింది.

"నిన్ను కూడా ... తిట్టేశాను ..."

"మరేం ఫర్వాలేదు. మర్చిపోండి."

"రేపు వినోద్‌గాడ్ని..." పళ్ళుకొరికాడు.

"అలాగే ... తప్పకుండా ... బాగా తిడ్దురుగాని. నా తరపున కూడా .. సరేనా ..."

చాలా సేపటికి, ప్రయత్నంమీద, భార్య సపర్యలకు ఊరట పొంది, నిద్రపోయాడు రామ్మూర్తి.

* * *

చికాగ్గా, ఆలస్యంగా తెల్లవారింది.

ఆఫీసుకి ఎప్పుడు వెళ్తానా, వినోద్‌గాడ్ని అందరి ఎదురుగా ఎప్పుడు తిడతానా అని ఎదురు చూస్తున్నాడు రామ్మూర్తి.

ఆ శుభఘడియలొచ్చాయి.

కాని, ఆఫీసుకి వెళ్తానే యిద్దరికీ ముఖ్యమైన పనులు తగలడంతో ఓ అరగంట సేపు మహా బిజీగా వున్నారు రామ్మూర్తి, వినోద్ కూడా. రామ్మూర్తి పనిలోపడి ఆ విషయమే మర్చిపోయాడుకూడా.

"ఎలావుంది గురూ మూవీ? సుపర్బా?" అని అరిచాడు వినోద్ తన సీట్లోంచే, గట్టిగా అందరికీ వినిపించేలా.

పనిలో తల మునకలు అవుతూన్న రామ్మూర్తి ఉలిక్కిపడి, అటు తల తిప్పాడు.


అందరూ రామ్మూర్తి వైపే చూస్తున్నారు. అతను బాగుందంటే తామూ చూద్దామనుకుంటున్నట్లుగా వున్నాయి కొందరి చూపులు.

"ఎక్సలెంటా?" అని రెట్టించాడు వినోద్, అదే సమాధానాన్ని ఆశిస్తూ.

"చాలా బావుంది."

చటుక్కున అనేసి, తల దించుకుని, తను ఆ సమాధానం యిచ్చినందుకు విస్తుపోయాడు రామ్మూర్తి.

"అవును మరి. ఇంగ్లీషు సినిమా బాగులేదనడం 'కల్చరు' కాదు" అంది మనస్సు. ●



గమనిక

గేయాలు పంపేవారు వాటితో తపాలా కార్డు జతపరచవలసి వుంటుంది. గేయాలు త్రిప్పి పంపబడవు. గేయాలు, కవితలు సాధ్యమైనంత క్లుప్తంగా వుండటం మంచిది

సం.



జేగంటలులో పిచ్చితల్లి డోకులు

పెరట్లో కిష్టయ్య (అల్లు) డోక్కుంటున్నాడు. పద్మాలు (రాజ్యలక్ష్మి) వస్తూ, "ఇంద — ఈ మాత్రేసుకోండి. వాంతులాగుతాయి. భేదులవుతాయి... మరెట్లాగండీ — ఇటూగాక అటూగాక కడుపులో కుళ్ళు పోయేదెట్లాగండీ?" అన్నాడు కష్టిస్తూ.

మాత్ర అందుకుంటూ, "ఏం కుళ్ళో — నా మొహం!" అని కిష్టయ్య కంగారుతో గొణుక్కుంటూండగా పక్కనుంచి ఎవరో డోక్కోవడం వినిపించి, అటు చూశాడు. అరుగు మీద కూర్చొని పిచ్చితల్లి (సుమంగళి) డోక్కుంటోంది. "ఒరేయ్, దీనిక్కూడా ఓ మాత్రియ్!" అన్నాడు కిష్టయ్య.

పిచ్చితల్లి చింతకాయ చప్పరిస్తూ, అంది: "నాన్నా, నాకు అన్నం సహించటంలేదు!"

"ఏం?" అమాయకంగా అడిగాడు కిష్టయ్య.

"అయ్యా, మామూలు డోకులు కావు," అన్నాడు పద్మాలు.

"ఏం? కలరా ఏమిటీ కొంపతీసి?"

"కలరా కాదు, గిలరా కాదు — అయ్యా, మిమ్మల్ని తాతను చేసే డోకులు," అని విడమర్చి చెప్పాడు పద్మాలు.

"అయ్య బాబోయ్! కొంప మునిగింది!" నెత్తిన చేతులు పెట్టుకొని కిష్టయ్య కుప్పలా కూలిపోయాడు.

మాగంటి రవీంద్రనాథ్, కె. నరసింహం నాయుడు సమర్పణలో కె. మురారి, విజయబాపినీడు నిర్మించిన జ్యోతి చిత్రవారి "జేగంటలు" చిత్రానికి ఎస్. శ్రీనివాసరావు దర్శకుడు. విజయబాపినీడు కథకు ఆత్రేయ సంభాషణలకర్త. మహదేవన్ సంగీత దర్శకుడు.

శోభన్‌బాబుతో కె ఛటర్జీ నిర్మించే విజయ్

నవత మూవీస్ "విజయ్" షూటింగ్ మే 11న మొదలైంది. "జూన్ చివరి వారంలో రెండవ షెడ్యూల్. ఆగస్టు 1 నుంచి 24 వరకు మూడవ షెడ్యూల్ ఏర్పాటైంది," అన్నారు డైరెక్టర్ కోదండరామిరెడ్డి. శోభన్‌బాబు, జగ్గయ్య, గుమ్మడి, సత్యనారాయణ, అల్లు రామలింగయ్య, చక్రవర్తి, జయంతి ఆదిగాగల వారుంటారు. సత్యానంద్, చక్రవర్తి, సి. నారాయణరెడ్డి, వేటూరి, ఆరుద్ర, వెంకట్, ఎస్. కృష్ణారావు, అంకిరెడ్డి, రామ్మోహనరావు వగైరా సాంకేతికవర్గం. "హీరోయిన్ కోసం అన్వేషిస్తున్నాం," అన్నారు నిర్మాత కె. ఛటర్జీ.

ఏ. ఎన్. ఆర్., దాసరి మరో చిత్రం మేఘ సందేశం

"జూలై 1 నుంచి 25 వరకు ఒకే షెడ్యూల్‌లో పూర్తవుతుంది," అన్నారు తారకప్రభు ఫిల్మ్స్ "మేఘ సందేశం" చిత్రానికి రచన, దర్శకత్వ బాధ్యతలు వహించే దాసరి నారాయణరావు. జయసుధ, జయప్రద నాయికలు. ఇది ఏ.ఎన్.ఆర్. 200వ చిత్రం.

రుద్ర తాండవంలో కోటేశ్వరరావు కోలాహలం

కిరణ్ (శరత్‌బాబు) టాక్సీలో కూర్చున్నాడు. డ్రైవర్ (రాళ్ళపల్లి) స్టార్ట్ చేయబోతూండగా కోటేశ్వరరావు (మాధవ్‌ప్రసాద్) హడావుడిగా పరుగెత్తుకుంటూ వచ్చాడు. "బాబ్బాబూ, ఆవు! ఆవు! వచ్చి నీ టాక్సీ టైరున్నై పడతాను. ఈ గండం గడిచి పిండం బయటపడేలా చెయ్యి, నాయనా! నన్ను తిమ్మకొల్లి శ్మశానం దగ్గర వదిలేయ్."

"శ్మశానం దగ్గరకెళ్ళాలంటే మీరు టాక్సీ ఎక్కడం కాదు; టాక్సీ మీ మీద ఎక్కాలి. కళ్ళు మూసుకుని అలా రోడ్డుమీద నిలబడండి—చాలు," అన్నాడు డ్రైవరు.

"అర్ధరాత్రి పీకటి జోకులెయ్యకు, నాయనా! నీకు దణ్ణం పెడతాను. పది గంటలకల్లా నేను మా ఇంట్లో ఉండి తీరాలి."

"బండిలో పేసెంజరున్నారండి. ఆయనోకే అంటే నేను ఒకేయ్."

వెనుక సీట్లో గంభీరంగా కూర్చొనున్న కిరణ్ దగ్గరకొచ్చి కోటేశ్వరరావు "పేసెంజరుగారూ, పే సెం జ రు గా రూ! నా పేరు కోడిగుడ్ల కోటేశ్వరరావండి ... మా తాత కోళ్ళమ్మేవాడు. మా నాన్న కోడిగుడ్లమ్మేవాడు. నేనేమో అమ్మనండి. వాళ్ళుపెట్టిన గుడ్లు తింటూ కూచుంటాను. పెద్దమనిషిని. అర్జెంటుగా పది గంటలకల్లా గాంధీనగరం వెళ్ళాలి. మీకు అభ్యంతరం లేకపోతే ముందు సీట్లో కూచుంటాను," అని ప్రాధేయపడ్డాడు. కిరణ్ "ఊఁ," అనడమే తరువాయి కోటేశ్వరరావు పరుగున వెళ్ళి ముందు సీట్లో కూలబడ్డాడు.

విజయ బాపినీడు పర్యవేక్షణలో మాగంటి రవీంద్రనాథ్ చౌదరి నిర్మించే శ్రీ శ్యాం ప్రసాద్ ఆర్ట్స్ ప్రొడక్షన్స్ "రు ద్ర తాం డ వం"లో మురళీమోహన్, ఈశ్వర్రావు, చిట్టిబాబు, మమత, జ్యోతిలక్ష్మి, అంజలీదేవి ఇతర తారాగణం.

వేటూరి రచన, శం క ర్ గ ణే శ్ — శ్యాం సంగీతంతో రాజ్ భరత్ దర్శకుడు.



ఇ క వ చ్చే వా రం

మీసం కోసం

"రజనీకాంత్ మీసం లేకుండా నటించాడు. అందుకే ఈ చిత్రానికి ఇలా పేరు పెట్టాం. 'గోల్‌మాల్' హిందీ చిత్రం ఆధారం. జూన్ మాసాంతంలో రిలీజ్ చేస్తాం," అన్నారు నిర్మాతల్లో ఒకరైన దొరై. కె. బాలచందర్ దర్శకత్వం వహించిన ఈ కళాకేంద్ర మూవీస్ హాస్య చిత్రంలో మాధవి, రావు గోపాలరావు, జానకి, నాగేష్, యూన్ని, విజయ పాల్గొన్నారు. గణేశ్‌పాత్రో, ఎం.ఎస్. విశ్వనాథం, లోకనాథ్, ఎస్.ఆర్. కిట్టూ ముఖ్య సాంకేతిక నిపుణులు.



'ముద్ద మందారం'లో ఒక దృశ్యం

కలియుగ దైవం

"శ్రీ వేంకటేశ్వరస్వామిగా రామకృష్ణ పద్మావతీదేవిగా లత మా చిత్రంలో కనిపిస్తారు," అన్నారు ఎం. ఆర్. రాజా. ఈయన కథ స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో సి. కమలమ్మ, బి. జె. రెడ్డి, సి. కృష్ణమూర్తి నిర్మించే శ్రీ రాఘవేంద్ర ఆర్ట్ క్రియేషన్స్ "కలియుగ దైవం" చిత్రానికి మే 22వ అన్నమాచార్య కీర్తన పల్లవితో వేటూరి రచన రికార్డ్ చేశారు. శరత్‌బాబు, శారద, అల్లు రామలింగయ్య, రమాప్రభ, పి. ఎల్. నారాయణ, పండరీబాయి, మాడా, జీవా, మమత, వై. విజయ వగైరా నటవర్గం. సముద్రాల, వేటూరి, సత్యం, రంగా, వేణు, రవీంద్రగోపాల్, అమర్‌నాథ్‌లతో ఈ చిత్రాన్ని డాక్టర్ ఎం. రాధాకృష్ణయ్య సమర్పిస్తారు.

కె. ఎస్. ఆర్. దాస్ దర్శకత్వంలో కృష్ణంరాజు

"జూన్ 27న సెట్స్‌కు వెళ్తున్నాం," అన్నారు కె.ఎస్.ఆర్. దాస్. ఈయన దర్శకత్వంలో పింజల నాగేశ్వరరావు నేతృత్వంలో ఆర్. ఎం. సుబ్రహ్మణ్యన్ నిర్మించే చిత్రానికి మే 27న తొలి గీతం ధ్వని ముద్రితమైంది. కృష్ణంరాజు, జయప్రద, కె. ఆర్. విజయ, సత్యనారాయణ ముఖ్య భూమికలు నిర్వహిస్తారు. జంధ్యాల, సత్యం, వేటూరి, ఎస్. ఎస్. లాల్ వగైరా సాంకేతికవర్గం. ఉషయాంబికై పతాకంలో తయారౌతుందీ చిత్రం.

సి ని మా

విశ్వరూపంలో విశ్వం విశ్వస్వరూపం

అతి భయంకరమైన ప్రళయాన్ని సృష్టించింది తుఫాను. ఊళ్ళూ వాళ్ళూ సర్వనాశనమయ్యాయి. మృతకళేబరాలు నీటిపై తేలుతున్నాయి. విశ్వం మాస్టారు (ఎన్. టి. ఆర్.) విద్యార్థుల సాయంతో శవదహన కార్యక్రమంలో నిమగ్నుడై ఉన్నాడు... ఓ వంక నాయకులు, వారి తొత్తులు డ్రింకులు సేవిస్తూ, దండలు మెడలో ఊగుతూండగా మైక్ ముందు నిలుచొని, ఘాటుగా మాట్లాడుతూ, గొంతులేస్తూ, చేతులూపుతూ – తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నారు.

విశ్వం కళ్ళల్లో ఎర్రజీరలేర్పడ్డాయి. రౌద్రం ముంచుకొచ్చింది. ముందుకు దూకాడు. "ఆగండి!"

నాయకులందరూ ఉలిక్కిపడ్డారు. మెడలో దండలు తెగిపోయినట్లయింది వాళ్ళకు.

"ఏమిటి ? మీరు చేస్తున్నదేమిటి ?" విశ్వం గర్జించాడు.

"దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించి, మా ప్రజలకు సానుభూతి తెలిపి, ధైర్యం చెప్పడానికి వచ్చాం," తడబడుతూ అన్నాడు గున్నారావు (సత్యనారాయణ).

"అక్కడ శవాలు నీళ్ళమీద తేలుతూ ఉంటే– ఆ శవాలు ఏ తండ్రివో, ఏ తల్లివో, ఏ చెల్లివో, ఏ అన్నవో గుర్తుపట్టలేని స్థితిలో ఉంటే – మీరిక్కడ సభలు, సత్కారాలు, సన్మానాలు చేయించుకుని, పూలదండలు వేయించుకుని, మైకుల ముందు నిలబడి మాట్లాడడానికి సిగ్గులేదూ ?"

లాగి దవడ బద్దలుగొట్టినట్లయింది నాయకమ్మన్యులకు. అన్నారావు (రావు గోపాలరావు) తడుముకుంటూ, "ఎందుకు సిగ్గు ? మైకులకీ, రాజకీయ నాయకులకీ విడదీయరాని సంబంధముంది," అని సర్దుకోబోయాడు.

"హుఁ! రాజకీయ నాయకులు ! ఎన్నోసార్లు వరదలొస్తున్నాయి. ఎన్నోసార్లు ఏర్లు పొంగుతున్నాయి. మీ బతుక్కి ఒక్క ప్రాణాన్ని కాపాడారా? ఒక బాధితుడ్ని ఆదుకున్నారా ? బురదలో కాలు పెట్టారా ? శవాన్ని ముట్టుకున్నారా ? రాజకీయ నాయకులట ! ఆ పేరు చెప్పుకొని, హెలికాప్టర్లు తెప్పించుకుని, సిబ్బందిని తెప్పించుకుని, ఏసీ రూముల్లో కూర్చొని సంతాప సభలు జరిపితే, ఆ ప్రాంతానికి వెళ్ళినట్టా ? బాధితుల్ని ఆదుకున్నట్టా ? మన దేశాన్ని ఉద్ధరించినట్టా ? మీలాంటివాళ్ళను పీల్చి ఉప్పుపాతర్లో పెట్టించాలి. అసలు తప్పు మీదికాదు. శవాలను కూడా ముట్టుకోడానికి ఇష్టపడనివారిని ప్రోత్సహించి, ఇలాంటి సభలు జరిపించే ఈ జనానిది తప్పు."

విశ్వం ఆవేశపూరిత వచనాలకు సభికుల్లోని ప్రతి మనిషి నరనరాల్లో చైతన్యం ఉబికింది. ప్రతి మనిషీ ఓ రుద్రుడయ్యాడు. ఒక్క పెట్టున వేదిక మీదికి జనమంతా ఉరికారు. ఇక నాయకమ్మన్యులందరూ గోచీలు బిగించి, వేదిక దూకి, దౌడు లంకించుకున్నారు.

దాసరి నారాయణరావు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వంలో కె. భానుప్రసాద్ నిర్మించే కవిరత్నా మూవీస్ "విశ్వరూపం" చిత్రం కౌసరాజా సమర్పణ.

ప్రసన్నలక్ష్మి ప్రొడక్షన్స్

"జూన్ 15 నుంచి షూటింగ్," అన్నారు గంగూరి వెంకటరత్నం. ఈయన, ఎ. సి. త్రిలోక్‌చందర్ దర్శకత్వంలో నిర్మించే చిత్రానికి ఇటీవల తొలి గీతం రికార్డు చేశారు. కృష్ణ, శ్రీదేవి, రావు గోపాలరావు, గుమ్మడి, గిరిబాబు, త్యాగరాజు, పుష్పలత మున్నగు వారుంటారు. బాలమురుగన్ కథకుడు. డి. వి. నరసరాజు సంభాషణలకర్త. మహదేవన్, విశ్వనాథ్‌రాయ్, రంగారావు, విఠల్ తదితర సాంకేతిక బృందం.

దాసరి దర్శకత్వంలో ఎ. ఎన్. ఆర్. – లక్ష్మి

"దాసరిగారి దర్శకత్వంలో నటించాలన్న నా కోర్కె ఇంతకాలానికి నెరవేరింది. నాగేశ్వరరావుగారి సరసన నేను నటించి కూడా చాలా కాలమైంది," అన్నారు లక్ష్మి. జయసుధ, రావు గోపాలరావు, అల్లు రామలింగయ్య, రమాప్రభ, నిర్మల, తక్కిన పాత్రధారులు. వీరరాణి ఎంటర్‌ప్రైజెస్ వారి తొలి చిత్రానికి తొలి షెడ్యూల్ పూర్తయిందని కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, దర్శకత్వం వహిస్తూ సమర్పించే దాసరి నారాయణరావు తెలియజేశారు. చక్రవర్తి, సెల్వరాజ్, భాస్కరరాజు ప్రభృతులు తెరవెనుక కృషి చేస్తున్నారు. "రెండవ షెడ్యూల్ జూలై 20న అన్నపూర్ణ స్టూడియోలో మొదలవుతుంది," అన్నారు నిర్మాత కొడాలి బోసుబాబు.

'సంగీత'లో సుమతి, నారాయణమూర్తి



(గత సంచిక తరువాయి)



[ఇంకా ఉంది]

సినిమా

ఊరుకిచ్చిన మాటలో పట్టణం వైద్యుని మాట

పట్టణంలో డాక్టర్ రామారావు డిస్పెన్సరీ. డాక్టరు ఓ రోగిని పరీక్షిస్తూంటే, పక్క గదిలోంచి డాక్టర్ భార్య గొణుగుడు స్పష్టంగా వినిపిస్తోంది. "ఛస్తున్నాను ఈయనతోటి. కాపరానికి వచ్చి పదేళ్ళయినా — పట్టుమని సంవత్సరానికి పది సినిమాలైనా చూడలేదు. నా బతుకు వంటింటి కుందేల్లా తయారయింది. ఒక సర్దానా—పాడా...పక్కింటివాళ్ళను చూస్తే, ముచ్చటేస్తుంది. చిలకా గోరింకల్లా ఎప్పుడు చూసినా ఏదో ప్రోగ్రామ్‌కు వెళ్తూంటారు. మేమూ ఉన్నాము. ఎందుకు ?"

రోగికి ప్రిస్క్రిప్షన్ రాసిచ్చి పంపించేశాక డాక్టరు స్కూటర్ దగ్గరికి నడిచాడు. అతని భార్య కూడా వస్తూ, "మనం ఎప్పుడు సినిమాకెళ్ళినా ఫస్ట్‌రీల్ అయిపోతుంది. ఈ రోజైనా టయిమ్‌కి వెళ్దామంటే పేషెంట్‌ని పెట్టుకు కూర్చుంటేరి," అని నసుక్కుంటూ స్కూటర్‌పై భర్త వెనుక కూర్చుంది.

"ఇలా వచ్చిన రోగిని కాదంటే, ఇంకొక డాక్టర్ దగ్గరికి పోతాడు. ఏదో మందు రాసిచ్చి మళ్ళీ రమ్మంటే చచ్చినట్టు వస్తాడు. బేరాలు పోగొట్టుకోకూడదే," అంటూ డాక్టర్ స్కూటర్‌ను స్టార్ట్ చేయబోయాడో- లేదో, పక్క పల్లెనుంచి రాముడు (చిరంజీవి) రొప్పుతూ రోజుతూ వచ్చాడు "డాక్టర్‌గారూ, డాక్టర్‌గారూ ! కలరా మారెమ్మ వచ్చి, మా ఊరిని తుడిచిపెట్టేస్తూ ఉంది ఇప్పటికే పది పదిహేనుమంది చచ్చిపోయారు...ఇప్పుడు మా మామ కొడుకు చావుబతుకుల్లో ఉన్నాడు. ఒక్క సారొచ్చి చూడండి, డాక్టర్‌గారూ !"

"ఇప్పుడు రావడానికి వీల్లేదు. ఫామిలీతో సినిమాకి పోతున్నా," అన్నాడు డాక్టరు.

"బాబ్బాబూ, మా మామకి ఒక్కడే మగపిల్లాడు. వాడి ప్రాణాలు కాపాడండి డాక్టర్‌గారూ, మీ పాదాలకి మొక్కుతా," రాముడు ఎంతగానో ప్రాధేయపడ్డాడు.

"ఇప్పుడెలాగయ్యా రావడం ? ఆ కొండల్లో కోనల్లో ఏడు మైళ్ళు నడవాలి. చుట్టూ తిరిగి రావాలంటే డెబ్బయ్ మైళ్ళు. రేపొస్తాలే!"

"రేపటి దాకా వాడి ప్రాణాలు ఉంటయ్యో, ఉండవో !"

డాక్టర్ భార్య విసుగుతో "అంత పోయే ప్రాణాన్ని పట్టుకుంటే ఆగుతుందా ? పదండి," అంది భర్త వీపుమీద తట్టి అతగాడు స్టార్ట్‌చేసి, రివ్వున పోనిచ్చాడు.

రాముడు స్థాణువులా నిలుచుండిపోయాడు

ఎం. బాలయ్య బి.ఇ. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తూ సమర్పించే అమృతా ఫిలిమ్స్ "ఊరుకిచ్చిన మాట" చిత్రానికి అలవర్తి సూర్యనారాయణ, మన్నవ వెంకట్రావు నిర్మాతలు



'రామాపురంలో సీత'లో సుజాత



'అంతం కాదిది ఆరంభం'లో విజయనిర్మల, కృష్ణ



'అత్తగారి పెత్తనం'లో ఒక దృశ్యం

సినిమా

కలియుగ రాముడులో కల్యాణ రాముడు

పెళ్ళి చూపులకు అల్లుణ్ణి (రామలింగయ్య)ను తీసుకొని పెళ్ళికూతురింటికి వచ్చింది అవ్వ(నిర్మల). కాబోయే బావమరిది (సారథి) "చూడండి, బావగారూ! మా అక్కని చూడాలి. కాస్త ముదిరినా — వచ్చగా గుమ్మడికాయలా ఉంటుంది. అదుగో — " అంటూండగానే పెళ్ళికూతురు (జయవిజయ)ని అక్కడికి తల్లి తీసుకొచ్చింది. పెళ్ళికూతుర్ని చూడగానే అల్లుని గుండెల్లో రాయి పడింది.

"అలా కూచోమ్మా. పిల్లకెన్నో ఏడమ్మా?" అడిగింది అవ్వ.

"ఎన్నో ఎక్కడివండీ? ముచ్చటగా ముప్ఫైమూడు. చిన్నపిల్లే. పద్దెనిమిదవ ఏట ఒక నెల కనపడకుండాపోయింది. లోకం ఎన్నో రకాలుగా అనుకుంది. మా చెల్లెలిగారింట్లో ఉంటే తీసుకొచ్చాం," అంది తల్లి.

అల్లుడు సమర్థిస్తూ, "దాన్దేముంది లెండి. నా గురించి కూడా రకరకాలుగా అనుకుంటూంటారు ... సంగీతం వచ్చా? వీణా గ్రటా వాయిస్తుందా?" అన్నాడు.

బావమరిది జవాబిచ్చాడు : "అవేం చేతకావు. క్లారినెట్ మాత్రం బ్రహ్మాండంగా వాయిస్తుంది," అంటూ వెళ్ళి క్లారినెట్ తెచ్చాడు. పెళ్ళికూతురు ఒక్క నిమిషం అందరి చెవులు చిల్లులు పడేలా వాయించింది.

"ఓసి నీ నోట్లో బెల్లం ముక్క పెట్టా! ఎంత బాగా వాయించావే!" అవ్వ మెచ్చుకుంది.

"అదేం తాళం?" అని అల్లుడు అడిగితే, "గ్రాడేజ్," అని సమాధానమిచ్చింది పెళ్ళికూతురు. "ఛ ఛా! కాదు; ఆది తాళం," అని సర్దాడు బావమరిది.

"శనివారంనాడు ఆది తాళమేమిటి? నా బొంద. శని తాళం వాయించక," విసుక్కున్నాడు అల్లుడు. "పిల్ల నచ్చిందా, బాబూ?" అని తల్లి అడిగేసరికి "నా దేముందండీ. మా అవ్వకు నచ్చింది. ఏదో నన్నొక అమ్మ చేతుల్లో పెట్టాలని మా అవ్వ అనుకున్నందుకు నన్ని సబ్బులక్ష్మి చేతుల్లో పెడుతున్నారు," అన్నాడు అల్లుడు.

"సబ్బుకాదు, బావగారూ, సుబ్బులక్ష్మి," అంటూ సవరించాడు బావమరిది.

"ఒరే, చవటా! ఇంకానయం — గబ్బులక్ష్మి అన్నావు కాదు," అంది అవ్వ.

"ఓ కే ... ఒకే ... ఇంతకీ, నాకు తొందరెందుకంటే, దానికి పెళ్ళయితే కాని, నాక్కాదు. అదెలాగని అడగరేం? దానికి పుట్టిన కూతుర్ని నేను చేసుకోవాలి," అన్నాడు బావమరిది.

"ఇంపాసిబుల్...కష్టం. కొడుకు పుడ్తాడని నా నమ్మకం," అన్నాడు అల్లుడు సగర్వంగా.

ఎన్. టి. ఆర్.తో కె. బాపయ్య దర్శకత్వంలో డాక్టర్ డి. వి. ఎస్. రాజు సమర్పించే తిరుపతి ప్రొడక్షన్స్ "కలియుగ రాముడు" భారీ చిత్రానికి దొట్ల శ్రీరంగరాజు నిర్మాత.

అంతం కాదిది ఆరంభం తమిళ, హిందీ భాషల్లో

సంచలనం కలిగించిన 'అంత' కన్నడ చిత్రం ఆధారంగా శ్రీ విజయకృష్ణా మూవీస్ తెలుగులో నిర్మిస్తున్న "అంతం కాదిది ఆరంభం" చిత్రాన్ని కృష్ణ సమర్పణలో పద్మాలయ సంస్థ తమిళ, హిందీ భాషల్లో తయారుచేస్తుంది. తమిళంలో శివాజీగణేశన్, సుజాత, హిందీలో జితేంద్ర, హేమమాలిని, పర్వీన్‌బాబీ వగైరా తారాగణం జి. హనుమంతరావు నిర్వహణలో జి. ఆదిశేషగిరిరావు నిర్మాత.

ఎన్. టి. ఆర్., దాసరి చిత్రం

"నవంబర్ నుంచి వచ్చే జనవరి వరకు ప్రతి నెలా 1-10 తేదీల మధ్య షూటింగ్ ఉంటుంది," అన్నారు దాసరి. ఈయన రచన, దర్శకత్వంలో చిన్నికృష్ణా సినీ ఎంటర్‌ప్రైసెస్ పతాకంలో జి.సి. కృష్ణంరాజు నిర్మించే చిత్రంలో ఎన్. టి. ఆర్ సరసన శ్రీదేవి నాయిక.

'మినిష్టర్ మహాలక్ష్మి'లో విజయలక్ష్మి, చిట్టిబాబు



'కార్టూనిస్టులకు సూచనలు!'

- ★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి
- ★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.
- ★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!
- ★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగా వుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.
- ★ సొంత చిరునామా గల తపాలా బిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడం జరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.
- ★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.
- ★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.
- ★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.
- ★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులంటించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

– సం॥



నాకు ప్రమోషనంటూ రాకపోతే జీవితంలో ఢిల్లీ మొహం ఎలా వుంటుందో తెలిసుండేది కాదు. ఢిల్లీ వెళ్ళకపోతే కృష్ణమూర్తి ఆ వూళ్ళో వున్నట్టే తెలిసేదికాదు.

కృష్ణమూర్తి చరిత్ర పుటల్లో, గోడపటాల్లో నిలిచిపోయే మహామనిషేం కాదు. మహానుభావుడంతకంటే కాదు. బంతి లాంటివాడు. మామూలు బంతికీ వాడికీ ఓ తేడా వుంది. మామూలు పిల్లలాడుకునే బంతిని పదే పదే పైకి తంతుండాలి. వీడితో ఆ బాధలేదు. ఒక్క వూపుకే పైకిలేస్తాడు. ఆ తరువాత చచ్చినా కిందపడడు.

నన్ను ఢిల్లీ విసిరిపారేసినప్పుడు, నా చిరకాల మిత్రుడు కృష్ణమూర్తి దర్శనమిస్తాడనుకోలేదు.

ఉత్తరభారతం చూడ్డం ఇదే మొదలు. కాని ఆ ఆనందమేమీలేదు. రైలు వెళ్ళున్నంతసేపూ దిగులు దిగులుగా ఏడ్చాను. అక్కడకు వెళ్ళిన తరువాత ఆ ఏడుపు మరీ ఎక్కువైంది. అక్కడి తిండి సరకులు కొయ్యముక్కల్లాగా గొంతుకు అడ్డుపడుతూ నూనె లేని పుల్కాలు—భయమేసింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. రెండు రోజులకోసారి భోజనం. ఎవరో చెప్పాగా, 'శ్రమ శక్తి భవన్' క్యాంటీన్‌లో "సౌత్ ఇండియన్ ఫుడ్" దొరుకుతుందని వెళ్ళాను. అనుకున్నంత అధ్వాన్నంగా లేదు. కాస్త నయమే. భోజనం కానిచ్చి బయటికొచ్చి చూస్తే ఎదురుగా పెద్ద తిరణాల. సలువు జెండాల విహారం. పెద్దగా అరుపులు.

"...సో, సోదర సోదరీమణులారా! మరచిపోకండి. వీరనారి ఝాన్సీ, రుద్రమలు పుట్టిన దేశమిది. కస్తూర్బాగాంధీ, కనపర్తి వరలక్ష్మమ్మలు గురించి వేరే చెప్పనక్కరలేదు మీకు. సీతా మహాసాధ్వి పుట్టిన పుణ్యభూమి మనది. మనకు తొలి గురువు తల్లే కదా! తల్లిని మించిన దైవం వేరే లేదుకదా! కార్యేషు దాసి, కరణేషు మంత్రి, శయనేషు రంభ అని ప్రాచీన కావ్యాలు ఘోషిస్తున్నాయి. స్త్రీశక్తి మహాశక్తి. స్త్రీ ఆదిశక్తి. ఆడది ఏ ఇంట కన్నీరుపెడితే ఆ ఇంటికి కీడు. ఆ ఇంట అశుభం. ఆ దేశంలో అరాచకం. అందుకే ఆడవాళ్ళను గౌరవించాలి. వాళ్ళమీద అఘాయిత్యాలు జరగకుండా చూడాలి. కాని జరుగుతున్నదేమిటి? ఓ ఆడమనిషి ప్రధానమంత్రిగా వున్న దేశంలోనే ఆడవాళ్ళమీద అఘాయిత్యాలు, అన్యాయాలు, మానభంగాలు ... సిగ్గు ... సిగ్గు ...

పూర్తిగా రక్షణలేకుండా పోయింది.

కాబట్టి మహాజనులారా! స్త్రీ శక్తి సమీకరించండి. మహా ఉద్యమం నడపండి 'ఎట్రాసిటీస్ ఎగెనెస్ట్ విమెన్'కు నిరసనగా జరిగే కార్యక్రమాలలో మీరూ భాగస్వాములు కండి ..."

నిలబడి వింటున్నాను.

ఒక్కసారిగా కంకర లారీ దొర్లించినట్టు కరతాళ ధ్వనులు. చాలామంది వున్నారక్కడ ఎవర్నో అడిగితే చెప్పారు — ప్రతిపక్ష పార్టీలన్నీ సంయుక్తంగా అధికార పార్టీకి వ్యతిరేకంగ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయిట.

తలెత్తి చూశాను.

మొహంమీదుగా తెల్ల బ్యానరొకటి వేలాడుతోంది. దానిమీద చాలా పార్టీలున్నాయి. పేర్లకెదురుగా వాటి గుర్తులున్నాయి. గుర్తులున్నాయి కాబట్టే బతికిపోయాం. ఏ గుర్తు ఏ పార్టీదో కనుక్కోగలుగుతున్నాం. మనుషుల్ని బట్టయితే చచ్చేటంత పనయ్యుండేది.

అసక్తిగా వుంది.

అక్కడే నిలబడిపోయాను కాసేపు. ప్రతికూలం వాళ్ళందరూ కావు కావు మంటున్నారు. వేదికమీద ముప్ఫయ్యేళ్ళ ఓ అంగనామణి కూడా వుంది. సన్నగా రివటలా వుంది. జుత్తంతా చిందరవందరగా వుంది. సుతారంగా అప్పుడప్పుడు వాటిని మునివేళ్ళతో వెనక్కి తోసుకుంటోంది. సుస్మితో, సుషమో, బిజిలీయో, లిల్లీయో—అలాంటి పేరే అయ్యుండాలి.

ఆవిడ కూడా మాట్లాడిన తరువాత సభ అయిపోయింది. జనం అంతా అరుచుకుంటూ లేచారు. ఊరు తెలీదు, భాష తెలీదు, ఎవరెవరో తెలీదు. ఇలా అయోమయంగా వూరంతా ఏ పదింటి వరకో తిరిగి రూమ్‌కు చేరటం అలవాటు. ఆటో కోసం వెతుకుతుంటే ఇందాక వేదికమీద 'ఆడవాళ్ళంతా మన ఆడబడుచులే' అని వుపన్యాసం చెప్పిన పెద్దమనిషి, ఆయన పక్కనే కూర్చున్న లోనెక్ ఆడపిల్లా భుజం భుజం రాచుకుంటూ రావటం కనిపించింది. క్షణం ఆగాను. వాళ్ళిద్దరూ తెలుగులో మాట్లాడుకుంటున్నారు. అన్నాళ్ళకి అక్కడ తెలుగు మాట్లాడే మనుషులు కనిపించినందుకు మనస్సు నిజంగా ఆనందపడింది. వాళ్ళ వెనకాలే నేనూ నడిచాను.

'ఇతగాదు కృష్ణమూర్తి కాదు కదా' - అనుమానం వేధిస్తోంది.

లావుగా తెల్లగావున్నాడు. లక్నో లాల్చీవేశాడు. తలలో చాలా భాగం బట్టతల. పెదాల మధ్య సిగరెట్ కాలుతోంది. నోట్లో జరదా నానుతోంది.

'ఈ మనిషెవరబ్బా' అనుకుంటుండగా గిచ్చకాయ రంగు కారొకటి వచ్చి ఆగింది. డ్రైవరొచ్చి తలుపు తెరిచి పట్టుకున్నప్పుడు లోపలికి ఎక్కుతూ, ఎక్కుతూ వెనక్కి చూసి ఆగిపోయాడు. దగ్గరకొచ్చి భుజంమీద చెయ్యి వేసి పలకరించాడు. గొప్ప సర్‌ప్రయిజ్! నేననుకున్నట్టే అయింది. కృష్ణమూర్తే ఇతను. చిన్నప్పుడు ఆముదోట

రోదసిలో 75 రోజులపాటు పరిశోధనలు

సోవియట్ వ్యోమగాములు వ్లాదిమిర్ కొవల్యనోక్, విక్టర్ సావినిఖ్‌లు మే 26 సాయంత్రం గం. 4.39ని. (మాస్కో కాలమానం)లకు 'సల్యూత్-6', 'సయూజ్' వ్యోమ పరిశోధక కేంద్రాల పై తమ కార్యక్రమాలను విజయవంతంగా పరిపూర్తిగావించుకుని భువికి దిగి వచ్చారు.

ముందు నిర్ణయించుకున్న ప్రకారం జజ్కాజ్‌గాన్ నగరానికి తూర్పుగా 125 కిలోమీటర్ల దూరంలో 'సయూజ్-టి-4' వ్యోమనౌక లాండింగ్ మాడ్యూల్ దిగింది.

అక్కడికక్కడ జరిగిన వైద్య పరీక్షలో వ్యోమగాములు వ్యోమ సంభ్రమణ, భూగమన వత్తిళ్లను బాగా తట్టుకోగలిగారని వెల్లడయింది.

కొవల్యనోక్, సావినిఖ్‌లు 1981 మార్చి 12న 'సయూజ్ టి-4' వ్యోమనౌకలో తమ అంతరిక్ష యాత్రను ప్రారంభించారు. మార్చి 13న 'సాల్యుత్-6', 'ప్రోగ్రెస్-12' అంతరిక్ష పరిశోధన సముదాయంతో సంధానం జరిగాక దానిపై తమ పరిశోధనలు సాగించారు.

తమ 75 రోజుల వ్యోమ యాత్రలో 'ప్రోగ్రెస్-12' వ్యోమ సామగ్రి నౌకలోని పరికరాలను దించారు. అవసరమైన వివిధ నిరోధకచర్యలను నిర్వర్తించి, మరింత ఎక్కువ కాలంపాటు ఆ వ్యోమ కేంద్రం పనిచేయడానికి కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అలాగే తమకప్పగించబడిన పరిశోధనలు, ప్రయోగాలు నిర్వహించారు.

వివిధ విజ్ఞానశాస్త్ర శాఖలు, జాతీయార్థిక వ్యవస్థ ప్రయోజనాల దృష్ట్యా భూ భౌతిక పరిశోధనలకు వీరు అధికతర ప్రాధాన్యతనిచ్చారు. ఈ లక్ష్యాన్ని దృష్టియందుంచుకొని వ్యోమగాములు తమ పరిశోధనలు క్రమబద్ధంగా సాగించారు. భూ ఉపరితలాన్ని, మహాసముద్రాలను ఫోటోలు తీశారు.

మంగోలియా, రుమేనియాలకు చెందిన వ్యోమగాములు వ్లాదిమిర్ కొవల్యనోక్, విక్టర్ సావినిఖ్‌లతో కలసి 'సల్యూత్-6', 'సయూజ్'ల పై 'ఇంటర్ కాస్మాస్' సహకార కార్యక్రమం కింద పనిచేశారు.

'సాల్యూత్-6'పై ఐదు ప్రధాన పరిశోధక కార్యక్రమాలు, 11 ఉప పరిశోధక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. 'సాల్యూత్-6' 1977 సెప్టెంబరు 29న అంతరిక్షంలోకి పంపబడింది. ఇప్పటివరకు 676 రోజులపాటు వ్యోమగాములు ఆ నౌకలో పనిచేశారు. ఆధునికీకృత 'సయూజ్-టి' రవాణానౌకను 'సాల్యూత్-6'తో జరిపిన సంయుక్త వ్యోమయానం సందర్భంగా పరిశోధించడం జరిగింది. మానవ సహిత వ్యోమ కేంద్రాలకు సామగ్రి సరఫరాకై 'ప్రోగ్రెస్' రవాణా నౌకల ప్రయోగం సమర్థవంతమైన సాధనంగా ఉపయోగపడగలదని రుజువయింది. ఈ వ్యోమ కేంద్రంలోని అనేక సంక్లిష్ట వ్యవస్థల రిపేరు ద్వారా అవి పని చేయగల కాలాన్ని బాగా పెంచడం జరిగింది. తద్వారా 'సాల్యూత్-6' క్రియాశీలంగా పని చేయగల కాలాన్ని గణనీయంగా పెంపొందించడం జరిగింది.

ఈ కార్యక్రమం సందర్భంగా 34 మానవ సహిత, స్వయం చలిత వ్యోమ నౌకలతో అనుసంధానం, మూడుసార్లు బాహ్య అంతరిక్షంలో తిరుగాడడం జరిగింది.

విడియపడేవాడు, ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. అలాంటిదిప్పుడు బాగా ఒళ్ళు చేశాడు. మార్వాడీ సేట్‌లా వున్నాడు. రాజకీయాల్లో తిరుగుతున్నాడు. ఉపన్యాసాలు దంచుతున్నాడు.

నోట మాట రావటంలేదు నాకు. లాక్కుపోయి కారులో కూర్చోబెట్టాడు. 'మొదట మా ఆదిశక్తి పరిచయం — పేరు క్రిస్టియానా — ఊరు పెనమలూరు. కరోల్‌బాగ్‌లో కాపురం. నేనిక్కడ మద్రాస్ బాబు కింద లెక్క. నేనేమిటి — నువ్విక్కడ నాలుగు రోజులుంటే నువ్వూ అంతే...'

క్రిస్టియానా ఎరుపు రంగు పెద్దాల్ని కర్చీఫ్‌తో అద్దుకుంది. తరువాత కారు కదిలింది.

కృష్ణమూర్తి రూపురేఖలే మారిపోయాయి. మాటలు నేర్చాడు. డబ్బుకూడా నిలవేసినట్టున్నాడు. దండుకుండలా వున్నాడు.

'ఇక్కడ ఎన్ని రోజులుండబోతున్నావ్.'

'మళ్ళీ సర్కారు వారికి దయ కలిగేటంత వరకూ.'

'అదేమిటి? ప్రస్తుతం కొలువు ఈ వూళ్ళోనా' ఆశ్చర్యంగా అడిగాడు.

అవునన్నాను. తరువాత ఎక్కడ ఉద్యోగం చేస్తోందీ, ఎంతిస్తోందీ అన్నీ చెప్పాను.

చిన్న జర్కుతో కారు ఆగింది.

ముందు క్రిస్టియానా దిగింది. దిగుతూనే నన్ను లోపలికి ఆహ్వానించింది. ముఖమంతా నవ్వు పూసుకుని 'రావోయ్' అన్నాడు కృష్ణమూర్తి.

ఇల్లు కాదది.

మహారాజ ప్రాసాదం.

రెడ్ కార్పెట్లు పరిచున్నాయి గదులనిండా.

కనకమహాలక్ష్మి

ఎరుపు, తెలుపు ఫోన్లూ, ఇంటర్‌కమ్ కనెక్షన్లూ ఎక్కడబడితే అక్కడ.

తేరుకోలేదు నేను.

'ఢిల్లీ రావటం ఇదే మొదటిసారా.'

అవునన్నాను.

తరువాత పది నిముషాలకి భోజనాలు సిద్ధమయ్యాయి. భోజనాల తరువాత ఇద్దరం గతం పేర్చిన నీటి అద్దంలో... మా వూరి జిల్లా పరిషత్ హైస్కూలూ, కొమ్మమూరు లాకుల్లో బల్లకట్టూ, పసుపుకొట్లకు అవతల రైలు పట్టాలూ, కృష్ణుడి చేపల వేట - ఈతలో నా పరాజయం — మసకబారిన ప్రతిబింబాలు ఎన్నెన్నో చూసుకుంటూ రాత్రి ఒంటిగంట వరకూ గడిపాం.

ఆ తరువాత చాలాసార్లు కలిసాం. క్రమంగా ఢిల్లీ జీవితంమీద అసహ్యమూ, భయమూ తగ్గి అనుబంధం పెరిగింది నాకు. ఒక శనివారం ఆగ్రా వెళ్ళాం. మాతోపాటు క్రిస్టియానా కూడా వచ్చింది

తాజ్‌మహల్ వెన్నెల్లో చాలా ఫోటోలు దిగాం. వాళ్ళిద్దరికీ సెపరేట్‌గా కలర్ ఫోటోలు తీశాను నేను. మరో ఆదివారం చండీఘడ్ వెళ్ళాం. ఢిల్లీలో సరేసరి. కుతుబ్‌మినార్, జంతర్ మంతర్, టలక్ టోరా గార్డెన్స్, బుద్ధ జయంతి పార్క్, నాయర్ మైస్, పార్లమెంట్ హవుస్, తాజ్ మేరియా, అశోకా — అన్నీ కలిసే గిరగిర తిరిగేశాం.

మహా ఆనందంగా వుంది. ఆ ఆనందం తట్టుకోలేక అన్నాను — 'మొత్తానికీ గొప్పవాడివయ్యావురా కృష్ణమూర్తీ' అని.

నవ్వాడు.

నవ్వి — 'గొప్పకాదు, నీ మొహం కాదు తెగింపు. దట్సాల్' అన్నాడు.

అర్థం కాలేదు.

'తెగింపేమిటి ?'

'అవున్రా ... కష్టపడితే వచ్చేదేముంది కబుర్లు చెప్పాలికానీ ! ఎవర్నయినా, ఎలాంటి పరిస్థితినైనా డబ్బుగా మార్చుకోగల రాజకీయ పాఠాలు నేర్చుకోవాలి అంతేగానీ ఈ ఎమ్మేల, ఎం.కాం.లు ఎందుకు ? అసలీ బోడి వుద్యోగా ఎవరికి కావాలి ? ...'

నిశ్శబ్దంగా వింటున్నాను నేను.


'— చదువుకుంటే పైకొచ్చి నువ్వే నాలుగు రాళ్ళు సంపాదించుకుని సుఖపడతావ్ అని చిన్నప్పుడు అమ్మ సూక్తులు చెప్పింది. అదంతా పచ్చి అబద్ధం. ఒట్టి ట్రాష్. చదువుకి, పైకి రావటానికి సంబంధం లేదసలు. బీ.కాం. ప్యాసైన తరువాత నాలుగేళ్ళు గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నాను. ఎక్కడా ఉద్యోగం రాలేదు. ఎవరూ ఆశ్రయమివ్వలేదు. పిల్చి కనీసం నీ కష్టమేమిటని అడగలేదు ఎవరూ. కాని ఇప్పుడు చూడు ...'

చిన్నగా నవ్వి, ఆ నవ్వును మీసాల మధ్యనే వుంచేసుకున్నాడు కృష్ణమూర్తి.

'— మనది నెంబర్ వన్ డెమోక్రసీ. అంటే సంపూర్ణ, ప్రజాస్వామ్య, సామ్యవాద గణతంత్ర రాజ్యం. మనదేశంలో ఎంచక్కా ప్రజలే ప్రభువులు. నిజానికి పాపం వారు ప్రభువులు కాదు ప్రజా సేవకులు. అలాగే వారి సేవల్ని అందిపుచ్చుకోటానికీ, అడపా దడపా సమీక్షించటానికీ, రభసలూ, రాద్ధాంతాలూ చేయటానికీ మరి కొంతమంది


మనోహరమైన
సరికొత్త రూపంలో...
POND'S VANISHING CREAM
పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్
ఇప్పుడు
20 గ్రాం. 40 గ్రాముల
ట్యూబ్‌లలో పాండ్స్
వ్యానిషింగ్ క్రీమ్ *
HTM-PIL-2474
బయటకు నన్నగా కనిపిస్తే లోపల తక్కువ క్రీమ్ వున్నట్లు అర్థంకాదు. 70 గ్రాం, 40 గ్రాం. 20 గ్రాం సైజ్‌లలో జాడీలు వస్తున్నాయి. అందమైన అట్టపెట్టెలో వస్తున్న ఈ జాడీలు విరగవు మరియు తేలికయినవి.
మీ చర్మాన్ని ఎప్పుడు మృదువుగానూ, నున్నగానూ, తాజాగాను వుంచేటట్లు పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ అందించే వాగ్దానం. అది ఎప్పుడు కాపాడుతున్నది.
* కొన్ని ప్రదేశాలలో మాత్రమే లభిస్తుంది.
పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్

నాటికీ నేటికీ మార్పులేని నౌపడా-గుణుపూర్ రైలు మార్గం



వర్షానికి ఆగిపోయిన రైలింజన్

దాదాపు 80 సంవత్సరాల క్రితం అప్పటి ఈస్టిండియా కంపెనీ వారి సహకారంతో పర్లాకిమిడి మాజీ సంస్థానాధీశుడు స్వంతంగా నిర్మించిన రైలు మార్గం నౌపడా–గుణుపూర్ లైను.

పట్టాల మధ్య ముప్పాతిక మీటరు వెడల్పు, పట్టా పైభాగం 1¼ అంగుళాల మందం కల ఈ న్యారో గేజ్ రైలు మార్గం పొడవు 50 మైళ్ళు. ప్రారంభంలో నౌపడా నుంచి పర్లాకిమిడి వరకూ వేసి తరువాత గుణుపూర్ దాకా పొడిగించారు. ఆ రోజుల్లో ఈ రైలు యింజను కర్ర బొగ్గుతో నడిచేది. నిర్వహణ ఖర్చులు పెరిగిపోవడంతో ఈ రైలు మార్గాన్ని సుమారు 60 సం.ల క్రితమే అప్పటి బెంగాల్ నాగపూర్ రైల్వేకి అప్పగించారు. దరిమిలా రైల్వే అథారిటీ క్రిందకి వచ్చింది.

80 ఏళ్లనాటి ఇంజన్!

ఇప్పుడు ఈ మార్గంలో గూడ్సు, పాసింజరు, మెయిల్ సర్వీసులు నడుస్తున్నాయి. తూర్పు కనుమలగుండా, ఆంధ్ర ఒరిస్సా రాష్ట్రాలలోని అడవుల్లోనుంచి, మిట్టపల్లాలతో కూడిన పర్రభూములగుండా సుమారు 6 గంటల ప్రయాణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. మొట్టమొదట తయారుచేసిన రైలింజను ఈనాటికీ పని చేస్తూనే ఉంది.

పది రైల్వే స్టేషన్‌లు, నాలుగు లెవెల్ క్రాసింగులు గల ఈ మార్గంలో 120 మంది గాంగ్ కూలీలు పని చేస్తున్నారు. మూడు స్టేషన్‌లలో స్టేషన్ మాస్టర్లున్నారు. మిగతా వాటిని సిగ్నలర్లే నిర్వహిస్తున్నారు. ముగ్గురు సూపర్వయిజర్లు ఈ రైలు మార్గాన్ని పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం రెండు రైళ్ళ మాత్రమే నడుస్తున్నాయి.

వర్షం వచ్చినప్పుడు యింజను తేలిపోకుండా రైలు మార్గంపై యిసుక పోస్తుంటారు.

ఆదివాసులకి ఆశాజ్యోతి!

ఈ రైలు మార్గంపై డీసెల్ యింజనుతో రైలు బండిని నడపటానికి వీలుగా పునర్నిర్మించడానికి ప్రణాళికలు తయారుచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మార్గంపై ఆంధ్ర ఒరిస్సా రాష్ట్రాల మధ్య సరకుల రవాణాకి ఎంతో అవకాశం ఉంది. అంతేకాక గుణుపూర్ ప్రక్కనున్న వంశధారపై వంతెనని నిర్మించి ఈ రైలు మార్గాన్ని రాయగడ వరకు పొడిగిస్తే నౌపడా నుంచి రాయగడకు డీసెలు యింజన్‌తో కేవలం మూడు గంటల్లో చేరవచ్చు. దీనివల్ల బోలెడంత సమయం, ఖర్చు కలిసిరావటమే కాకుండా గంజాం, శ్రీకాకుళం జిల్లాల ప్రజలు మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకి సులభంగా చేరుకోవచ్చు. ఇది వ్యాపారాభివృద్ధికీ, విభిన్న ప్రాంతాల సాంప్రదాయాలు, సంస్కృతుల కలయికకు దోహదం చేస్తుంది. ఆదివాసుల పాలిట ఆశాజ్యోతి అవుతుంది.

ఎన్నో కొత్త రైలు మార్గాల నిర్మాణాన్ని చేపడుతున్న ఈ దశలో ఈ చిన్న రైలు మార్గాన్ని అతి తక్కువ వ్యయంతో పునర్నిర్మించడం, పొడిగించడం ద్వారా అట్టడుగు వర్గాల ప్రజలకు, ఆదివాసులకు ఎంతో మేలు కల్గించ వీలవుతుంది కాబట్టి రైల్వే బోర్డువారు, కేంద్ర ప్రభుత్వం ఈ రైలు మార్గం పునర్నిర్మాణాన్ని, అభివృద్ధిని సత్వరం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందనటంలో అతిశయోక్తి లేదు.

– ఆర్. పద్మనాభరావు

కనకమహాలక్ష్మి

వుంటారు. వీరు కూడా ప్రజా ప్రతినిధులే. కాని వీళ్ళని ప్రతిపక్షం అంటారు. ప్రతిపక్షమంటూ లేకపోతే ప్రజాస్వామ్యం మనుగడే దెబ్బతింటుందని మన ప్రగాఢ విశ్వాసం. గోల చేయటం వాళ్ళపని. వాళ్ళకు కావల్సిన సాధన సంపత్తిని' సమకూర్చటం మన పని ...'

ఫోన్ మోగింది.

లేచివెళ్ళి అందుకున్నాడు.

ఇవతల కృష్ణమూర్తి మాట్లాడుతున్న దాన్నిబట్టి అవతల వాళ్ళెవరైందీ, ఏమడుగుతోందీ, సునాయాసంగా కనుక్కోవచ్చు.

'కోతల సీజను. అంతమంది దొరక్కపోవచ్చు. దొరికినా రేట్లు జాస్తీగా వుంటాయి. రోజుకు ఆడవాళ్ళకు పది, మగవాళ్ళకు పదిహేనూ...'

ఫోన్ పెట్టేసిన తరువాత అడిగాను ఏమిటని.

'వచ్చేవారం కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ధరల పెరుగుదలకు నిరసనగా ఆందోళనలు జరపాలట. ఉన్నఫళాన జనం కావాలంటారు. హఠాత్తుగా ఎలా వీలవుతుంది.'

ఆ తరువాత చాల చాల చెప్పుకొచ్చాడు. ఏ ఏ వ్యాపారాలు చేస్తోందీ ఏమిటీ అన్నీ. క్రిస్టియానా కూడా తనకు అన్ని విధాలా సహకరిస్తోందిట.

'కాస్త కూస్త చదువుకున్న పిల్ల గాబట్టి బతికిపోయాను. బాగా సోషల్‌గా మూవ్ అవుతుంది. ఒక్కసారి పరిచయం అయితే చాలు ఆ కాంటాక్ట్సని కల్టివేట్ చేసుకుని చెప్పకుండానే రెన్యూ చేస్తూ వుంటుంది ఎప్పటికప్పుడు. నేను నా వ్యాపారం పనుల మీద ఎక్కడికైనా వెళ్తే నా యాబ్సెన్స్‌లో పాపం అన్నీ తనే సర్దుకుపోతుంది. ఆఫీసుల్లో అధికార్లను, అపోజిషన్ పార్టీ వాళ్ళనూ అందర్నీ స్వయంగా తనే కలుసుకుంటుంది. ఐయామ్ రియల్లీ ప్రౌడ్ ఆఫ్ హర్. నేను సాధించలేని విజయాలను కూడా ఒక్కోసారి ఆవిడ సునాయాసంగా సాధించుకొస్తుంది...'

'ఏమో, ఎన్నయినా చెప్పు. మీ ఆవిడ్నలా తిప్పటం నాకేమీ నచ్చలేదు.'

'ఎవరా ఆవిడ'

'మీ ఆవిడే – క్రిస్టియానా.'

పెద్దగా నవ్వాడు. నవ్వి – ''నేనావిడకు మొగుణ్నికాదు, ఆవిడ నా భార్యాకాదు. మేమిద్దరూ అసలు మొగుడూ పెళ్ళాలమేకాదు. చెడిపోయి ఎక్కడో దిక్కుమాలిన కంపెనీలో రోగాలతో అఘోరిస్తుంటే పోనీ కదా అని నా ఇంటికి తీసుకొచ్చాను. నాకు చేదోడు వాదోడుగా వుండమన్నాను. నాలుగేళ్ళయింది. అప్పటి నుంచీ నా దగ్గరే వుంటోంది. అందుకని చాలామందిలో ఆవిడకు నా భార్యగానే గుర్తింపు. పోన్లే సరేకదా అని నేనూ వూరుకున్నాను.

ఎందుకో తెలుసా –

''ఎవరో ఆడపిల్లను అనుభవిస్తున్నాం అన్న ఆనందం కన్నా ఎదుటివాడి పెళ్ళాన్ని అనుభవిస్తున్నామన్న ఆనందం'' వేరు. ఆ థ్రిల్ వేరు. ఆ మజాలో ఎంత పనైనా చేసేస్తావ్. ఎదుటివాడి సొత్తును అమాంతం అప్పనంగా అనుభవించేస్తున్నామన్న మైకంలో నువ్వు చెయ్యందేమిటి?

ఈ మేడ, ఈ ఇంటర్‌కమ్‌లు, ఇంపాలా కార్లు, యూఫోమ్ బెడ్‌లు, అల్సేషియన్ కుక్కలు, క్రోటన్ మొక్కలూ అన్నీ ఆ 'కనకమహాలక్ష్మి' పుణ్యం ...''

'మధ్యలో ఆవిడెవరు?'

'అదే... పేరు మార్చుకుందిలే క్రిస్టియాన.'

★

అరుణ కోరిక

ఎల్లకోటి ఓబయ్య



అరుణ రేడియో ఆఫ్ చేసింది.

'ముద్దబంతి పూవులో' అంటున్న ఘంటసాల గొంతు హఠాత్తుగా ఆగిపోయింది.

'ఎంత మంచి మూడ్ పాడుచేశావు. నీకేం పిచ్చెక్కిందా ?' అన్నాను కుర్చీలో కూర్చునే.

'సైలెన్స్' అంటూ చూపుడువేలిని పెదాలపై వుంచి వరండావేపు చూడమని అరుణ సైగ చేసింది.

అప్పుడు తెలిసింది నాకు ఎదురింటి సుశీల కొన్న రేడియోగ్రామ్‌లో అదే పాట మరింత శ్రావ్యంగా వస్తోందని.

'మీరు కోరిన పాటలు' అయిపోయినట్లు రేడియోగ్రామ్ ప్రకటించింది.

కుర్చీలో కూర్చొన్న అరుణ 'ఏమండీ' అంది.

వాలకం చూస్తే ఏదో వరమడిగేట్టే వుంది. ఆమె కళ్ళలోకి సూటిగా, దిరాగ్గా చూశాను.

'మీ ఆఫీసులో పనిచేసే ఎల్. డి. సీ సుశీల రేడియోగ్రామ్ కొన్నదంటే ఆఫీసు మేనేజరీ చేస్తున్న మనమెందుకు కొనకూడదూ' అంది అరుణ ధీమాగా.

'ఫిక్సేషన్, ఎరియర్స్ రాగానే కొందాం. ఇప్పుడే ఏం తొందరొచ్చింది. అన్నట్టు ఇవాళ పది గంటలకు రామూ పెళ్ళి కదా. ఎనిమిది దాటుతోంది. తొందరగా బేబి, బాబును ముస్తాబుచేసి చీరె మార్చుకో. వెళదాం. మనవాళ్ళంతా ఎదురు చూస్తుంటారు.' అన్నాను కనీసం టాపిక్కయినా మారుతుందని.

మేము కళ్యాణ మంటపం చేరేసరికే మిత్రుడు రామూ పెళ్ళిపీటలమీద కూర్చొన్నాడు. ఫ్యామిలీస్‌కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జాగాలో మేము కూర్చొన్నాము.

'ఏమండీ పెళ్ళికూతురి వెనుక నిల్చొన్న మీ వదినగారిని చూశారా' అంది అరుణ.

అవునన్నట్లు తల వూపాను.

'ఆమెను కాదండీ, ఆమె మెడలోని నెక్లెస్ చూశారా అంటున్నా. ఎంత బావుంది. అలాంటి నెక్లెస్ నా కొకటి కొనిపెట్టకూడదూ' అంది అరుణ వినయంగా.

వినయంగా వరాలు అడగడం సవినయంగా వాటిని పుచ్చుకోవడం ఆమె అలవాటు. అడిగిన కోర్కె తీర్చకపోతే వదిలే స్వభావం ఆమెకులేదు.

'ఎరియర్స్ రానీ తెచ్చిపెడతాను' అన్నాను.

ఇకమీదట అరుణను పెళ్ళిళ్ళకు తీసుకెళ్ళే బుద్ధి తక్కువ పని చేయకూడదనుకొన్నాను.

మంగళసూత్ర ధారణ జరిగిపోయింది.

భోజనాలు ప్రారంభమయ్యాయి.

భోంచేసి అయినవారికీ, కాని వారికీ హాయ్, హాయ్ చెపుతూ పెళ్ళికొడుకు రామూకు గుడ్‌బై చెప్పి మా కుటుంబం నలుగురం రోడ్డునపడ్డాం.

అది గాంధీ రోడ్డు. ఇరువైపులా బ్రాందీ షాపులు. గాంధేయులు, బ్రాందేయులు ఖద్దరు దుస్తులతో దర్శన మిస్తున్నారు. మా బాబు, ఎనిమిదేళ్ళ కుర్రవాడు ముందు నడుస్తున్నాడు. నాలుగేళ్ళ బేబి నా వ్రేలు పట్టుకొని నడుస్తోంది.

పిల్లల సంగతి పట్టించుకోకుండా బట్టల దుకాణాలకేసి చూస్తూ నడుస్తోంది అరుణ.

సంఘం డ్రెసెస్ బోర్డు కనబడ్డంతోటే కన్ను కుట్టింది మా శ్రీమతికి. అలా జరుగుతుందని నాకు తెలుసు.

పదో, పాతికో తగలేసి ఆడాళ్ళనే బజారుకు పంపితే అదో దారి. కాని ప్రక్కన భర్తవుంటే మొత్తం బజారే కొనాలనిపిస్తుంది స్త్రీలకు. ఇక అరుణ కూడా అలాంటి ఆడదే, ఆమెకేం తక్కువ.

'ఏమండీ! సంఘం డ్రెసెస్‌లోకెళ్ళి మన బేబీ కొక ఫ్రాక్ కొందామా' అంది అరుణ.

'ఎరియర్స్ రానీ' అన్నాను.

'ఏమిటండీ మీరు ప్రతి చిన్నదానికీ ఎరియర్స్‌తో ముడిపెడతారు. ఫ్రాక్ కొనడానికి వందలూ, వేలూ కావాలా' అంది అరుణ చులకనగా.

నాకు మనస్కరించకపోయినా క్లాత్‌షాపులోకి వెళ్ళక తప్పలేదు. అరుణ సెలెక్ట్ చేసిన ఫ్రాక్ ఖరీదు ఎనిమిది పదులని నాకు బిల్లిచ్చినపుడే తెలిసింది.

అదరిపడ్డాను.

'మన మరియదె ప్రాణమైన మగడెట్లయినన్' అన్న తిమ్మనార్యుని పారిజాతాపహరణ పద్య చరణాన్ని గుర్తు చేసుకొంటూ ఫ్రాక్ వద్దంటే అరుణ కోపపడుతుందని పర్సు తీసి ఎనిమిది పదులు కౌంటర్లో సమర్పించి ఫ్రాక్ పేక్ చేయించుకొని రోడ్డుమీది కొచ్చాము.

హారన్ కొడ్తూ దూసుకుపోయేలా ముందు వచ్చే కారుని చూసి పిల్లలిద్దర్నీ పేవ్‌మెంటుమీదికి అప్రయత్నంగా నడిపించి 'హమ్మయ్య' అనుకొన్నాను.

వచ్చిన కారు కీచుమంటూ ఆనకట్టలో ఆగే ప్రవాహంలా మా ముందరే ఆగిపోయింది.

'హలో బ్రదర్' అన్నమాట విని తలెత్తి కారుకేసి చూశాను. స్టీరింగ్ చేతిలో పట్టుకొని కూర్చొన్న రాజా వెనక మేముండే వీధిలో వుండేవాడు.

'హలో రాజా, హౌ డు యూ డూ' అన్నాను ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ.

'కారెక్కండి. ఇంట్లో దిగబెడ్తాను' అన్నాడు రాజా.

నిజంగా నాకు కారెక్కాలని లేదు.

కారెక్కాలనే కోరిక అరుణకుందని తెలిసి వెనక సీట్లో నలుగురం హుందాగా కూర్చున్నాం.

'ఏం బ్రదర్ కారు కొన్నారా' అడిగాను.

'అవును బ్రదర్, వారం క్రితమే అయిదు వేలు అప్పు చేసి కొన్నాను. నాకు మేనేజర్ ప్రమోషన్ వచ్చినప్పటినుండి కారు కొనాలని మా ఆవిడ ఒకటే గోల చేసింది. శ్రీమతి కోరిందంటే కొనక తప్పుతుందా.'

రాజా మాటలు నా గుండెల్లో సూదుల్లా గ్రుచ్చుకొన్నాయి. అరుణ కసలే ఇతరులతో పోటీపడే స్వభావమెక్కువ. పోనీ కారు కొందామంటే వచ్చే జీతంలో సగం పెట్రోలుకు సరిపోతుంది.' ఈ పరిస్థితినుండి కాపాడమని ఏడుకొండలవాడిని వేడుకొన్నాను.

అయినా ఫలితం శూన్యం.

ఏడుకొండలవాడు ఏ స్త్రీ మనసులోనయినా పరకాయ ప్రవేశం చేయగలడేమో కాని మా అరుణ ఛాయలకైనా రావాలని ప్రయత్నించడు.

అంత మొండి పట్టుదల ఆమెది.

ఆలోచనలలో మునిగి తేలుతూన్న నేను, కారు

మా ఇంటి ముంగిట ఆగటంతో ఈ లోకాని కొచ్చాను. కాని పరధ్యానం పూర్తిగా వదలలేదు.

రాజుకు థాంక్స్ చెప్పి ఇంట్లోకి నడిచాము ఇంటిల్లిపాదీ.

'ఏమండీ' అంది అరుణ వాకిట్లోకి అడుగు పెడుతూ.

'ఇక్కడేం మండీ లేదే. బెల్లమండీ వెనకాలే వెళ్ళింది' అన్నాను పరధ్యానంగా.

'నేనడిగేది మండీ కాదండీ, రాజూ కారు సంగతి. రాజూ భార్య ఎంత అదృష్టవంతురాలండీ. తాను చెప్పగానే రాజు కారు కొనేశాడు. నేను మీకు ఎన్నోసార్లు చెప్పాను. అప్పు చేసయినా కారు కొనండీ అని. మీరు కొన్నారా. నిజం చెప్పాలంటే మీరు నా మాటకు విలువే ఇవ్వరు' అంది అరుణ స్టాండుకు చేతిలోని వేనిటీ బ్యాగ్ తగిలిస్తూ.

'మొత్తం విలువంతా నీకే ఇస్తూంటే, నీ మాట కెక్కడ మిగిలుందే ఇవ్వటానికి' అన్నాను చిలిపిగా చూస్తూ.

పంటితో క్రింది పెదవి నదిమిపట్టి ఓరచూపు చూసి మూతి ముడుచుకొంది అరుణ.

* * *

ఆ వేళ మొదటి తారీఖు. వర్తీ వ్యాపారులు ఉద్యోగుల ఇండ్లు దర్శించే రోజు. సిటీలోని సినిమా హాల్సు హౌస్‌ఫుల్ బోర్డు తప్పకుండా తగిలించుకొనే రోజు. నేను ఆఫీసులో వేల కొలది డబ్బులు బట్వాడా చేసే రోజు. జీతం పుచ్చుకొన్న నా జేబు బరువు ఫీలయి బజారు కెళ్ళమంది. తిన్నగా వెళ్ళి హీరాస్ సిల్క్ ప్యాలెస్‌లో ఒక షిఫాన్ జార్జెట్ చీర కొన్నాను.

అరుణను అలంకరించి కొత్త చీరెలో ఆమె అందం చూడాలనిపించింది.

టాక్సీ ఎక్కాను.

కలల రథం ఎక్కినట్లనిపించింది.

ఇవాళ అరుణ చీరె చూడగానే సంతోష పడుతుంది. రాత్రంతా కబుర్లతో నన్ను గిలిగింతలు పెడుతుంది. నా ఒడిలో పసిపిల్లలా ఒదిగిపోతుంది.

అరుణ కోరిక

టాక్సీ ఆగింది. కలల రథం దిగి యదార్థ లోకాని కొచ్చాను. టాక్సీకి డబ్బులిచ్చి ఇంట్లోకి నడిచాను.

చీరె పేక్ చేసిన కవరు అరుణ చేతికిచ్చి, బాత్‌రూంలో ముఖం కడుక్కొని, అక్కడే కొక్కేనికి తగిలించిన తువ్వాలులో తుడుచుకొంటూ వచ్చి హాల్లోని కుర్చీలో కూర్చున్నాను.

'ఏమండీ' అంది అరుణ— చీరె కవరులోంచి తీసి టేబుల్‌మీద వుంచుతూ.

ఇవాళ నన్ను అమాంతంగా పొగిడేస్తుందను కొన్నాను. 'చీర బావుంది కదా' అన్నాను.

'అది సరే కానీండి. ఇవాళ మధ్యాహ్నం మీ అమ్మగారు మన ఇంటికొచ్చి వెళ్ళారు' అంది అరుణ సంతోషాన్ని వెలిబుచ్చుతూ.

పెళ్ళయి వేరు కాపురం పెట్టిన పదేళ్ళకు మా అమ్మగారికి కరుణ కలిగిందంటే పుత్రుడుగా నేను సంతోషించాను.

'అరుణా ! అమ్మగారు ఏం మాట్లాడారు. మనిల్లు బావుందన్నారా.'

'అబ్బే అదేం కాదండీ. ఇలాంటి ఇల్లు మీరెందుకు కొనకూడదూ' అన్నారు.

'ఎరియర్స్ రానీ' అందామనుకొని గొంతులో వెలక్కాయ పడ్డట్లు ఆగిపోయాను. ఇల్లు కొనడ మంటే మాటలా! అది ఎరియర్స్‌తో సరిపడేది కాదు కాబట్టి మౌనంగా వుండిపోయాను.

మా అమ్మగారికంటే అరుణకే ఇల్లు కొనాలనే కోరిక ఎక్కువగా వుందని నాకు అర్థమయింది.

రాత్రి పదయింది. పాత పత్రిక తిరగేస్తున్న నేను అరుణకేసి చూశాను.

ఆమె మంచంపై ఇద్దరి పిల్లలమధ్యా ఆదమరచి నిదురబోతోంది.

ఆమె ముఖం చంద్రబింబం.

ఆమె కోరికలు చంద్రునిలోని మచ్చలు.

నాలో ఉవ్వెత్తుగా లేస్తున్న ప్రశ్నల పొదలు.

నేను నిజంగా అరుణ కోర్కెలు తీర్చలేని అసమర్థుణ్ణయిపోయాను. ఆమె మనస్తత్వానికి నాకూ రాజీ కుదరడం అసాధ్యం.

విడాకులిచ్చి పీడ విరగడ చేసుకోవడమే సబబు అనిపించింది.

తెల్లవార్లూ ఏవేవో ఆలోచనలు.

తెల్లారింది. నిదురపోని నా కళ్ళు ఎర్రబడ్డాయి లేచి గెడ్డం గీసుకొంటున్నాను.

స్నానం, పూజ ముగించుకొన్న అరుణ కాఫీ తెచ్చి టేబుల్‌మీద పెట్టింది.

'అరుణా' అన్నాను కర్కశంగా. అలా మాట్లాడ్డం నాకదే మొదటిసారి.

అదరిపడిన అరుణ 'ఏమండీ' అంది నాజూగ్గా.

'నీ ప్రవర్తన నాకేం నచ్చడంలేదు. ఎందరితోనో పోటీ పెట్టి నా అసమర్థతను నిరూపించావు. తల్లిదండ్రులను కాదని నిన్ను పెళ్ళి చేసుకొని నేనెంత పొరబాటు చేశానో ఇప్పుడు తెలుస్తోంది. రేడియోగ్రామ్, నెక్లెస్, కారు, స్వంత యిల్లు సంపాదించి పెట్టే తాహత్తు నాకు లేదు. నేను పదుగురితో పోటీ పడలేను. పేదరికంలో పెరిగిన నాకు అల్ట్రామాడర్న్ సుఖాలంటే అసహ్యము.

నీ ఆశయాలు నెరవేర్చలేని భర్తగా నీతో కాపురం చేయడం కంటే విడాకులు తీసుకోవడమే ఉత్తమం. ఇవాళే లాయరు దగ్గరికెళ్దాం' అన్నాను.

అరుణ గలగలా నవ్వింది.

నా ఒంటిమీద పాములు ప్రాకినట్లయింది.

ఆమె అసహ్యించుకొంటుందనుకొన్నాను. కోప పడుతుందనుకొన్నాను. అవేమీ లేకపోగా నవ్వుతూ దగ్గరకొచ్చి నా తల నిమిరింది.

'మీరు పెళ్ళయిన కొత్తలో నెలకు రెండు వందలు సంపాదించేవారు. ఇప్పుడు రెండు వేలు సంపాదిస్తున్నారు. ఒకే గది గల ఇంట్లో ప్రారంభమయిన మన బ్రతుకు బంగళాకు చేరింది.

ఇవన్నీ ఎలా జరిగాయంటారు. మీ హోదా ఎలా పెరిగిందంటారు. నేను మిమ్మలను పోటీలో నిలబెడుతూ వుండబట్టే.

పెద్దలు ఇష్టపడని పెళ్ళి జేసుకొని మనిద్దరం వారికి దూరంగా బ్రతుకుతున్నా, మన హోదా పెరిగి కన్నవారిని దగ్గరకు రప్పిస్తుందని కలలు కన్నాను. ఇల్లూ, కారూ గల గొప్ప వ్యక్తిగా మా నాన్నగారి లాంటి హోదాలో మిమ్మలను చూడాలని మురిసిపోయాను.

'విడాకులిస్తా అరుణా' అని ఎంత ఈజీగా అనగలిగారు.

'పెళ్ళి పవిత్రమైనది. అంతకంటే ప్రేమ పవిత్రమైనది. రెండూ కలిసి పెనవేసిన పవిత్ర బంధం మనది. ఆ బంధాన్నే త్రుంచివేయాలని మీరు నిర్ణయించుకొంటే నేను జీవితంతో పూర్తిగా ఓడిపోయినట్లే. మీ ఇష్ట ప్రకారమే కానీండి. నడవండి లాయరు దగ్గరికి' అంది అరుణ కన్నీళ్ళు రెప్పల చివర్లో నిలుపుతూ.

నా కళ్ళు చెమ్మగిల్లాయి.

మా ఇరువురి బుగ్గలపై కన్నీళ్ళు తుడవ డానికి ప్రయత్నిస్తున్నారు బాబు, బేబీ.

మాటలు ! మాటలు !

ఏది చదివినా, ఎక్కడ విన్నా ఇవేళ
అర్థాల కెన్నడో విడాకులిచ్చి, వట్టి
అనర్థాలై, మీది మీది కురుకుతున్న
మాటలు ! మాటలు ! మాటలు ! మాటలు !

ఐశ్వర్య దుర్మదాంధుల ముత్యాల 'జాలరుల'
బంగారు పల్లకీలై,
అధికార గర్వోన్మత్తుల సముత్తుంగ
బలవత్తురంగమ వాహనాలై
చెంగు చెంగున చెంగలిస్తూ
మున్ముందుకు దూసుకుపోతున్న
మాటలు ! మాటలు ! మాటలు ! మాటలు !

దిక్కూ మొక్కూలేక అల్లల్లాడిపోతున్న
దీనాతి దీనుల కుత్తుక లదిమిపట్టిన
ఉరితాళ్లయి, గాటంగా బిగుసుకుపోతున్న
మాటలు ! మాటలు ! మాటలు ! మాటలు !

ప్రజానీకం బహువిధాల జీవితరంగాలమీద
బూటకాల నాటకాల ఆటలతో, పాటలతో,
విషంతో మేళవించిన విపరీత వ్యామోహ
మద్యపానీయాల హుషారుల నిషాలతో
మత్తెక్కించి మైమరపిస్తున్న
మాటలు ! మాటలు ! మాటలు ! మాటలు !

వీడలయి, ఎడతెగని పీడలయి, చిచ్చుల
పిడుగులయి, మాటిమాటికి అదేపనిగా
నలునైపుల చెలరేగి నర్తిస్తున్న
మాటలు ! మాటలు ! మాటలు ! మాటలు !

— పిలకా గణపతిశాస్త్రి



దుర్యోధనుని దురహంకారం

ధృతరాష్ట్రుడు రాజ్యపాలనాధికారాన్ని దుర్యోధనునికి అప్పగించినందువల్ల సహజంగా దుష్టుడైన ఆ దుర్యోధనుడు దురహంకారుడై, తన కెదురులేదని భావించి, పాండవుల రాజ్యం అన్యాయంగా తీసుకుని వారిని తీరని కష్టాలకు గురిచేశాడు. తాను సమ్మతించిన ప్రకారం వారి వంతు రాజ్యం వారికి ఇయ్యక యుద్ధానికే సిద్ధపడ్డాడు. పెద్దలైన భీష్మ, ద్రోణాదులమాట కూడా చెవిని పెట్టలేదు. శ్రీకృష్ణుని రాయబారానికి ముందే, కౌరవ పాండవులు తమ తమ పక్షాలను బలపరచుకొనుటకు పూనుకొనిరి.

శ్రీకృష్ణుడు యుద్ధంలో తనకు సహాయపడడని దుర్యోధనునికి బాగా తెలుసును. అయినా అడిగి చూద్దామని పాండవులకంటె ముందుగా తానే అతన్ని అభ్యర్థించడానికి శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళాడు. అప్పుడు శ్రీకృష్ణుడు నిద్రపోతూ ఉన్నాడు. దుర్యోధనుడు, తాను మహా రాజాధిరాజుననే భావంతో శ్రీకృష్ణుని తలవైపు ఉన్న ఒక ఉన్నతాసనం పయి కూర్చున్నాడు. శ్రీకృష్ణుడు నిద్ర లేచాక అతనికి తన కోరిక తెలుపవలెనని అతని అభిప్రాయం.

ఇంతలో అర్జునుడు కూడా వచ్చాడు. అతడు శ్రీకృష్ణుని పాదాలవైపు ఉన్న ఒక చిన్న ఆసనం పైని కూర్చుని, శ్రీకృష్ణుడు ఎప్పుడు మేలుకొంటాడో అని ఎదురు చూస్తున్నాడు. కొంచెం సేపటికి శ్రీకృష్ణుడు కన్నులు తెరిచి చూచాడు. అతని దృష్టి తన పాదాలవైపు కూర్చున్న అర్జునుడి మీద ప్రసరించింది. అతడు లేస్తూ "అర్జునా! ఎప్పుడు వచ్చావు? క్షేమమా?" అని కుశల ప్రశ్నవేశాడు. "ఇప్పుడే ఇంతకు ముందు వచ్చా"నని అర్జునుడు అన్నాడు. శ్రీకృష్ణుడు కూర్చున్న తర్వాత దుర్యోధనుణ్ని చూచి "ఎప్పుడు వచ్చావు రాజరాజా!" అని అన్నాడు. "ఈ అర్జునుడికంటె ముందుగానే వచ్చా"నన్నాడు దుర్యోధనుడు. తర్వాత వారివారి వచ్చిన పని తెలుసుకుని "దుర్యోధనా! నువ్వు ముందుగా వచ్చి ఉండవచ్చు నాకు మొదట కనబడింది అర్జునుడు. ఇక నేను ఒకరి పక్షం వస్తాను. మరో పక్షానికి సైన్యం పంపిస్తాను. ఏ పక్షంలో ఉన్నా నేను యుద్ధం చెయ్యను. ఎవరికేది కావాలో కోరుకోండి. చిన్నవాడు మొదట అడగటం ధర్మం" అన్నాడు.

"యుద్ధం చెయ్యని కృష్ణుడు తనకెందుకు? సైన్యం కోరాలని దుర్యోధనుని అభిప్రాయం. అర్జునుడు సైన్యాన్ని కోరుతాడేమో అని దుర్యోధనుడికి దిగులు వేసింది కాని అర్జునుడు శ్రీకృష్ణుణ్నే తమ పక్షానికి కోరాడు. దుర్యోధనుడు లోలోపలే సంతోషిస్తూ సైన్యాన్ని కోరాడు. జనార్దనుడు "సరే" అన్నాడు.

శ్రీకృష్ణుని మహత్తు తెలియక, తానే సర్వ సమర్థుడనని దురహంకారం కల దుర్యోధనుడు- సైన్య సహాయమే గొప్పదని భావించి సర్వనాశనం తెచ్చుకున్నాడు. శ్రీకృష్ణుని సహాయంవల్ల పాండవులు విజయాన్ని సాధింపగలిగారు.

— బులుసు వేంకటరమణయ్య


రైలు పట్టాలు

రైలు పట్టాలు
నిజానికి—
అవి ఎప్పుడూ
దూరమై
రైళ్ళ భారాన్ని
వాటిపై మోపుకొని
ఎందరెందరినో
దగ్గర చేస్తాయి
దూర గమ్యాలకు
చేరుస్తాయి!

— వి. వి. రమణమూర్తి

గోద్రెజ్® స్టోర్‌వెల్®

కొద్దిగా ఎక్కువ ధర అంతే, మరి దానికి బదులుగా ఎన్నెన్నో లాభాలు



ఎక్కువ దృఢమైనది. ఎక్కువ భద్రమైనది.
ఎంచుకునేందుకు ఎక్కువ రకాల్లో. ఎక్కువగా మన్నేది.

ఎక్కువ దృఢమైనది:
విశిష్టమైన స్టీలుతో తయారుచేయబడినది. తుప్పును నిరోధించేది.
స్టీలు అల్మారాలన్నిట్లోకి సర్వోత్తమమైన ఫినిష్.

ఎక్కువ భద్రమైనది:
లాకర్ మరియు దర్వాజాలకి విరగని గోద్రెజ్ తాళం.
పైకి కనిపించని బందులు, దర్వాజాని పైనుంచీ కిందనుంచీ మూసివేయడానికి త్రీ-వే ఇంటర్ లాకింగ్ సాధనం.

ఎంచుకునేందుకు ఎక్కువ రకాల్లో:
పైకీ క్రిందికీ వీలుగా చేసుకోగలిగే షెల్ఫులు. టయ్-బార్, హేంగర్-రాడ్, లాకర్, నిలువుటద్దం. మీ అవసరాలకి అనుగుణమైన తీరుల్లో, కలయికలో,


ఎక్కువగా మన్నేది:
మూడు తరాలదాకా నిలుస్తుంది; బాగా నిలిచి పనిచేసేందుకోసమే తయారుచేయబడినది.

మోడల్స్: స్టోర్‌వెల్ వార్డ్‌రోబ్ (చిత్రించబడినది), కాంపాక్ట్, మైనర్.
ఇప్పుడు గోద్రెజ్ సేఫ్‌మైరా కూడా దొరుకుతోంది.

చిత్ర కరపత్రం కోసం రాయండి:
గోద్రెజ్ & బాయిస్ మాన్యు. కం. ప్ర. లి.
మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్, పిరోజ్‌షా నగర్, బొంబాయి 400 079.

ప్రఖ్యాతి చెందిన వస్తువులు నిర్మించేవారు గోద్రెజ్® Godrej®

ULKA/GBS/1/80 TEL



బకాసురుడి రేషన్ కార్డు

మేనంపాటి భాస్కర్

బకాసురుడికి మళ్ళీ జన్మ ఎత్తాల్సిన టర్న్ వచ్చింది. పరలోకంలోని జనన మరణాల ఆఫీసు వాళ్ళు అతన్ని కేకేసి, "ఇదిగో! కొన్నాళ్ళపాటు మళ్ళీ నువ్వు పుట్టాలోయ్! దేవతగా పుడతావా? లేకపోతే మళ్ళీ రాక్షస జన్మే కావాలా? అదీ కాకపోతే మానవజన్మా? జంతుజన్మా?" అన్నారు ఛాయిస్ ఇస్తూ.

"దేవతలు ఆడంగోళ్ళ! నే నెట్టాగూ రాచ్చసుణ్ణే! అందుకని మడిసిగానే పుడతాను" అన్నాడు బకాసురుడు.

"సరే! ఎప్పుడు పుడతావ్?"

బకాసురుడు సంశయించాడు.

అతను ఎటూ తేల్చుకోలేకపోవటం గమనించి, 'భవిష్యద్దర్శిని' అనే అద్దం దగ్గిరికి తీసుకెళ్ళాడు ఓ గుమాస్తా. అందులో భూత భవిష్యద్వర్తమాన దృశ్యాలు కనబడుతాయి.

"చూడు" అంటూ దాన్ని ఆన్‌చేశారు, దృశ్యాలు మారుతున్నాయి. శతాబ్దాలు గిరగిర తిరుగుతున్నాయి.

ఇరవయ్యో శతాబ్దం మూడొంతుల భాగం గడిచాక, దృశ్యాలు గుర్తుపట లేనంతగా మారి పోయాయి. వంద అంతస్తుల మేడలు, బోయింగ్ విమానాలు, దేవతా వస్త్రాల్ని ఏడం కాలితో తన్నే టెర్లిన్లూ, సింథటిక్‌లూ వాటిని చాలీ చాలనట్లు కట్టుకునే అమ్మాయిలూ...

"అప్పుసామీ! ఇక్కడ పుడతాను!" అన్నాడు బకాసురుడు. గుమాస్తా భవిష్యద్దర్శిని ఆపేశాడు. అది 1990 దగ్గర ఆగింది

ఇరవయ్యో శతాబ్దపు మేడలూ, మిద్దెలూ, విమానాలూ, విహారాలూ చూసి బకాసురుడు మోజపడ్డాడేగానీ, తనకి అత్యంత ముఖ్యమైనది, అంటే తిండి, బొత్తిగా షార్టేజిలో ఉందని గ్రహించలేదు. (బకాసురుడు బండెడు అన్నాన్ని, బండికి కట్టిన దున్నల్తోసహా తినేశాల్ని అని చదువరులు గుర్తించుకోవాలి)

"నేను పుట్టానూ ... ... ఈలోకం పెట్టింది!" అని పాడుకుంటూ, టైఫాయిడ్ మంచి కోలుకున్న పేషెంటులా, కరకరలాడుతున్న ఆకలితో పుట్టాడు బకాసురుడు.

ఎలా పుట్టాడు?

అయోని సంభవుడిలాగా, తల్లిదండ్రుల ప్రసక్తిలేకుండా, ముప్ఫయ్యేళ్ళ వయసులో, దేముడు వెలిసినట్లు ఒక ఇంట్లో వెలిశాడు. ఆ ఇల్లుకూడా రాత్రికి రాత్రే వెలిసింది. నిన్నటివాకా 'చిన్న' మనుషులుగానే ఉన్నవాళ్ళు రాత్రికిరాత్రి 'పెద్ద' మనుషులయి పోవడం, రెండ్రోజులు తిరిగేసరికి బిల్డింగులు లేచిపోవడం జనం చూస్తూనే ఉన్నారు కాబట్టి, బకాసురుణ్ణి చూసి, 'అసలు నిన్నటిదాకా లేనివ్యక్తి ఒక్కరోజులో ఇంత పెద్దవాడెలా అయ్యాడు?" అన్న మీమాంసలో పడలేదు.

బకాసురుడు బద్ధకంగా కళ్ళుతెరచి ఆవలించి, చూసేసరికి చేతిలో రేషన్ కార్డుంది. దానిమీద 'కె. బకాసుర్రావ్' అని రాసిఉంది. జేబులోకాసిని డబ్బులున్నాయ్. అతనికీ ఆకలేసింది. వంటింట్లోకెళ్ళి చూశాడు. డబ్బాలన్నీ ఖాళీగా ఉన్నాయ్. ఆ కార్డునే తినాలేమో అనుకుని కొరికి చూశాడు.

సహించలేదు.

విలుకలు వంటింటో మానేసి అతని కడుపులో పరిగెత్తడం మొదలెట్టాయి– కాసేపు అటూ ఇటూ తారట్లాడి, తర్వాత బజార్లో పడ్డాడు ఒక పెద్దమనిషికి ఆ కార్డు చూపించి, "ఇదేమిటి?" అన్నాడు.

"అది రేషన్‌కార్డు ఏం ? నీకొద్దా ?" అన్నాడాయన ఆశగా.

బకాసురుడుకార్డునిగట్టిగా పట్టుకున్నాడు.

"దీనితో ఏంచేయాలి?" అన్నాడు తెలివిగా.

"రేషను షాపుకెళ్ళి అది చూపిస్తే, చక్కెరా, బియ్యం, గోధుమలూ ఇస్తారు ! తెచ్చుకో పో !"

"ఇంటికెళ్ళి సంచులు తీసుకెళతాను" అంటూ బకాసురుడు వెనక్కి తిరగ బోయాడు

"భలేవాడివే ! సంచుల్లేకుండా వస్తాయను కుంటున్నావేమిటి సామాన్లు ! జేబులో పోయించుకో ! వెళ్ళు !" అన్నాడాయన.

బకాసురుడు ఆయన మాటలు నమ్మకుండా ఇంటికెళ్ళి, సంచులు తీసుకుని, రేషను షాపుముందర క్యూలో నిలబడ్డాడు.

రెండు గంటలు గడిచాయి. నత్తలా మెల్లగా నడుస్తోంది క్యూ. కొంతమంది బార్బర్లు "క్షౌరం ? క్షౌరం ?" అంటూ క్యూ పొడుగూతా విచారణ చేస్తున్నారు. నెలరోజుల్నుంచీ క్యూలో నిలబడి, బరివి గెడ్డాలు పెరిగి బార్బేరియన్స్‌లాగా ఉన్న వాళ్ళు, ఆ బార్బర్లని పిలిచి, కాస్త అసింటా జరిగి, క్షౌరకల్యాణం చేయించుకుంటున్నారు.

ఇంతలో క్యూలో బకాసురుడి ముందునిలబడ్డ గడ్డముక్కు పెద్దమనిషి ఇటుకేసి తిరిగి, "సార్ ! రేపే తెల్లార్తే పండుగ ! పండక్కి అల్లుడొచ్చాడు. కాస్త గెంటడో జులపాటు అతన్ని దువ్వి, ఓ జతబట్టలు పెట్టి, రైలెక్కించి వస్తాను కాస్త నా ప్లేస్ చూస్తూ ఉండండి" అన్నాడు.

"సరే !" అని తలూపాడు బకాసురుడు.

గ. ము. పె. మ. పరిగెత్తి ఇంటి దారి పట్టాడు.

ఇంతలో బకాసురుడికి అరఫర్లాంగు దూరంలో నల్లచొక్కా వేసుకుని క్యూలో నిలబడ్డ పెద్దమనిషి దగ్గరికి ఎవరో పరిగెత్తుకొచ్చి "సార్సార్ ! మీ కొడుకు పుట్టాడు !" అన్నాడు రొప్పుతూ

వెంటనే ఆ పెద్దమనిషి ముఖం వివర్ణమయింది. "అసంభవం ! గత పదకొండు నెలలుగా నేనీ క్యూలోనే నిలబడి ఉన్నానే!" అన్నాడు. ఆయన మొహంలో అనుమానపు ఛాయలు కనబడ్డాయి.

ఆ వార్తాహరుడు తటాపటాయించి, "తమరు ఆనందరావుగారు కాదా? నల్లచొక్కా వేసుకుని క్యూలో నిలబడి ఉంటారు వెళ్ళి కబురు చెప్పిరా ! అని తరిమారండీ" అన్నాడు బిక్కమొహం పెట్టి.

"ఎవడిదోయ్ నల్ల చొక్కా ? ఇది మల్లెపువ్వులాంటి తెల్లచొక్కా ! పదకొండు నెల్లపాటు ఏకధాటిన వేసేసరికి నల్లబడింది ! అంతే !" అన్నాడు న. చొ. పె. మ

ఇంతలో సంచీలో చక్కెర పోయించుకుని విజయగర్వంతో తిరిగివస్తున్న ఇంకోమానవుడు ఈ కలకలంవిని "నేనే ఆనందరావుని. ఏమిటి విశేషం ?" అన్నాడు ఆయనా నల్లచొక్కానే వేసుకుని ఉన్నాడు.

"మీకు కొడుకు పుట్టాడండోయ్ !" అన్నాడు వార్తాహరుడు ఉత్సాహం పుంజుకుని.

కాని అరెండో నల్లచొక్కా ఆయనకి మాత్రం "పుత్రోత్సాహము తండ్రికి......" అన్న పద్యం గుర్తురాలేదు. "రేపే రేషన్ ఆఫీసుకెళ్ళి ఇంకో యూనిట్ పెరిగినట్టు కార్డులో రాయించుకోవాలి" అనుకున్నాడు దిగులుగా.

క్యూలో ఉన్న జనమంతా ఆయనకి "హార్టీ కంగ్రాచ్యులేషన్స్ ! !" చెప్పి, తమ సంవత్సర 'క్యూ' అనుబంధాన్ని పురస్కరించుకుని స్వీటు ఇప్పించాలని కోరారు ముక్తకంఠంతో.

"జేబులో డబ్బుల్లేవు" అన్నాడాయన.

"పంచదారకంటే తీపి అయిన పంచదార ఉందిగా ! అదే పంచండి!" అన్నారందరు.

విధిలేక సంచీలోంచి గుప్పెళ్ళతో పంచదార తీసి క్యూలో ఉన్నవాళ్ళకి పంచడం మొదలెట్టాడు.

"మహాప్రసాదం !" అంటూ ఒకాయన దోసిలిపట్టి పంచదార అందుకుని,అది నోట్లో పోసుకోకుండా సంచిలో పోసుకున్నాడు. అందరూ అదేపద్ధతి అవలంబించి, చక్కెర గుప్పెళ్ళతో అందుకుని, సంచుల్లో పోసుకున్నారు. మొదటి పదిమందికి పంచేసరికి పంచదార అయిపోయింది. ఆయన మళ్ళీ షేక్‌స్పియర్ మొహం పెట్టుకుని క్యూలో

వచ్చి నిలబడ్డాడు. ఈ లోగా అల్లుణ్ని దుడానికెళ్ళిన గడ్డముక్కు పెద్దమనిషి హుషావిడిగా క్యూలో పునః ప్రవేశం చేశాడు.

"అల్లుడెళ్ళాడా?" అన్నాడు బకాసురుడు పలకరింపుగా.

"ఆఁ! నామొహం! అలిగికూర్చున్నాడు!"

"ఎందుకూ అలక? స్కూటర్ కోసమా?" అన్నారెవరో.

"బట్టలా ?" అన్నారింకెవరో.

"స్కూటరూ, బట్టలయితే ఎక్కడో అక్కడ అప్పోసొప్పో చేసికొని పెట్టకపోయాను. అదికాదుట! మా చక్కెరకోటా ఈనెలది, పండక్కి ఇచ్చే ఎక్స్‌ట్రాతో సహా తనకివ్వెయ్యమంటాడు. దీనికి మా అమ్మాయి రికమండేషనూ !"

క్యూ జరిగింది. గ. ము. పె. మ. సంచీలో చక్కెర పోయించుకోగానే ఒక శాల్తీ గద్దలా వాలి, ఆసంచీ అందుకుని, "వస్తామావఁ గారూ !" అంటూ రిక్షాలోకిగెంతి స్టేషన్ వైపు సాగిపోయింది.

బకాసురుడు ఇదంతా మిడిగుడ్లు వేసుకుని చూస్తున్నాడు. అలవాటు లేని ఆవశోసన కావటం వల్ల అతనికి క్యూలో నుంచోటం ప్రాణాంతకంగా ఉంది. అప్పుడే నాల్రోజులు గడిచిపోయాయ్.

స్వర్గ ద్వారాలా కనబడుతున్న ఆ షాపు తలుపులు హఠాత్తుగా మూసుకుపోయాయి. "స్టాకయి పోయింది 'ట'!" "స్టాకయిపోయింది 'ట'!" అని హాహాకారాలు వినపడ్డాయి. క్యూ మాత్రం చెదరి పోలేదు. రబ్బరు పాములా అలాగే కదలకుండా ఉంది, మళ్లీ రావాల్సిన స్టాకుకోసం ఎదురుచూస్తూ.

బకాసురుడికి శోష వచ్చింది—

"లావు ఒక్కింతయు లేదు... ప్రాణాలు ఠావులు దప్పుతున్నాయి..." అని గోల పెట్టడం మొదలెట్టాడు బక్క చిక్కిన బకాసురుడు.

*   *   *

అలవైకుంఠ పురంబులో, ఆమూల సౌధంలో పడుకుని, లక్ష్మీదేవి పమిటకొంగు నలుపుతూ పరధ్యాన్నంగా ఉన్న విష్ణుమూర్తి చటుక్కున లేచి, చెవులు రిక్కించి విని, పరిగెత్తబోయి, హఠాత్తుగా కాలు బెణికిన వాడిలా ఆగి, మళ్ళీ వచ్చి లక్ష్మీదేవి కొంగు పట్టుకున్నాడు.

"ఏం గిరాకి? మళ్ళీ ఇంకో గజేంద్రుడు మొసలినోట్లో చిక్కుకున్నాడా?" అంది లక్ష్మీదేవి.

"కాదు. వీడెవడో రేషను షాపు క్యూలో చిక్కుకుని రక్షించమని రంకెలేస్తున్నాడు."

"పోనీ రక్షించగూడదూ పాపం!" అంది లక్ష్మీదేవి విలాసంగా.

విష్ణుమూర్తి చిన్నబుచ్చుకున్నాడు.

"మీరిమధ్య బొత్తిగా ఇల్లు కదలడం మానేశార్లెండి! పాదసత్మానం నా కొంగు పట్టుకుని కాలక్షేపం!" అని మెత్తగా ఒకటి అంటించి, డబ్బులు పోలిథిన్ బాగ్సులో మూటలు కట్టడం పూర్తి చేసింది.

"డబ్బు బట్వాడానా ?" అన్నాడు విష్ణుమూర్తి ఎకసెక్కెంగా. 'ఎవరెవరున్నారివ్వాళ్టి లిస్టులో ?"

లక్ష్మీదేవి నవ్వుతూ లిస్టు చూపించింది. అందులో మొదటిపేరు చూడగానే విష్ణుమూర్తి ఉలిక్కిపడ్డాడు.

"రేషనుషాపు ఓనరు రాజారావా! వాడి షాపుముందే నాభక్తులు అల్లల్లాడుతున్నారు. వాడికి డబ్బులివ్వకు!" అన్నాడు కంగారుగా.

"ఏం ? ఎందుకని ? అతనికి లక్ష్మీకటాక్షముంది. చేతనైతే మీ భక్తుని మీరూ రక్షించుకోండి." అంది ఓరగా చూస్తూ.

"నీవేతప్ప ఇతఃపరంబెరుగ— ..." అని బకాసురుడి గొంతు వినబడుతోంది. విష్ణుమూర్తి శ్రద్ధగా విన్నాడు. ఆయన మొహంలోకి కళవచ్చింది. "అదెక్కడో విన్న గొంతే... ... ఆఁ! బకాసురుడు !" అంటూ లక్ష్మివైపువిజయగర్వంతో చూసాడు. "లక్ష్మీ! ఓడిపోయావ్ ! యుగధర్మాన్ననుసరించి రాక్షసులూ, భూతాలూ, పిశాచాలూ నీ భక్తులు ఉండాలి. కానీ, రాక్షసుడయిన బకాసురుడు నీ పార్టీలోంచి నా పార్టీలోకి దూకేశాడు!"

లక్ష్మీదేవి పెద్దగా లక్ష్యపెట్టలేదు. "మీసంగతి వాడికి బాగా తెలిసిరావాలని నేనే వాణ్ణి మీక్యూలో పడేశాను. ఏమాత్రం ఉద్ధరిస్తారో ఉద్ధరించండి చూద్దాం! మీశక్తిసామర్థ్యాలు ఏపాటివో అర్థమయ్యాక వాడికి జ్ఞానోదయం కలిగించి వాణ్ణి కటాక్షిస్తాను." అంది. "నువ్వెప్పుడూ నాకెగస్పార్టీనే !" అన్నాడు విష్ణుమూర్తి మొహం గంటుపెట్టుకుని.

*   *   *

నానాకడగండ్లుపడి బకాసురుడు క్యూతల దగ్గరికి చేరాడు. ఒక కిలో చక్కెరా, ఐదు కిలోల గోధుమలూ, పదికిలోల బియ్యం అతని సంచుల్లో పోశారు. అవి శాంపిలేమో అనుకుని నోట్లోవేసుకు చప్పరించేసి "అధ్వాన్నంగా ఉన్నాయి! మంచిరకం లేవా?" అని అడిగాడు.

"జరుగు! జరుగు!" అన్నాడు షాపు ఓనరు.

"పోనీ అవే పొయ్యండి."

"పోశాంగద, ఇంకేటి పోసేది?"

"అవి శాంపిలు కాదూ?" అన్నాడు బకాసురుడు తెల్లబోతూ.

బకాసురుణ్ణి నెట్టేశారు. అతని వాలకం చూసి ఒకాయన జాలిపడ్డాడు.

"ఇలా రేషన్ షాపులోనే కాకుండా బయట కూడా అమ్ముతారు, బియ్యం, గోధుమలూ! కొనుక్కోండి! బొత్తిగా ఏం తెలీనట్టుంది పాపం!"

పక్కనే ఉన్న ఒక షాపులోకి వెళ్ళాడు బకాసురుడు. షాపులో అరలన్నీ ఖాళీగా వున్నాయి. అయినా వ్యాపారం ఉధృతంగా సాగుతోంది. రాక్షస మాయలాగా ఖాళీ అర

కవి

నేను కవిని
మధువు పుచ్చుకొని
మగువ నుంచుకొని
పిండివంటలతో భోంచేసి
పచ్చకర్పూరపు కిళ్ళీ వేసి
ఏడంతస్తుల మేడలో
ఏసి రూములో
కుషను కుర్చీలో
కూర్చొని
కాలే కడుపులగురించి
పేదవారి బతుకులగురించి
ఆకలి కవిత్వం వ్రాస్తాను
మీరు చూస్తారు కవిత్వం
నాకు చేస్తారు సన్మానం
అందుకే
నేను పోతున్నాను పైపైకి
మీరు దిగజారిపోతున్నారు లోలోనికి

— "శ్రీవాణి"

ల్లోంచే సామాన్లు తెప్పిస్తున్నాడు దుకాణాసురుడు.

“ఏం కావాలి?” అన్నాడు బకాసురుణ్ణి చూసి జవాబు వినకుండానే “లేవు!”

బకాసురుడి రేషన్ కార్డు

అన్నాడు.

“చక్కెరా, బియ్యం, గోధుమలూ”

“లేవు! ఎంత కావాలి?”

“నాకు సరిపడా!”

“లేవు! ఎక్కడుంటారు మీరు?”

‘లేవు’ అనేది దుకాణాసురుడి ఊతపదం వి

గహి చాడు బకాసురుడు.

"ఈ పక్క సందులో! కొత్తిల్లు!" అన్నాడు.

"లేవు! పాపం కొత్త వాళ్ళు కదాని ఇస్తున్నా! డబ్బులియ్యండి!"

"ఎంత?" అన్నాడు బకాసురుడు అజ్ఞానం కొదీ.

దుకాణాసురుడి మొహం సీరియస్‌గా అయిపోయింది. 'లేవు! ఫో!" అన్నాడు.

పక్కనున్న వాళ్ళు బకాసురుణ్ణి మందలించారు. "పెద మనిషిని, రేటెంతా, గీటెంతా అని నిలియ్యొచ్చా? చేతిలో ఉన్న సంచీ, జేబులో ఉన్న డబ్బూ, వారి చేతిలో పెట్టి లెంపలేసుకో!" అన్నారు

బకాసురుడు మారుమాటాడకుండా జేబులో ఉన్న మూడొందలూ, చేతిలో ఉన్న మూడు సంచులూ దుకాణాసురిడి చేతిలో పెట్టాడు. అతను మూడొందలుగల్లా పెట్టిలో వేసుకుని మూడుపావలాలు తిరిగిచ్చాడు. సంచుల్లో శాస్త్రార్థం కొది కొద్దిగా చక్కెరా, గోధుమలూ పోశాడు. అక్షింతల్లాగా కాసిని బియ్యపుగింజలు కూడా చల్లాడు.

దార్లోనే ఫుట్‌పాత్‌మీద నిలబడి అవి ఊదేశాడు బకాసురుడు. అతని కడుపు నిండలేదు.

రోజులు భారంగా గడుస్తున్నాయి. పాత కాలపు వితంతువులా అతను పేలాలు, మరమరాలూ, ఉప్పుడుపిండీ ఒంటిపూట ఫలహారంచేసి బతుకుతున్నాడు. అతనికడుపు నిండట్లేదు ... మండుతోంది.

ఒకానొక రోజున అతను బజార్లో వెళుతుంటే ఒకబోర్డు అతని చూపులకి కళ్ళెం వేసింది.

'ఆనందవిలాస్ – కాఫీ మరియూ భోజన హోటలు'

ఎగిరి గంతెయ్యాలనిపించింది! ఆబోర్డునే అప్పడంలా తినెయ్యాలనిపించింది.

రేషన్‌షాపుల్తో, కిరాణా షాపుల్తో అవసరంలేకుండానే కడుపునిండే ఈ అయిడియా ఇన్నాళ్ళనుంచీ తనకెందుకు తట్టలేదూ ?

వెళ్ళి హోటల్లో కూర్చున్నాడు. టేబులంత విస్తరేసి, అమ్మవారి కుంభంలా అన్నం వడ్డిస్తారని ఎదురుచూస్తున్నాడు.

అతని ముందు చిన్న కంచం పెట్టి, దాన్లో పిడికెడు మెతుకులు పెట్టి, ఉద్ధరిణలాంటి గరిటతో ఒక్కసిసరుకూరా, కొద్దిగాకూటూ, కొద్దిగా సాంబారూ, చారూ వడ్డించారు.

తిని చూశాడు బకాసురుడు. అన్ని పదార్థాలూ ఒకే రుచితో ఉన్నాయి. కూరలో కొద్దిగా నీళ్ళు కలిపి పలచన చేసే అది కూటయినట్టూ, దాన్లో ఇంకాసిని నీళ్ళు కలిపి సాంబారూ, దాన్లో మరిన్ని నీళ్ళు కలిపి రసమూ తయారు చేసినట నిపించింది.

"ఏమిటీ కూడు ?" అన్నాడు కడుపు మండి.

"సొరకాయ కూటు– మళ్ళీ వెయ్యరు" అన్నాడు సర్వరు

"కూటు కాదు. 'ఏమిటీ కూడు?' అంటున్నాను" అన్నాడు బకాసురుడు. సర్వారావు అప్పటికే మూడు టేబుళ్ళు దాటిపోయాడు. బకాసురుడు తినడం మొదలెట్టకముందే అయిపోయింది అన్నం.

అలా ఒక నెల గడిచింది.

భూలోకంలో నెల గడిచేసరికి అతనికి ఒకప్పుడు తను నరకంలో గడిపిన రోజులు 'బంగారు రోజుల్లా' అనిపించ సాగాయి. నరకంలో ఎవరే పాపం చేశారో తెలిసిఉండేది. ఏపాపాని కెంత శిక్షో అందరికి తెలిసి ఉండేది. ఆ శిక్ష పూర్తి కాగానే వదిలేసేవారు. ఇక్కడలా కాదు!

మరుసటి నెల మొదటి తారీఖున బకాసురుడు భోజనాని క్కూర్చున్నాడు. ప్లేటు తెచ్చిపెట్టాడు సర్వరు.

"ఇడ్లీ తెచ్చావేవిటి? మీల్సు తీసుకురా" అన్నాడు బకాసురుడు.

"అది భోజనమే! సరిగ్గా చూడు!" అన్నాడు అప్పుడే అటు వచ్చిన ప్రొప్రైటరు.

బకాసురుడు మొన్న ఎగ్జిబిషన్లో కొనుక్కున్న భూతదం జేబులోంచితీసి చూశాడు.

అది అన్నమే! సరిగ్గా రెండిడ్లీ లస్సైజులో రెండు ముద్దలు! కూటు వుంది కూరలేదు! సాంబారు ఉంది, అప్పడం లేదు! మజ్జిగుంది పెరుగులేదు! నిన్నటికీ, ఇవాళ్టికీ చిక్కిసగమై పోయింది భోజనం !

"ఇంత తగ్గించారేం ?" అన్నాడు బకాసురుడు పెద్దగొంతుతో.

"ధరలు తగ్గించాం!" అన్నాడు యజమాని.

"ధరలు తగ్గించడం మాట అలాఉంచు, భోజనమెందుకు తగ్గించారు ?"


"... ... ..."

"నువ్వు ధరతగ్గించింది యాభై పైసలు! భోజనం రూపాయిది తగ్గించావ్ ధరలు తగ్గించడంవల్ల నీకేలాభం! మాక్కాదు."

"... ... ..."

"చెప్పవేం ?"

యజమాని జవాబు చెప్పకుండా బకాసురుడి మొహంలోకే చూస్తున్నాడు అతని మొహంలో ఆశ్చర్యం కనబడుతోంది. హఠాత్తుగా బకాసురుడికి కూడా అవ్యక్త



బకాసురుడి రేషన కార్డు

మయిన అనుభూతి ఏదో కలిగింది కే! తెయ్యడం మానేసి యజమానిని పరీక్షగ చూస్తున్నాడు.

"నువ్వు ... .. నువ్వు..." అంటున్నాడు యజమాని.

బకాసురుడు భూతద్దంలోంచి యజమాని వైపుచూశాడు. అందులో యజమాని భూతంలా కనబడ్డాడు.

"నువ్వు... నువ్వు... జనపీడుడనే భూతానివి. అవునా?" అన్నాడు బకాసురుడు అనుమానిస్తూ. అతనికి క్రమంగా తనెవరో గుర్తొస్తోంది.

"నువ్వు బకాసురుడివి! ఎన్నాళ్ళకు కలుసుకున్నాం! ఇంతకీ అసలెప్పుడు పుట్టావ్" అన్నాడు జనపీడుడు ఆనందంగా.

"రెణ్ణెళ్ళయింది" అన్నాడు బకాసురుడు సంతోషంగా. "ఇంకా ఎవరెవరున్నారు మనవాళ్ళిక్కడ ?"

"వాళ్ళా వీళ్ళా అని ఏమిటి? మన వాళ్ళంతా ఇక్కడే ఉన్నారు. నువ్వు భోంచెయ్! అందర్నీ ఒకసారి తిరగేసి వద్దాం!" అని ఆగి "నువ్వీ గడ్డి తింటున్నావేమిటి? మనుషుల్ని తింటం లేదా? పథ్యమా?" అన్నాడు.

"మనుషుల మధ్యనే ఉంటూ మనుషుల్ని తింటే గొడవైపోదూ?"

జనపీడుడు బకాసురుడి అమాయకత్వానికి జాలి పడ్డాడు.

"ఛఛ! అలాంటిదేం లేదు! మనుషుల్ని వేయించుకుతిను. పీక్కుతిను! వాళ్ళ రక్తం కూల్‌డ్రింక్‌లా స్ట్రాతో తాగు. వాళ్ళనుకోసి ఉప్పులో అద్దుకుతిను. అడిగే దిక్కుండదు. మేమంతా ఎలా బ్రతుకుతున్నాం మరి?"

"నిజంగా !"

"పైగా, బియ్యం, గోధుమలూ, చక్కెరా వీటికి కరువేమోగాని మనుషులు మాత్రం షార్టేజి కాదు."

"మరి నా రేషన్ కార్డు ?" అన్నాడు.

"రేషన్ కార్డుమీద 'ముఖ్యాహారం' అని ఒక కాలం ఉంటుంది. నీ కార్డుమీద 'బియ్యం' అని రాసి వుందా? అందుకే నీకీ కష్టాలు! రేపే వెళ్ళి ఆ కాలంలో బియ్యం అనేది కొట్టేయించి "ముఖ్యాహారం — మనుషులు" అని రాయించుకో! నీ తిండికి

...కా ఉండదు'' అన్నాడు జనపిడుడు.

బకాసురుడికి జ్ఞానోదయమైంది. పూటకి ...లు గురు చెప్పిన మనుషుల్ని తినడం మొద...ల్నాడు. కానీ చిత్రం! తిన్నకొద్దీ ఆక...క్కువవుతోంది! ''ఆకలి ఆరోగ్యానికి గుర్తు! బెంగ పడకు'' అన్నారు సాటి రాక్షసులు.

* * *

లక్ష్మి విష్ణుమూర్తి వైపు చూసి అల వోకగా నవ్వింది. ఆ నవ్వులో వేళాకోళం కనబడుతోంది.

''వేళాపాళా లేకుండా వేళాకోళాలంటే నాకు గిట్టదు'' అని జనాంతికంగా అని, ''ప్రిస్టేజి ఇస్యూ అయిపోయింది! ఇక లాభం లేదు! అవతార మెత్తాల్సిందే!'' అనుకున్నాడు విష్ణుమూర్తి.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక పరిశీలనార్థం పంపే బొమ్మలు, ముఖచిత్ర రచనలు పంపేవారు కూడా వాటితోపాటు తగినన్ని తపాలా బిళ్లలు అంటించిన కవరును జతపరచకపోతే అవి త్రిప్పి పంపబడవు. -సం.

చనుబాలే బిడ్డకి శ్రీరామరక్ష !



పిల్లలకి డబ్బాపాలు, సీసాపాలు వాడడం కన్నా తల్లి పాలిచ్చి పెంచడం అత్యుత్తమం, అత్యవసరం అని ప్రపంచ ఆరోగ్య మహాసభ– ప్రపంచ శిశు ఆరోగ్య పరిశోధనల నిపుణులు గట్టి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మార్కెట్‌లోకి రకరకాల పేరుతో వస్తున్న "శిశు ఆహార" పదార్థాల పాలడబ్బాలు హానికరం అని కూడా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అంతేకాదు, ప్రపంచ వ్యాప్తంగా డబ్బా పాలు తల్లి పాలకన్నా మంచివి అంటూ రకరకాలుగా చేస్తున్న వివిధ కంపెనీల ప్రకటనలను నిషేధించాలని– 'తల్లి పాలకన్నా మిన్న' అన్న ప్రకటన ఏ పాలపొడి కంపెనీ వాడుకోరాదని కూడా సమితి శిశుసంక్షేమ సంస్థ మహాసభ తీర్మానించింది.

తల్లి పాలను మించిన కృత్రిమమైన ఆహారం మరొకటి వుండటం సాధ్యంకాదని వారి అభిప్రాయం.

ఈ ముఖ్య సందేశమును మీ మిత్రులకు, బంధువులకు తెలియజేసి వారికి మేలుచేయండి.

శ్యాం నాటికలు

రచన శ్రీ బాదరాజు శ్యామసుందర్. తెలుగు నాటకరంగ శత వార్షికోత్సవ కానుకగా స్పందన సాహితీ సమాఖ్యవారు ప్రచురించిన ఈ పుస్తకములో 'నాలుగు స్తంభాలాట', 'స్టూడెంట్స్ రూమ్', 'ప్రేమ చెల్లించిన మూల్యం', 'బహిష్కారంతో. . . పరిష్కారం', 'మోహినీ భస్మాసుర' నాటికలున్నాయి. వెల పది రూపాయలు. ప్రతులకు రచయిత పేర లంధా సైంటిఫిక్ కంపెనీ, మచిలీపట్నం—521001కి గానీ లేదా స్పందన సాహితీ సమాఖ్య,26—162,బుట్టాయి పేట, మచిలీపట్నంకి వ్రాయవచ్చు.

అవీ...ఇవీ...అన్నీ

సాయి తత్వం

షిర్డి సాయిబాబావారి తత్వమును తెలిపేఎన్నో మననయోగ్యములైన విషయాలు ఈ చిన్ని పుస్తకంలో పొందు పరచారు రచయిత శ్రీ గుడిపాటి శ్రీహరికృష్ణ. 36 పేజీలుగల దీని వెల మూడు రూపాయలు. ప్రతులకు రచయితపేర త్యాగరాజ నగర్, రాజమండ్రి—533101కి వ్రాయాలి.

కొలసాని వెంకట సుబ్బయ్య చౌదరి

సంస్మరణ సంచిక ఈ సంచికలో చిలుమూరు శ్రీరామా రూరల్ కళాశాల స్థాపకులైన కీ. శే. వెంకట సుబ్బయ్యచౌదరిగారి గురించి ప్రముఖుల రచనలు, సంతాప సందేశాలు, కళాశాల విద్యార్థుల, అధ్యాపకుల రచనలు, ఛాయా చిత్రాలు ఎన్నో ఉన్నాయి. ప్రతులకు ప్రధాన సంపాదకులైన శ్రీ కె. ఎం. మధుసూదనరావు, శ్రీ రామా రూరల్ కాలేజి, [గురుకులం], చిలుమూరు, [వయా] అనంతవరం, తెనాలి ఆర్. ఎం. ఎస్. [గుంటూరు జిల్లా]కి వ్రాయవచ్చు.

శిలాలోలిత

కవితా సంపుటి. రచన కీ శే. శ్రీమతి రేవతీదేవి. 50 పేజీలు వెల:రు.6-50 ప్రతులకు :నవోదయ పబ్లిషర్స్. న్యూస్టూడెంట్స్ బుక్ సెంటర్, విజయవాడ—2లేదా ప్రియబాంధవి ప్రచురణలు, తిరుపతి.

బ్రహ్మ జిజ్ఞాస

[శివ శక్తుల తత్వము అచల మత పరిశీలనము అను చతుర్థ భాగము] శ్రీ మద్రిబోయిన రామ సుబ్బయ్యగారి పరిశీలక గ్రంథం. 700 పేజీలు. వెల: 35రూపాయలు. ప్రతులకు : శ్రీ డి. వి. సుబ్బన్న, [అడ్వొకేటు] 52.79 కోటవీధి, కర్నూలుకి వ్రాయవచ్చును.

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3.
Editor : S. Radhakrishna.

Regd. No. H/VJ-41 ANDHRA SACHITRA VARA PA

